సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15

సంచిక: 300

శనివారం 21-1-2023



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



కూతురు నేర్పిన పాఠం

15 ఏళ్ల వయసున్నప్పుడు 45 ఏళ్లు ఉన్న తనకు కూతురు అక్షత నేర్పిన పాఠం వల్ల తాను ఈ రోజు సామాజిక సేవ చేస్తున్నానని సుధామూర్తి అన్నారు. జైపూర్‌లో జరుగుతున్న లిటరేచర్ ఫెస్టివల్‌లో పాల్గొని తల్లిదండ్రులను, యువతను ఉద్దేశించి తన పుస్తకాల నేపథ్యంలో మాట్లాడారు.

- వివరాలు IIలో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

● పేరెంటింగ్

'పిల్లలతో స్నేహంగా ఉండండి. వాళ్లు తల్లిదండ్రులకు భయపడేలా ఉంచకండి. వాళ్ల నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉంటాయి' అంటున్నారు సుధామూర్తి. 15 ఏళ్ల వయసున్నప్పుడు 45 ఏళ్లు ఉన్న తనకు తన కూతురు అక్షత నేర్పిన పాఠం వల్ల తాను ఈ రోజు సామాజిక సేవ చేస్తున్నానని అన్నారు. 'పిల్లలకు తమ మీద తాము ఆధారపడటం నేర్పాలి. ఆనందం పొందడం నేర్పించాలి. నా తల్లిదండ్రుల నుంచి అదే నేర్చుకున్నాను. నా పిల్లలకూ అదే నేర్పాను' అన్నారు సుధామూర్తి. జైపూర్‌లో జరుగుతున్న లిటరేచర్ ఫెస్టివల్‌లో పాల్గొని తల్లిదండ్రులను, యువతను ఉద్దేశించి తన పుస్తకాల నేపథ్యంలో మాట్లాడారు.



జైపూర్‌లో లిటరేచర్ ఫెస్టివల్‌లో మాట్లాడుతున్న సుధామూర్తి

కూతురు నేర్పిన పాఠం

'పిల్లల నుంచి తల్లిదండ్రులు... తల్లిదండ్రుల నుంచి పిల్లలు నేర్చుకుంటూనే ఉండాలి. అలా జరగాలంటే ఇద్దరి మధ్య భయం లేని సంభాషణ జరిగే వాతావరణం ఉండాలి. తల్లిదండ్రులను చూసి పిల్లలు భయపడేలా ఉంటే తమ మనసులోది చెప్పకుండా ఉంటారు. అప్పుడు ఇరుపక్షాలకూ నష్టం జరుగుతుంది' అన్నారు సుధామూర్తి.

తొలికాలపు మహిళా ఇంజినీర్‌గా, ఇన్ఫోసిస్ దిగ్గజంగా తనకు ఉన్న గుర్తింపు కంటే పుస్తకాలు రాయడం ద్వారా 'దేశానికి అమ్మమ్మ'గా తనకు వస్తున్న గుర్తింపు, తన రాతలూ మాటలూ నవతరం వింటున్న తీరు తనకు ఎంతో ఆనందం కలిగిస్తోందని అన్నారామె. జైపూర్‌లో జరుగుతున్న లిటరేచర్ ఫెస్టివల్‌లో శుక్రవారం క్రిక్కిరిసిన పాఠకుల మధ్య 'మై బుక్స్ అండ్ బిలీఫ్స్' అనే అంశం మీద మాట్లాడారు.

■ **ఆడపిల్ల గొప్పతనం**

'ఆడపిల్ల దేనిలోనూ తక్కువ కాదని నేను నిరూపించదల్చుకున్నాను. మా నాన్న డాక్టర్. నేను డాక్టరైతే బాగుంటుందని అనుకున్నాడు. మా అమ్మ లెక్కల టీచర్. నేను కూడా లెక్కలు టీచరు అయితే సరిపోతుందని భావించింది. కాని నేను అప్లయిడ్ సైన్స్‌లో ఇంజినీరింగ్ చేద్దామని నిశ్చయించుకున్నాను. ఇంజినీరింగ్ మగవారి విద్య అని అప్పటివరకూ భావన. మా నానమ్మ నేను ఇంజినీరింగ్ చదివితే తమ ఇళ్లల్లో కుర్రాళ్లు ఎవరు పెళ్లి చేసుకుంటారని హడలిపోయింది. ఆడపిల్లలు ఇంజినీరింగ్ చేస్తారని తెలియక నేను చదివిన కాలేజీలో లేడీస్ టాయిలెట్ కట్టలేదు. నేను చేరాక కూడా ఈ సెమిస్టర్ అయ్యాక మానేస్తుంది వచ్చే సెమిస్టర్‌లో మానేస్తుంది అని కట్టలేదు. నేను మానలేదు. పట్టుదలగా ఇంజినీరింగ్ పూర్తి చేశాను. జ్ఞానం ఏ ఒక్కరి సొంతం కాదు... అందరిది... అదే నేను నిరూపించాను. ఏ ఇంటి అమ్మాయిలైనా ఇలాంటి పట్టుదలతో ఉండాలి. మీ మీద మీరు ఆధారపడి ముందుకు పోవాలి' అందామె.

■ **కూతురి పాఠం**

'ఇంజినీరింగ్ పూర్తయ్యాక నేను మంచి ఇంజనీర్‌ని అనిపించుకోవాలని... మగవాళ్ల కంటే బాగా పని చెయ్యాలని ఉద్యోగంలో విపరీతంగా కష్టపడేదాన్ని. (భర్త నారాయణమూర్తితో) ఇన్ఫోసిస్ స్థాపించాక లాభాల గురించి పత్రికల్లో వార్తలు వచ్చినా పిల్లలకు అది పెద్ద విషయంగా చూపేదాన్ని కాదు. అంతేకాదు, పది రూపాయలు పిల్లలకు ఇచ్చినా లెక్క అడిగేదాన్ని. ఇలా ఉండగా నా కూతురు అక్షత, అప్పుడు 15 ఏళ్లు ఉంటాయి, తనకు తెలిసిన ఒక పేద పిల్లాడికి కాలేజీలో సీటు వచ్చిందని, ఆ అబ్బాయిని స్పాన్సర్ చేయమని నన్ను అడిగింది. నేను నా పని హడావిడిలో ఆ మాట విని– నువ్వు స్పాన్సర్ చెయ్ అనేశాను తేలిగ్గా. దానికి నా కూతురు భయపడకుండా– అమ్మా... నీకు 45 ఏళ్లు వచ్చాయి. మంచి స్థితిలో ఉన్నావు. ఆదాయం ఉంది. ఒకరికి సాయం చేయగలవు. నాకు నువ్వు పాకెట్ మనీ కూడా ఇవ్వవు. కాని సాయం చేయమనేసరికి నన్ను చేయమంటున్నావు. చేయగలిగిన స్థితిలో ఉండి నువ్వు చేయలేనప్పుడు ఇంకొకరు సాయం చేయాలని ఆశించకు అంది. ఆ రోజు ఆఫీస్‌కు వెళ్లి అలా కూర్చుండిపోయాను. రెండు రోజులు ఆ మాటలు వెంటాడాయి. దాని నుంచే నా ఫౌండేషన్ పుట్టింది. ఫలితం? ఎందరో పేదలకు సాయం చేస్తున్నాను. ఎదుటివాళ్లకు సాయం చేయడంలోని ఆనందం నా కూతురి వల్లే పొందడం నేను నేర్చుకున్నాను' అందామె.


> 'నీ మంచి మిత్రుడివి నీవే... చెడిపోవాలంటే నిన్ను చెడగొట్టుకునేది నీవే... నీలోని మంచి మిత్రుడిని కాపాడుకో' అని చెప్పాలి.
> – సుధామూర్తి

■ **పోల్చి చూసుకోవద్దు**

'పిల్లలకు ఇంకొకరితో పోల్చి చూసుకోవడం నేర్పించవద్దు. నా కొడుక్కు నాలుగో ర్యాంకు వస్తే ఫస్ట్ ర్యాంక్ వచ్చిన పిల్లాణ్ణి కంగ్రాచ్యులేట్ చేయమన్నాను. నేను చేయను... వాడు నాకు పోటీ అన్నాడు. మన కంటే బాగా పని చేసేవారు ఎప్పుడూ ఉంటారు... మన కంటే ప్రతిభ ఉన్నవారిని చూసి ఈర్ష్య పడటం మంచి అలవాటు కాదు అని నేర్పించాను. పిల్లలకు తమతో మాత్రమే తాము పోల్చుకుని చూసుకోవాలని చెప్పాలి. నిన్నటి కంటే ఇవాళ మెరుగ్గా ఉన్నానా అని చెక్ చేసుకుని ఎదిగేలా వారికి తర్ఫీదు ఇవ్వాలి. నీ మంచి మిత్రుడివి నీవే... చెడిపోవాలంటే నిన్ను చెడగొట్టుకునేది నీవే... నీలోని మంచి మిత్రుడిని కాపాడుకో అని చెప్పాలి' అన్నారామె.

'తల్లిదండ్రులు పిల్లలకు దేశం తిప్పి చూపించాలి. మన దేశాన్ని అర్థం చేయిస్తే వారు తాము తెలుసుకోవాల్సింది తెలుసుకుంటారు. ఒంటి మీద చొక్కాలేని పేదలే ఈ దేశాన్ని నిజంగా అర్థం చేయిస్తారు అనే మాట పిల్లలకు చెప్తే దేశం కోసం వాళ్లు ఏం చేయాలో తోటివారికి ఎలా సాయం చేయాలో తెలుసుకుంటారు' అని ముగించారామె.

– జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి



జావేద్ అఖ్తర్

కథలన్నీ సలీమ్‌వి... సంభాషణలు నావి

మొదటిసారి తేటతెల్లం చేసిన జావేద్ అఖ్తర్

(జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి)

బాలీవుడ్ స్టార్ రచయితలు సలీమ్ జావేద్ విడిపోయి ఇంతకాలం అయినా వారు ఇరువురూ ఏనాడూ తాము పని విభజన ఎలా చేసుకున్నారో చెప్పలేదు. ఎన్ని ఇంటర్వ్యూలలో ఆ ప్రశ్న వేసినా సమాధానం దాట వేసేవారు. కాని జైపూర్‌లో జరుగుతున్న లిటరేచర్ ఫెస్టివల్‌లో శుక్రవారం తన పుస్తకం 'టాకింగ్ లైఫ్' విడుదల సందర్భంగా జావేద్ మాట్లాడుతూ 'మేమిద్దరం (సలీం జావేద్) రాసిన సినిమాలన్నింటిలో ప్రతి కథా సలీం నుంచి వచ్చేది. సంభాషణలు నేను రాసేవాణ్ణి. స్క్రీన్‌ప్లే ఇద్దరం సమకూర్చేవాళ్లం' అని తేటతెల్లం చేశాడు. ఈ ఇద్దరి జంట రచనలో జంజీర్, యాదోంకి బారాత్, డాన్, షోలే, దీవార్, శక్తి వంటి సూపర్‌హిట్ బాలీవుడ్ సినిమాలు రూపుదిద్దుకున్నాయి. రచయితలకు సినిమా రంగంలో స్టార్‌డమ్ తెచ్చిన జోడి వీరు. 'మేమిద్దరం అనుకోకుండా కలిశాం. దర్శకుడు రమేష్ సిప్పి వాళ్ల నాన్న దగ్గర నెలకు 750 రూపాయల జీతానికి చేరాం. రాజేష్ ఖన్నా హీరోగా అందాజ్, హాథీ మేరి సాథి రాయడంతో స్థిరపడ్డాం' అన్నాడాయన. బాలీవుడ్‌లో యాంగ్రీ యంగ్‌మేన్ ఇమేజ్‌ను హీరోకు సృష్టించిన ఈ జంట అనిల్ కపూర్ హీరోగా 'మిస్టర్ ఇండియా' (1987) రాశాక విడిపోయారు.

సొంతంగా ఏదైనా సాధించాలనే కల అందరిలోనూ ఉంటుంది. ఆ కల కోసం నిరంతరం శ్రమిస్తేనే అనుకున్న ఫలితాలను అందుకోగలం. కానీ, కుటుంబ బాధ్యతలలో చాలా వరకు కలలు కల్లలుగానే ఉండిపోతాయి. ఉద్యోగం చేస్తున్న రుచివర్మ పరిస్థితి మొదట్లో అలాగే ఉండేది. వ్యాపారం వద్దని అడ్డుకున్న కుటుంబాన్ని మెప్పించింది. కాబోయే తల్లులకు డ్రెస్ డిజైన్స్ పేరుతో రెండున్నర లక్షలతో మొదలు వ్యాపారం మొదలుపెట్టి, రెండేళ్లలో ఏడాదికి 5 కోట్ల టర్నోవర్ చేరుకునేలా కృషి చేసింది. ఉద్యోగం వదులుకున్న పరిస్థితి నుంచి నలుగురికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగిన తన తపన నేడు ఎంతో మందికి స్ఫూర్తినిస్తోంది.



రుచివర్మ

* కృషి

ఉద్యోగం మానేశానని ఇంట్లోవాళ్లు మాట్లాడలేదు..

''మాది బీహార్‌లోని దర్బంగా పట్టణం. మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న బ్యాంకు ఉద్యోగి, అమ్మ గృహిణి. ముగ్గురు అక్కచెల్లెళ్లం. దర్భంగా నుండి ముంబైకి ఫ్యాషన్ డిజైనర్‌గా నా ప్రయాణం సాగింది.

■ **అమ్మ కోరుకున్నదని..**

ప్రతి తల్లిదండ్రిలాగే మా అమ్మ కూడా మేం ముగ్గురం అక్కాచెల్లెళ్లం ఇంజనీర్లు కావాలని కోరుకునేది. ఆమె కల నెరవేర్చడానికి చాలా ప్రయత్నించాను. కానీ, ఆ కోచింగ్ ఖర్చు భరించడం పెద్ద విషయంగా అనిపించింది. అమ్మనాన్నల గురించి ఆలోచించినప్పుడు నా మనసులో చాలా గందరగోళం ఏర్పడింది. ఇవన్నీ ఆలోచించి నా శక్తి మేరకు ప్రయత్నించి, ఆ కోచింగ్ నుంచి ఆరు నెలల్లో తిరిగి వచ్చేశాను.

■ **ఫ్యాషన్ పరిశ్రమ వైపు మనసు**

దర్భంగా భూమి కళలకు ప్రసిద్ధి. మా ఇంటి పక్కన టైలర్‌గా పనిచేసే ఆమె వర్క్ నన్ను బాగా ఆకట్టుకునేది. ఈ విషయం ఇంట్లో చెప్పలేకపోయాను. ధైర్యం తెచ్చుకుని నాకు ఆర్ట్స్ అంటే ఆసక్తి ఉందని, ఇంజినీరింగ్ చదవలేనని నాన్నకు చెప్పాను. నాన్న అంతా గ్రహించి, ఏ చదువు కావాలో దానినే ఎంచుకోమన్నారు. దీంతో నేను నిఫ్ట్‌లో చేరాను.

■ **ప్రతి నిర్ణయమూ కష్టమే**

నిఫ్ట్ పరీక్షలో పాసయ్యాక ముంబైకి వెళ్లాలనే నిర్ణయం కష్టమే అయ్యింది. ఒంటరిగానా?! అని భయపడ్డారు. కానీ, కొన్ని రోజుల ప్రయత్నంలో నా ఇష్టమే గెలిచింది. అది నా జీవితాన్ని మార్చింది. కాలేజ్ నుంచి వెళ్లి ఓ ఎక్స్‌పోర్ట్ హౌజ్‌లో జాయిన్ అయ్యాను. అక్కడ మెటర్నిటీ వేర్ డిజైన్ చేసే అవకాశం వచ్చింది. మూడేళ్లపాటు ఆ ఎక్స్‌పోర్ట్ హౌస్‌లో పనిచేసి చాలా నేర్చుకున్నాను. ఆఫీసు, ఫ్యాక్టరీ ఒకే చోట ఉండడం వల్ల డిజైనింగ్ కాకుండా ప్రింటింగ్, స్టిచింగ్, శాంపిల్, ప్రొడక్షన్ నేర్చుకున్నాను. ఆ వర్క్ నాకు చాలా ఉపయోగపడింది.

■ **ఎక్కడో ఏదో లోటు.**

2012 లో మొదటి ఉద్యోగం వస్తే 2019 నాటికి, నేను నాలుగు కంపెనీలలో డిజైనర్ నుండి సీనియర్ డిజైనర్ స్థానానికి చేరుకున్నాను. ఉద్యోగం చేస్తున్నాను కానీ సంతృప్తి మాత్రం లభించలేదు. పని పెరుగుతూ వచ్చింది. స్థిర జీతం అలవాటుగా మారింది. కానీ ఎప్పుడూ ఏదో మిస్ అవుతున్నట్లు అనిపిస్తుంది. బాల్యంలో టైలర్ ఆంటీని స్ఫూర్తిగా తీసుకుంటే టెన్త్ క్లాస్ వచ్చేనాటికి ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా నా ఆదర్శంగా ఉండేవారు. 'నేను కూడా నా సొంత బ్రాండ్‌ని ప్రారంభించాలనుండేది. నేను ఉద్యోగం కోసమే ఈ కోర్సు ఎంచుకోలేదు.. ఎలా?' అనే ఆలోచనలు నన్ను కుదురుగా ఉండనిచ్చేవి కావు.

■ **ఇంట్లో వాళ్లు మాట్లాడలేదు...**

2019లో ఉద్యోగం మానేయాలని నిర్ణయించుకున్నాను. ఉద్యోగం మానేసినట్లు తల్లిదండ్రులు, భర్తకు చెప్పినప్పుడు వారు సంతోషించలేదు. మొదట నా భర్త చాలా నిరాకరించాడు. తరువాత నా తల్లిదండ్రులు కూడా సెటిల్డ్ లైఫ్ ను ఎందుకు వదిలేయాలి అనే మాటలే. ఇంట్లో ఉన్నవాళ్లంతా బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన వాళ్లే కాబట్టి వాళ్లకు నా బాధ అర్థం కాకుండాపోయింది. నేనే ఓ రోజు నిర్ణయం తీసుకుని ఉద్యోగం వదిలేశాను. ఉద్యోగం మానేసినందుకు నా భర్త కొన్ని రోజులు మాట్లాడలేదు. రీసెర్చ్ వర్క్ చేశాక, వచ్చే 34 నెలల ప్లానింగ్‌ని మా అమ్మ నాన్నలకు చెప్పాను, అప్పుడు వాళ్ళు కొద్దిగా కన్విన్స్ అయ్యారు. నేను రంగంలోకి దిగగానే అసలు గొడవ మొదలైంది.

■ **చులకనగా మాట్లాడేవారు..**

ఈ రంగంలోకి రాకముందే చాలా పరిశోధనలు మొదలుపెట్టాను. మార్కెట్‌లో ఏ సెక్షన్‌కు డిమాండ్ పెరుగుతుందో కనిపించింది. కాబోయే తల్లుల దుస్తుల విషయంలో చాలా లోటు కనిపించింది. ఇంతకు ముందు ఇదే రంగంలో పనిచేశాను కాబట్టి కొంచెం ఆత్మవిశ్వాసం వచ్చి ఈ ప్రొడక్ట్‌ని ఎంచుకున్నాను. అయితే, రంగంలోకి దిగగానే అసలు గొడవ మొదలైంది. వన్ మ్యాన్ ఆర్మీలా అన్నీ నేనే చేయాల్సి వచ్చింది. ఇప్పటి వరకు కేవలం డిజైనింగ్ వర్క్ మాత్రమే చేశాను. కానీ ఇప్పుడు ప్రొడక్షన్ లైన్, లోగో డిజైనింగ్, ప్యాకేజింగ్, డెలివరీ ఫైనాన్స్ లాంటివన్నీ చేశాను. ఎందుకంటే నా దగ్గర బడ్జెట్ తక్కువగా ఉంది, కాబట్టి ఇక్కడ అతిపెద్ద సమస్య ఏర్పడింది. నా అవస్థ చూసి ఎగతాళి చేసినవారున్నారు. చులకనగా మాట్లాడినవారున్నారు. 'ప్రెగ్నెన్సీలో ఉన్న వాళ్లకు డ్రెస్ డిజైన్స్ ఏంటి?!' అని నాతో పని చేయడానికి వర్కర్స్ నిరాకరించేవారు. దీంతో పెద్ద ఇబ్బందిని ఎదుర్కొన్నాను. కానీ, నా పట్టుదలను వదిలిపెట్టలేదు.

రెండేళ్లలో 2.5 లక్షల వ్యాపారం కోట్లకు

కోవిడ్ కాలం అందరికీ కష్టంగా ఉండేది. దీంతో ఆఫ్‌లైన్ పనులు ప్రారంభం కాలేదు. అప్పుడు నా వ్యాపారం ఆఫ్‌లైన్‌లో మాత్రమే చేయాలని ఆలోచించాను. ఇది నాకు ప్రయోజనకరంగా మారింది. కొన్ని ఆన్‌లైన్ మార్కెటింగ్ సైట్స్‌తో మాట్లాడాను. ముందు నా ప్రతిపాదనను వాళ్లు అంగీకరించలేదు. దీంతో నా సొంత సైట్‌లో 'ఆరుమి'పేరుతో కాబోయే తల్లుల కోసం చేసిన నా డిజైన్స్ పెట్టాను. ప్రారంభించిన 24 గంటల్లోనే ఆర్డర్‌లు రావడం మొదలయింది. ఈ రోజు నా బ్రాండ్ అన్ని ఆన్‌లైన్ మార్కెట్‌లోనూ సేల్ అవుతోంది'' అని వివరించే రుచివర్మ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది.



రుచివర్మ రూపొందించిన డ్రెస్‌లో మోడల్

కిచెన్ టిప్స్

● మినప గారెలు చేసేటప్పుడు ఆ పిండిలో కొంచెం బొంబాయి రవ్వ లేదా బియ్యం పిండి కలిపితే హోటల్ లో చేసే విధంగా క్రిస్పీగా వస్తాయి.

● చపాతీలు మృదువుగా రావాలంటే చపాతీ పిండి కలిపేటప్పుడు రెండు స్పూన్ల నూనెను కలపాలి. ఇలా నూనె వేసి కలపటం వల్ల చపాతీ కాల్చే సమయంలో నూనె వేయవలసిన అవసరం ఉండదు.



● పూరీలు చేసినప్పుడు అరకేజీ గోధుమ పిండిలో ఒక గరిట మైదా పిండిని కలిపితే పూరీలు బాగా పొంగటమే కాకుండా క్రిస్పీగా వస్తాయి.

● ధనియాలను వేయించి చల్లార్చి డబ్బాలో నిల్వ చేస్తే పురుగు పట్టకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.

● రసం పిండేసిన నిమ్మ బద్దలను పాడేయకుండా ఫ్రిజ్ లో ఒక మూల పెడితే ఫ్రిజ్ లో దుర్వాసనలు రావు. అలాగే ఫ్రిజ్ ఓపెన్ చేసినప్పుడు తాజా వాసన వస్తుంది.

బ్యూటిప్

జుట్టుకు జింజర్ ఆయిల్

అల్లంలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి జుట్టుకు అల్లం రసాన్ని ఉపయోగించడం వల్ల అనేక జుట్టు సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవచ్చు. ముఖ్యంగా తలలో దురద, తీవ్రమైన చుండ్రు సమస్యలకు చికిత్స చేయడంలో అల్లం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అల్లం జుట్టు కుదుళ్లకు రక్త ప్రసరణను పెంచుతుంది. తద్వారా వెంట్రుకల కుదుళ్లు ఉత్తేజితమై జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తాయి. అల్లంలో జింజరోల్, విటమిన్లు, ఖనిజాలు, కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉన్నాయి. అందువల్ల జుట్టు రాలడాన్ని నివారించడం తోబాటు జుట్టు కుదుళ్ళను బలంగా చేస్తుంది. ఇందుకోసం మార్కెట్‌లో దొరికే జింజర్ ఆయిల్‌ను వాడవచ్చు.

మీ షాంపూతో అల్లం రసం కలపవచ్చు. లేదా అల్లం ఆధారిత షాంపూని ఉపయోగించవచ్చు. నూనెతో పాటు అల్లం రసాన్ని కూడా ఉపయోగించవచ్చు. మీ హెయిర్ మాస్క్‌లకు అల్లం కూడా జోడించవచ్చు.



● డిజిటల్ డీ-టాక్సిఫికేషన్!

డిజిటల్ సర్పం.. విషానికి విరుగుడు



పదిమంది గుమిగూడే స్థలం... అంటే బస్టాప్, రైల్వేస్టేషన్, ఆఖరికి పార్కులకు వచ్చేవారిలో కూడా చాలామంది మొబైల్‌లోనో, ట్యాబ్‌లోనో తలలు దూర్చి కనిపిస్తారు. అవసరం మేరకు ఉపయోగించడానికి బదులుగా, అంతకంటే ఎక్కువగా ఎప్పుడూ స్క్రీన్‌కు అతుక్కుపోవడాన్ని 'డిజిటల్ అడిక్షన్'గా మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. ఇది విషపదార్థాలను మెదడులోకి నింపుకోవడమేననీ, చిన్న చిన్న టెక్నిక్స్ ఉపయోగించి వాటిని శుభ్రం చేయవచ్చని చెబుతున్నారు మానసిక నిపుణులు. ఆ వివరాలివి...

పిల్లలతో పాటు పెద్దలు సైతం మొబైల్స్‌నూ, ల్యాప్‌టాప్స్, ట్యాబ్స్ వంటి వాటిని వాడుతుంటారు. అయితే వారు పెద్దవాళ్లు కావడంతో కుటుంబ బాధ్యతలకూ, ఆఫీసు పనుల కోసం స్క్రీన్ నుంచి ముఖం తప్పించడం తప్పదు.

■ **స్క్రీన్‌కు అతుక్కుపోవడం టీన్స్‌లో ఎక్కువ...**

పిల్లల్లో అందునా టీనేజీ పిల్లల్లో 'స్క్రీన్' పట్ల అడిక్షన్ ఎక్కువ. తమ చదువుల కోసం, కాలేజీల్లో ఇచ్చే టాస్కులు, ప్రాజెక్టుల కంటే ఎక్కువగా సరదా అంశాలూ, సినిమాలు, గాసిప్స్ కోసమే స్క్రీన్ టైమ్‌ను వెచ్చిస్తుంటారు.

■ **అంతకంటే చిన్న పిల్లల్లోనూ...**

ఇక టీన్స్‌లోకి రాని ఎనిమిది, తొమ్మిది నుంచి పన్నెండేళ్ల పిల్లలు సైతం డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌ల్లో తలను ముంచేస్తారు. ఆఖరికి బయటికి వచ్చినప్పుడు కూడా మొబైల్‌లో ఎన్నో రకాల గేమ్స్ ఆడుతూ ఉంటారు. ఒక్కోసారి పిల్లల్ని బయటకు తీసుకొచ్చినప్పుడు వాళ్ల అల్లరి చేయకుండా ఉండేందుకు తల్లిదండ్రులే 'మొబైల్స్'ను వాళ్ల చేతికి అందిస్తుంటారు. అదే అలవాటు వాళ్ల టీన్స్‌లోకి వచ్చాక మరీ ముదిరిపోతుంది. ఓ వయసుకు చేరేనాటికి అది 'డిజిటల్ అడిక్షన్'గా మారిపోతుంది. దీని వల్ల వచ్చే మానసిక సమస్యల విశ్వరూపాల్ని మనం చాలా సందర్భాల్లో చూస్తూనే ఉంటాం. మొబైల్‌లో గేమ్స్ ఆడవద్దన్నందుకు తల్లిదండ్రులతో పోట్లాటలు దగ్గర్నుంచి ఆత్మహత్యల వరకు ఈ దుష్పరిణామాలెన్నో.

■ **డిజిటల్ అడిక్షన్‌ను గుర్తించడమెలా?**

● **స్క్రీన్ ముందు చాలాసేపు గడపడం :** సోషల్ మీడియాలో బ్రౌజింగ్ చేస్తూ, గేమ్స్ ఆడుతూ, సినిమాలు చూస్తే చాలాసేపు గడపడం. దాంతో చదువూ, హోమ్‌వర్క్, వ్యాయామం, ఫ్రెండ్స్‌తో కలవడం వంటి కార్యకలాపాలకు దూరమవుతుంటారు.

● **స్క్రీన్ ముందు నుంచి తప్పించడం చాలా కష్టం కావడం :** పిల్లల చేతుల్లోంచి స్మార్ట్ ఫోన్ లాగేసుకున్నా లేదా కంప్యూటర్ ఆఫ్ చేయమన్నా వాళ్లకు ఇరిటేషన్ వచ్చేస్తుంది. బలవంతంగా మొబైల్ లాగేసినా లేదా కంప్యూటర్ ఆఫ్ చేసినా కోపం రగిలిపోవడంతో పాటు చేతుల్లో ఉన్న వస్తువుల్ని విసిరేసి, వైల్డ్‌గా ప్రవర్తిస్తుంటారు.

● **రోజువారీ పనుల్ని పూర్తి చేయకపోవడం :** తాము రోజూ చేయాల్సిన క్లాస్‌వర్క్‌గానీ లేదా హోమ్‌వర్క్‌గానీ చేయకుండా వదిలేస్తారు. ఈ పెండింగ్‌వర్క్‌ను తప్పనిసరిగా చేయాల్సి వచ్చినప్పుడు అతిగా ఆందోళనపడుతుంటారు.

● **ఒంటరిగా ఉండటం :** వీరు స్మార్ట్‌ఫోన్‌లోని యాప్స్‌తో తప్ప ఇతరులతో కమ్యూనికేషన్‌లో ఉండరు. ఒంటరిగా ఉండటానికే ఎక్కువగా ఇష్టపడుతుంటారు. దేనిపట్లా ఆసక్తితో ఉండరు సరికదా... గతంలో వారికి ఇష్టమైన పెయింటింగ్ లాంటి అభిరుచులకు దూరంగానూ, అనాసక్తితో ఉంటారు.

● **మూడ్ స్వింగ్స్ :** తాము చేసే పని పట్ల ఏకాగ్రత కోల్పోతుండటం, దేని పట్లా దృష్టి కేంద్రీకరించలేకపోవడంతో పాటు త్వరత్వరగా వారి మూడ్స్ మారిపోతుండటం చాలా సాధారణంగా జరుగుతుంటుంది. అంతేకాదు... వారి ప్రవర్తన గమనించి పెద్దవాళ్లు ఫోన్ తీసుకోబోతుంటే దాన్ని దాచుకోవడం, అబద్ధాలు చెప్పడం వంటివీ చేస్తారు.

■ **చక్కదిద్దడానికి చిట్కాలివి...**

పిల్లలు అవసరానికి మించి 'స్క్రీన్'ను వాడటాన్ని తగ్గించేలా చేయడం ఎలాగో మానసిక నిపుణులు అందిస్తున్న కొన్ని సూచనలివి...

● **ముందు మారాల్సింది పేరెంట్సే :** చాలా మంది తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్‌తో చాలా సేపు గడుపుతూ... తమ పిల్లలు మాత్రం వాటికి దూరంగా, క్రమశిక్షణతో ఉండాలనుకుంటారు. ఈ విషయంలో ముందుగా మారాల్సిందీ, పిల్లలకు ఆదర్శంగా ఉండాల్సిందే తల్లిదండ్రులే.

● **ఒకేసారి లాగేయకండి :** అడిక్షన్‌కు లోనైన పిల్లల నుంచి స్మార్ట్‌ఫోన్ /ల్యాప్‌టాప్‌ను ఒకేసారి లాగేయకండి. స్విచ్‌నొక్కినట్టుగా పిల్లలు మారిపోరు. వారు రోజూ డిజిటల్ డివైజ్‌తో ఎంత టైమ్‌ను గడపదలచుకున్నారో వారినే నిర్ణయించుకొమ్మని సూచించండి. నిర్దిష్టంగా ఆ టైమ్‌లో వాళ్లను స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్‌తో ఆడుకోనివ్వండి. క్రమంగా ఆ టైమ్‌ను తగ్గిస్తూ రావాలి తప్ప ఠక్కున మారిపోవడం అంటూ జరగదు. పైగా అలా చేయడం ఇంకా మరికొన్ని దుష్పరిణామాలు దారితీస్తుంది.

● **స్నేహితుల్ని వ్యక్తిగతంగా కలవమనడం:** స్నేహితుల్ని ఫోన్‌లో లేదా వాట్సాప్‌లో పలకరించడానికి బదులు వ్యక్తిగతంగా కలిసి రమ్మనీ, కలిసి ఆడుకొమ్మని ప్రోత్సహించాలి. అంతేకాదు... పెళ్లిళ్లు, పండుగల వంటి సమయాల్లో వ్యక్తుల్ని, బంధువుల్ని ప్రత్యక్షంగా కలవమని, సామాజిక బంధాల్ని బలోపేతం చేసుకోవడం ఎంత అవసరమో చెప్పాలి.

వారీ అలవాటు నుంచి బయటకు వచ్చాక... డిజిటల్ ఉపకరణాలవల్ల వారు కోల్పోయిన అంశాలు, వాటి వల్ల కలిగిన నష్టాలతో పాటు... డీ-టాక్సికేషన్ తర్వాత ఇప్పుడు వారికి ఒనగూరిన/ఒనగూరుతున్న ప్రయోజనాలను వివరించవచ్చు. అప్పుడు వారు డిజిటల్ ఉపకరణాలను మరింత సమర్థంగా ఎలా వాడాలో తెలుసుకుంటారు. అనవసరమైన వాటికి దూరంగా ఉంటూ స్వీయనియంత్రణ పాటిస్తారు.

డిజిటల్ ఉపకరణాల దుష్ప్రభావాలు

నిద్రలేమి, తరచు నిద్రాభంగం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం (లో సెల్ఫ్ ఎస్టీమ్), తరచు తలనొప్పులు, ఒకేచోట కూర్చుని అదేపనిగా గేమ్స్ ఆడుతుండటం వల్ల ఒబేసిటీ, కీళ్లనొప్పులు వంటి అనేక రూపాల్లో కనిపిస్తాయి. అందుకే వీటిని మనకు ఉపయోగపడే మేరకే విచక్షణతో, తెలివిగా వాడుతూ... వీటికి అడిక్ట్ కావడం నుంచి క్రమంగా బయటపడాలి.



డాక్టర్ చరణ్‌తేజ కోగంటి
సీనియర్ సైకియాట్రిస్ట్


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 300

శనివారం 21-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



12 వేల ఉద్యోగాలు కట్..
గూగుల్ ఉద్యోగులకు సీఈవో సుందర్ పిచాయ్ ఈమెయిల్ - 13లో



రెజ్లర్ల నిరసన విరమణ
డిమాండ్ల పరిష్కారానికి కేంద్రం హామీ... ఆందోళన విరమించిన రెజ్లర్లు - 13లో



రూ. 30 లక్షల జరిమానా
విమానంలో మూత్ర విసర్జన ఘటనపై డీజీసీఏ.. ఎయిరిండియా సంస్థకు రూ.30 లక్షల జరిమానా విధించింది.
- వివరాలు 6లో▶



కులగణనను ఆపాలని చెప్పలేం..
బిహార్‌లో కులగణన చేపట్టాలంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీం కొట్టివేసింది.
- వివరాలు 6లో▶



బీజేపీలోకి రాకుంటే...
'బీజేపీలోకి రాకుంటే సీఎం రూపంలో ఉండే బుల్డోజర్‌ను ఎదుర్కోవాలి' అని మధ్యప్రదేశ్ మంత్రి మహేంద్రసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.
- వివరాలు 6లో▶



తెలుగులోనూ 'ఎస్ఎస్‌సీ' పరీక్ష
కేంద్ర ప్రభుత్వం నిర్వహించే మల్టీటాస్కింగ్ (నాన్ టెక్నికల్) స్టాఫ్ సెలక్షన్ కమిషన్ -2022 పరీక్షను తెలుగులోనూ నిర్వహిస్తారు.
- వివరాలు 6లో▶

'ఇంటి' కథ కంచికి!

రోడ్లు-భవనాల శాఖలో గృహ నిర్మాణశాఖను విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

హౌసింగ్ బోర్డు, కార్పొరేషన్, స్వగృహ, డీఐఎల్ అన్నీ ఆ శాఖ పరిధిలోకి..

- రాష్ట్రంలో లక్షల మంది పేదలకు ఇళ్లు నిర్మించిన గృహ నిర్మాణశాఖ, అనుబంధ విభాగాలు... తెలంగాణ ఏర్పాటు తర్వాత పరిస్థితిలో మార్పు
- హౌసింగ్ బోర్డు కింద జరగని నిర్మాణాలు.. స్వగృహ ఆస్తులన్నీ వేలం
- నామమాత్రంగా మారిపోయిన హౌసింగ్ కార్పొరేషన్
- డబుల్ బెడ్రూం పథకం నిర్వహణ కలెక్టర్ల చేతిలోనే..
- పోలీసులు, వైద్యారోగ్య సిబ్బంది ఇళ్లు నిర్మించే సంస్థలూ త్వరలో ఆర్ అండ్ బీ పరిధిలోకి!



సాక్షి, హైదరాబాద్: ఎన్నో దశాబ్దాల పాటు 'పేదింటి'కి పెన్నిధిగా నిలిచిన గృహనిర్మాణ శాఖ కథ కంచికి చేరింది. వేల కుటుంబాలకు నీడను కల్పించిన ఆ శాఖ ఇప్పుడు రోడ్లు-భవనాల శాఖలో విలీనమైంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విలీనానికి సంబంధించి కొన్నిరోజుల కింద జరిగిన కేబినెట్ భేటీలోనే తీర్మానించినా శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గృహనిర్మాణ శాఖలో అంతర్భాగమైన హౌసింగ్ కార్పొరేషన్ (గృహనిర్మాణ సంస్థ), హౌసింగ్ బోర్డు (గృహ నిర్మాణ మండలి), రాజీవ్ స్వగృహ కార్పొరేషన్, హౌసింగ్‌బోర్డుకు అనుబంధంగా ఏర్పాటైన డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (డీఐఎల్) తదితర విభాగాలన్నీ రోడ్లు-భవనాల శాఖ పరిధిలోకి వెళ్లిపోయాయి.

రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచే..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్లకు పనిలేకుండా పోయింది. పేదల ఇళ్లకు సంబంధించి డబుల్ బెడ్రూం పథకాన్ని తొలుత హౌసింగ్ కార్పొరేషన్ పర్యవేక్షించినా.. దాని ఆధ్వర్యంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. సీఎం కేసీఆర్ దీనిపై ఏసీబీతో విచారణకు ఆదేశించి, ఆ శాఖలోని ఉద్యోగులను ఇతర కార్పొరేషన్లు, శాఖల పరిధిలోకి మార్చారు. దీంతో హౌసింగ్ కార్పొరేషన్ నామమాత్రంగా మారింది. డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం అమలును జిల్లా కలెక్టర్లకు అప్పగించటంతో.. రుణాలు తీసుకోవడానికే ఇది పరిమితమైంది. ఒకప్పుడు వందలాది ఉద్యోగులతో కళకళలాడిన ఈ సంస్థలో ప్రస్తుతం 50 మందే ఉన్నారు. వీరికీ లెక్కలు క్రోడీకరించడం మినహా పనిలేకుండా పోయింది. ఇప్పుడు వీరు ఆర్ అండ్ బీ పరిధిలోకి వెళ్తున్నారు.

హౌసింగ్ బోర్డు, 'స్వగృహ' కథ కంచికే!

అల్పాదాయ, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలకు ఇళ్లు నిర్మించి ఇచ్చిన హౌసింగ్ బోర్డు..

మిగతా 2వ పేజీలో ▶

దివిసీమ ఉప్పెన నిరాశ్రయులకు ఇళ్ల నిర్మాణంతో మొదలు..

1977లో కృష్ణా-గుంటూరు ప్రాంతాలను కుదిపేసిన దివిసీమ ఉప్పెనలో నిరాశ్రయులైన పేదలకు గూడు కల్పించేందుకు నాటి చెన్నారెడ్డి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమే.. క్రమంగా గృహనిర్మాణ సంస్థ ఆవిర్భావానికి దారితీసింది. 1979లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్మాణ పథకాన్ని చేపట్టి.. ప్రత్యేకంగా దివిసీమలో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. తర్వాత ముఖ్యమంత్రి అయిన ఎన్టీ రామారావు.. ఈ కార్యక్రమాన్ని మొత్తంగా ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పేదలకు ఇళ్లు కట్టించే పథకంగా మార్చారు. ఏటా లక్షన్నర చొప్పున ఇళ్లు నిర్మించేలా పంచవర్ష ప్రణాళికను చేపట్టారు.

27 నుంచి టీచర్ల బదిలీలు, పదోన్నతులు

37 రోజుల్లో ముగియనున్న ప్రక్రియ

- షెడ్యూల్ విడుదలకు మంత్రి సబిత ఆదేశం
- నేడు విడుదల చేస్తామన్న అధికారులు
- బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో కలెక్టర్లకేపూర్తి అధికారాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది. ఈ నెల 27 నుంచి ఈ ప్రక్రియ మొదలుకానుంది. 37 రోజుల్లో దీన్ని పూర్తి చేయనున్నారు. వీలైనంత త్వరగా అధికారిక షెడ్యూల్ విడుదల చేయాలని విద్యాశాఖ అధికారులను మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం ఒక ప్రకటన వెలువరించింది. శుక్రవారం సాయంత్రం మంత్రి సబిత విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమాలోచనలు జరిపారు. కాగా కొన్ని మార్పుచేర్పులతో శనివారం షెడ్యూల్‌ను విడుదల చేస్తామని అధికారులు తెలిపాయి. దీనికి గతంలో బదిలీలపై విధించిన నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తివేయాల్సి ఉంది.

కలెక్టర్ కన్వీనర్‌గా..

టీచర్ల బదిలీలు, పదోన్నతులపై కొన్ని రోజులుగా అధికారవర్గాలు తీవ్ర కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఉపాధ్యాయ సంఘాలతో ఉన్నతాధికారులు విస్తృతంగా చర్చలు జరిపారు. గతానికి భిన్నంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో కలెక్టర్లకు కీలక బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. ప్రతి జిల్లాలోనూ కలెక్టర్ కన్వీనర్‌గా, జిల్లా పరిషత్ చైర్మన్, సీఈవో సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టే ఆలోచనలో ఉన్నారు. గతంలో జిల్లా పరిషత్ చైర్మన్ టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లో ముఖ్య భూమిక పోషించేవారు. దీనివల్ల అనేక సమస్యలు వచ్చాయని, ఐఏఎస్‌లకు బాధ్యత అప్పగిస్తే ఎలాంటి తలనొప్పులు ఉండవని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

ప్రమోషన్లకు అర్హుల జాబితా సిద్ధం

ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా, ఎస్ఏల నుంచి హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించేందుకు అర్హత గల వారి జాబితాను శుక్రవారం అధికారులు సిద్ధం చేశారు. జిల్లాల వారీగా వీటిని కలెక్టర్ల పరిశీలనకు పంపుతున్నట్టు ఓ అధికారి తెలిపారు. మార్గదర్శకాలపై ఇంకా కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే కోర్టు వివాదాలున్న కారణంగా భాషా పండితుల విషయంలో బదిలీలు, పదోన్నతులు చేపట్టే అవకాశం లేదని అధికార వర్గాలు తెలిపాయి. కాగా షెడ్యూల్ విడుదల రోజునే ఉపాధ్యాయ ఖాళీలను ప్రకటించే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ హాల్‌టికెట్లు



ఈనెల 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగే జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులు శని, ఆదివారాల్లో విడుదల చేసే అవకాశం ఉంది.
- వివరాలు 11లో▶

పక్కాగా ఇన్ఫెక్షన్ల కట్టడి




ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ల నియంత్రణకు వైద్య, ఆరోగ్యశాఖ మార్గదర్శకాలు ఖరారు చేసింది. గాంధీ ఆసుపత్రి రూపొందించిన ఈ మార్గదర్శకాలు ఇన్ఫెక్షన్ల నియంత్రణకు తోడ్పడతాయని పేర్కొంది.
- వివరాలు 11లో▶

'డెక్కన్'లో టెన్షన్



సికింద్రాబాద్ మినిస్టర్స్ రోడ్‌లోని 'డెక్కన్ కార్పొరేట్' అగ్నిప్రమాదంపై ఉత్కంఠ కొనసాగుతోంది. దుర్ఘటనలో గల్లంతైన ముగ్గురి ఆచూకీ ఇంకా లభించలేదు. భవనంలోకి అడుగుపెట్టే పరిస్థితి లేక.. డ్రోన్ల సాయంతో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు.
- వివరాలు 10లో▶

కొత్త భవనంలోనే..



ప్రస్తుత ఏడాది బడ్జెట్ సమావేశాలు పార్లమెంట్ నూతన భవనంలో జరిగే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఒకవేళ సాధ్యం కాకుంటే జనవరి 31 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరిగే తొలి విడత సమావేశాలను పాత భవనంలోనూ, మార్చి 13 నుంచి జరిగే రెండో విడత సమావేశాలను కొత్త భవనంలోనూ నిర్వహించే అవకాశాలున్నాయని అంటున్నారు.
- వివరాలు 6లో▶

మరో రూ. 16,000 కోట్లు

హైదరాబాద్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ భారీ విస్తరణ..

- 2020లోనే 3 డేటా సెంటర్ల కోసం రూ.20 వేల కోట్ల మేర పెట్టుబడుల ప్రకటన
- తాజాగా తమ పెట్టుబడులను రూ.36 వేల కోట్లకు పెంచుతున్నట్లు వెల్లడి
- 2030 నాటికి దశల వారీగా పెట్టుబడులు పెట్టాలని 'ఏడబ్ల్యూఎస్ ఎంపవర్ ఇండియా ఈవెంట్'లో నిర్ణయం
- స్వాగతించిన మంత్రి కేటీఆర్.. దావోస్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో ప్రసంగం





సాక్షి, హైదరాబాద్: ప్రపంచ దిగ్గజ సంస్థల్లో ఒకటైన అమెజాన్ తమ అనుబంధ సంస్థ అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) ద్వారా హైదరాబాద్‌లో మరోసారి భారీ పెట్టుబడులు పెట్టనుంది. నగరంలో మూడు డేటా సెంటర్ల ఏర్పాటు కోసం రూ. 20,096 కోట్ల పెట్టుబడి పెడతామని 2020లో ప్రకటించిన ఏడబ్ల్యూఎస్ తాజాగా తమ విస్తరణ ప్రణాళికలు, వ్యాపార వ్యూహాల్లో భాగంగా 2030 నాటికి దశలవారీగా తమ పెట్టుబడులను రూ. 36,300 కోట్లకు పెంచనున్నట్లు ప్రకటించింది. అంటే కొత్తగా మరో రూ. 16,204 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. శుక్రవారం నగరంలోని హెచ్ఐసీసీలో జరిగిన 'ఏడబ్ల్యూఎస్ ఎంపవర్ ఇండియా ఈవెంట్'లో

మిగతా 11వ పేజీలో ▶

వేగవంత అభివృద్ధి ఉపాధిని సృష్టిస్తోంది

71 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలిస్తూ మోదీ వ్యాఖ్య



'దేశం మరింత అభివృద్ధి దిశగా పయనిస్తోంది. ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయి. కొత్తగా వేలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తున్న ఈ రోజ్‌గార్ మేళానే మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం' అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో కొత్తగా ఉద్యోగాలు పొందిన 71,426 మందికి శుక్రవారం ఆయన ఎలక్ట్రానిక్ పద్ధతిలో నియామక పత్రాలను అందచేసిన సందర్భంగా మాట్లాడారు.
- వివరాలు 6లో▶



నేటి నుంచి నాగోబా జాతర

కేస్లాపూర్‌లోని నూతన ఆలయంలో తొలిసారి మహాపూజ

ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నేటి నుంచి ప్రారంభమయ్యే జాతరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇక్కడ గత డిసెంబర్ 18న ప్రారంభించిన నూతన నాగోబా ఆలయంలో తొలిసారి మహాపూజను వైభవంగా నిర్వహించేందుకు మెస్రం వంశీయులు సన్నద్ధమయ్యారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖమంత్రి అర్జున ముండా మహాపూజలో పాల్గొననున్నారు. 24న జరిగే గిరిజన దర్బార్‌లో రాష్ట్రమంత్రులు పాల్గొంటారు.
- వివరాలు 14లో▶

వంకాయ కూర.. చింతపండు చారు!
- శ్రీ సింగరాయ లక్ష్మీనరసింహస్వామి 'స్పెషల్'
- నేటి జాతరకు ఏర్పాట్లు పూర్తి - 14లో▶

నలుగురిని బలిగొన్న రోడ్డు ప్రమాదం 14 లో



నిజమే! అంత సెన్సిటివ్‌గా ఉంటే పాలిటిక్స్‌కు పనికిరారు!

పాదయాత్రకు రేవంత్ సన్నాహాలు!

- నేటి టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో అనుకూల తీర్మానం
- ఓకే అయితే జూన్ 2 వరకు యాత్ర



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్త పాదయాత్రకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. అధిష్టానం అనుమతి తీసుకున్న తర్వాత భద్రాచలం నుంచి తన 126 రోజుల పాదయాత్రను ప్రారంభించనున్నారు. రాత్రే శనివారం హాజరుకానున్న టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో పాదయాత్రపై ఏకగ్రీవంగా తీర్మానించనున్నట్టు సమాచారం.
- వివరాలు 2లో▶

మలి పర్యటనలో మరింత బిజీగా
రాత్రే వరుస భేటీలు.. కమిటీలతో సమావేశాలు

రేవంత్‌తో కోమటిరెడ్డి భేటీ

2 లో

ఆ మాస్టర్‌ప్లాన్లు రద్దు!

ఫలించిన రైతుల పోరాటం.. కామారెడ్డి, జగిత్యాల పట్టణాల్లో ముసాయిదాలు వెనక్కి..

- రైతుల అభిప్రాయాలు తీసుకుని కొత్త మాస్టర్ ప్లాన్లు రూపొందిస్తామని సర్కారు ప్రకటన
- ఆనందం వ్యక్తం చేసిన రైతులు, సంఘాల నేతలు..
- కామారెడ్డిలో ఆందోళన విరమించిన రైతు జేఏసీ



కామారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో ముసాయిదాపై చర్చిస్తున్న మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్/ జగిత్యాల: తమ పంట భూములను కాపాడుకునేందుకు రైతులు చేసిన పోరాటం ఫలించింది. కామారెడ్డి, జగిత్యాల పట్టణాల్లో కొత్త మాస్టర్ ప్లాన్ ముసాయిదాలను రద్దు చేయాలంటూ వారు చేపట్టిన ఆందోళనకు ప్రభుత్వం తలొగ్గింది. ఈ రెండు చోట్ల మాస్టర్ ప్లాన్ ముసాయిదా ప్రక్రియలను నిలిపివేస్తూ మున్సిపల్ పాలకవర్గాలు శుక్రవారం నిర్ణయం తీసుకున్నాయి. రైతుల భూములు ఎక్కడికీ పోవని, ఆవేదన చెందవద్దని ప్రకటించాయి. రైతుల భూములకు నష్టం కలగకుండా ప్రణాళికలను రూపొందిస్తామని అధికారులు తెలిపారు.

రైతుల ఉధృత ఉద్యమంతో..

కామారెడ్డి మున్సిపాలిటీ కొత్త మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి డీటీసీపీ, ఢిల్లీకి చెందిన డీడీఎఫ్ సంస్థలు కలిసి ముసాయిదా రూపొందించడం, అందులో పంట భూములను పారిశ్రామిక, వాణిజ్య జోన్లుగా చూపడాన్ని తప్పుపడుతూ రైతులు ఆందోళనకు దిగడం తెలిసిందే. జెడ్పీ మాజీ చైర్మన్ కె.వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి ఉద్యమానికి దిగారు. దీనికి వివిధ రాజకీయ పక్షాలు మద్దతుగా నిలిచాయి. అయితే అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన

మిగతా 5వ పేజీలో ▶

జగిత్యాల మున్సిపాలిటీలోనూ..

జగిత్యాల మున్సిపాలిటీలోనూ ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తూ పాలకవర్గం శుక్రవారం తీర్మానించింది. జగిత్యాల మున్సిపాలిటీలో పట్టణ శివార్లలోని హుస్నాబాద్, తిప్పన్నపేట, మోతె, తిమ్మాపూర్, ధరూర్, నర్సింగాపూర్ గ్రామాలను విలీనం చేస్తూ గత ఏడాది డిసెంబర్‌లో మాస్టర్ ప్లాన్ ముసాయిదా రూపొందించారు. పలుగ్రామాల్లోని వ్యవసాయ భూములను రిక్రియేషన్, ఇండస్ట్రియల్, కమర్షియల్ జోన్ల పరిధిలో చేర్చారు. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళనలకు దిగారు. ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, వంటావార్పుతో నిరసనలు తెలిపారు. గురువారం జగిత్యాల మున్సిపాలిటీ ముట్టడి, పట్టణ దిగ్బంధం కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ పాలకవర్గం శుక్రవారం అత్యవసరంగా సమావేశమై.. మాస్టర్ ప్లాన్ ముసాయిదాను రద్దు చేసింది.

SAHARA

పల్లెల్లో 'సహారా' కలకలం!

- ఐదున్నరేళ్లలో రెండింతలిస్తామంటూ సహారా బ్యాంక్ డిపాజిట్ల సేకరణ
- మెచ్యూరిటీ తీరినా అందని డబ్బు
- ఆందోళనలో డిపాజిటర్లు.. అవసరాలకు సొమ్ము అందక వెతలు
- ఏజెంట్ల పేరిట రశీదులు రావడంపైనా అనుమానాలు
- బాధితులంతా కూలీలు, పేదలే..
- ఏజెంట్లు, సహారా సంస్థపై సిరిసిల్లలో చీటింగ్ కేసులు
- ఆందోళన వద్దు: సహారా అధికారులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 'సహారా' డిపాజిట్ల వ్యవహారం కలకలం రేపుతోంది. సహారా బ్యాంకు పేరిట సేకరించిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల గడువు తీరినా సొమ్ము చెల్లించకపోతుండటంతో డిపాజిటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- వివరాలు 2లో▶

క్లుప్తంగా...

గవర్నర్ చట్టాలను పాటించాలి: గుత్తా



నల్లగొండ టూటౌన్: అసెంబ్లీ, శాసనమండలిలో ఆమోదం తెలిపిన బిల్లులను నెలల తరబడి గవర్నర్ పెండింగ్‌లో పెట్టడం వల్ల రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడుతోందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. దేశంలోని చట్టాలను పాటించాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉందని అభిప్రాయపడ్డారు. శుక్రవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు బిల్లులు 4 నెలలుగా గవర్నర్ తమిళిసై పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం పంపే బిల్లులను గవర్నర్ పరిశీలించి ఆమోదించడమా లేదా తిరస్కరించడమో చేయాలి తప్ప పక్కనపెట్టరాదన్నారు. గవర్నర్ అందరితో కలిసి పనిచేయాలని, గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలన్నారు.

23న టీటీడీపీ విస్తృతస్థాయి సమావేశం: కాసాని



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తెలుగుదేశం పార్టీ (టీటీడీపీ) రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర అనుబంధ సంఘాల పూర్తి కార్యవర్గం, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, కో–ఆర్డినేటర్లు, త్రీమెన్, ఫైవ్ మెన్ కమిటీ సభ్యులను ఆహ్వానించినట్లు జ్ఞానేశ్వర్ వెల్లడించారు. త్వరలో తెలంగాణ వ్యాప్తంగా చేపట్టనున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం, పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం, పార్టీ సంస్థాగత నిర్మాణం, తదితర అంశాలు ఈ సమావేశంలో ప్రధాన ఎజెండాగా ఉంటుందని కాసాని తెలిపారు.

దేశాభివృద్ధిలో యువత భాగం కావాలి: కిషన్‌రెడ్డి



కంటోన్మెంట్: యువశక్తి దేశాభివృద్ధిలో భాగం కావాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. రోజ్‌గార్ మేళాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాల జారీ కోసం సికింద్రాబాద్‌లోని ఎస్‌వీఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని మంత్రి కిషన్‌రెడ్డితోపాటు ఉద్యోగ అభ్యర్థులు వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతకు 10 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంగా ప్రధాని రోజ్‌గార్ మేళాను ప్రారంభించినట్లు తెలిపారు. ఉద్యోగాల కల్పనలో మోదీ ప్రభుత్వం మిషన్ మోడ్‌లో పనిచేస్తోందని కేంద్ర, గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిశోర్ అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కిషన్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపికైన 99 మందికి పత్రాలు అందజేశారు.

'నిషేధం ఉన్నా రిజిస్ట్రేషన్లు చేశారు'



సాక్షి, హైదరాబాద్: హఫీజ్‌పేటలోని సర్వే నంబర్ 78కి సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయడానికి వీల్లేదని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) 2007లో జీవో నంబర్ 863 జారీ చేయడంతోపాటు 2012లో సర్క్యులర్ జారీ చేసినా రెవెన్యూ అధికారులు వందలాది రిజిస్ట్రేషన్లు చేశారని, ఎన్‌ఓసీలు ఇచ్చారని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. అలాగే ఆయా భూముల్లో నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ అధికారులు అనుమతులు మంజూరు చేశారన్నారు. నిబంధనలున్నవి సామాన్యులు, పేదలకేనా అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారికి లేఖ రాశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ లేఖను విడుదల చేశారు. ఓ నగల వ్యాపారి ఎగ్గొట్టిన రూ. 119 కోట్ల రికవరీలో భాగంగా అతను తనఖా పెట్టిన ఆ సర్వే నంబర్‌లోని 8 ఎకరాలను బ్యాంకులు వేలం వేసేందుకు ప్రయత్నిస్తే సుప్రీంకోర్టు దాకా వెళ్లి అడ్డుకున్న అధికారులు.. వారికి నచ్చిన సంస్థలకు మాత్రం రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్నారు.

పల్లెల్లో 'సహారా' కలకలం!

నాలుగేళ్లలో రెండింతలిస్తామంటూ డిపాజిట్ల సేకరణ
మెచ్యూరిటీ తీరినా చేతికి అందని డబ్బు
ఆందోళనలో డిపాజిటర్లు.. అవసరాలకు సొమ్ము అందక వెతలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్



ఇంటి నష్ట పరిహారం పైసలు డిపాజిట్ చేశా..

మిడ్‌మానేరు కింద అనుపురంలో ముంపునకు గురైన ఇంటి నష్ట పరిహారం కింద వచ్చిన రూ.4.70 లక్షలను సహారాలో డిపాజిట్ చేశాను. ఏజెంట్లు 5 ఏళ్ల 4 నెలల్లో రెట్టింపు డబ్బులు వస్తాయన్నారు. గడువు ముగిసి 16 నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదు. ప్రభుత్వం మా డబ్బులు మాకు ఇప్పించాలి.
– తాండ్ర రజిత, అనుపురం, సిరిసిల్ల జిల్లా

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 'సహారా' డిపాజిట్ల వ్యవహారం కలకలం రేపుతోంది. సహారా బ్యాంకు పేరిట సేకరించిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల గడువు తీరినా సొమ్ము చెల్లించకపోతుండటంతో డిపాజిటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సహారా ఏజెంట్లను నిలదీస్తున్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, ఇల్లు, స్థలాల కొనుగోలు, కుటుంబ అవసరాల కోసం డబ్బులు దాచుకున్నామని.. ఇప్పుడు సొమ్ము రాక నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. సంస్థలో పలు ఆర్థిక సమస్యల కారణంగా చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని, సొమ్ము వస్తుందని ఏజెంట్లు పైకి సర్ది చెప్తున్నా.. లోపల వారు కూడా తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ఈ క్రమంలోనే సంస్థలో పనిచేసే ఓ మేనేజర్ ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశమైంది.



అప్పుచేసి బిడ్డ పెళ్లి చేయాల్సి వచ్చింది

మాది బిహార్. 30 ఏళ్ల కింద సిరిసిల్లకు వచ్చి స్థిరపడ్డాం. వేములవాడ, సిరిసిల్లలోని సులభ్ కాంప్లెక్స్‌లను కాంట్రాక్టు తీసుకొని పనిచేయిస్తున్నాను. ఏడేళ్ల కింద సహారా ఏజెంట్లు వచ్చి రూ.4.40 లక్షలు ఎఫ్‌డీ చేస్తే 5 ఏళ్ల 4 నెలలకు రూ.10 లక్షలు వస్తాయని చెప్పి డిపాజిట్ చేయించుకున్నారు. గడువు దాటి 17 నెలలు అయినా డబ్బివ్వలేదు. నా బిడ్డ పెళ్లికి అప్పు చేయాల్సి వచ్చింది.
– సునీల్ మిశ్రా, సిరిసిల్ల

దాదాపు ఏడాదిన్నర నుంచి..

ఐదున్నరేళ్లలో సొమ్ము రెట్టింపు అవుతుందని చెప్పడంతో చాలామంది తమ కష్టార్జితాన్ని సహారాలో డిపాజిట్ చేశారు. కొందరు ఒకేసారి ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) చేస్తే.. చాలా మంది వారానికో సారి, నెలకోసారి కట్టే రికరింగ్ డిపాజిట్లు (ఆర్‌డీ)గా పొదుపు చేశారు. వీరిలో చాలా వరకు కూలీలు, పేదలే. చివరిలో పెద్దమొత్తంలో సొమ్ము చేతికి అందుతుందని ఆశపడ్డవారే. సహారా సంస్థ ఏజెంట్లు గ్రామాల్లో పర్యటిస్తూ.. తమకున్న పరిచయాలతో డిపాజిట్లు సేకరిస్తున్నారు. కొన్నిరోజులుగా డిపాజిట్లు మరింత పెంచేందుకు నాలుగేళ్లలోనే సొమ్ము డబుల్ అవుతుందని చెప్తున్నట్లు తెలిసింది. అయితే దాదాపు ఏడాదిన్నరగా డిపాజిట్లను తిరిగి చెల్లించడం లేదని.. గత ఏప్రిల్ నుంచి మొత్తంగా రావడం లేదని డిపాజిటర్లు చెప్తున్నారు. దీనితోపాటు డిపాజిటర్లు నెలనెలా చెల్లించే మొత్తానికి వారి పేరున కాకుండా ఏజెంట్ పేరుతో రశీదులు ఇవ్వడం కూడా అనుమానాలకు దారితీస్తోంది. దీనిపై ఏజెంట్లను నిలదీయగా.. సంస్థకు సంబంధించిన పలు కారణాలతో ఇలా జరుగుతోందని పై అధికారులు చెప్పారని వివరిస్తున్నారు. సంస్థ అధికారులు ప్రతి శనివారం ఏజెంట్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 17న జూమ్ మీటింగ్‌కు హాజరైన అనంతరం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం మల్యాలకు చెందిన సహారా మేనేజర్ కందాల సంపత్ (55) ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన హన్మకొండ జిల్లా కమలాపూర్ సహారా బ్రాంచికి మేనేజర్‌గా పనిచేస్తున్నారు. డిపాజిటర్లకు మెచ్యూరిటీ తీరినా సొమ్ము చెల్లించలేని పరిస్థితి ఉందని, పై అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదన్న మనస్తాపంతో సంపత్ ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆయన కుమారుడు వినయ్ హుజూరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు కూడా. ఈ ఘటన ఏజెంట్లలో ఆందోళన పెంచింది.

సొమ్ము వస్తుంది.. ఆందోళన వద్దు!

కరోనా వల్ల తలెత్తిన ఆర్థిక చిక్కుల వల్ల మెచ్యూరిటీ పూర్తయినా డిపాజిట్లు చెల్లించలేకపోతున్న మాట వాస్తవమే. అయితే అత్యవసరమున్న వారికి సర్దుబాటు చేస్తున్నాం. డిపాజిటర్లు, ఏజెంట్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రశీదులు ఏజెంట్ పేరు మీద రావడమంటే అవన్నీ ముందస్తు చెల్లింపులే. దానిపై కంగారు వద్దు. డిపాజిటర్లకు భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మేనేజర్ సంపత్ ఆత్మహత్యకు ఇతర ఆర్థిక కారణాలే తప్ప.. సహారాకు సంబంధం లేదు.
శ్రీనివాస్, సహారా సంస్థ రీజినల్ మేనేజర్, కరీంనగర్

సిరిసిల్లలో చీటింగ్ కేసులు

సహారా సంస్థలో డిపాజిట్ చేసివారిలో ఎక్కువ మంది పేద, దిగువ మధ్య తరగతివారే. ఇంటి నిర్మాణం, పిల్లల పెళ్లిళ్లు, చదువు, అనారోగ్యం తదితర అవసరాల కోసం.. త్వరగా డబ్బు రెట్టింపు అవుతుందన్న ఆశతో డిపాజిట్లు చేశారు. ఇప్పుడు సొమ్ము అందకపోవడంతో సంస్థపై, ఏజెంట్లపై చీటింగ్ కేసులు పెడుతున్నారు. ఇలా సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, వేములవాడ పోలీస్‌స్టేషన్లలో మూడు కేసులు నమోదయ్యాయి. ఈ విషయంలో కరీంనగర్‌లో ఉన్న సహారా రీజనల్ మేనేజర్, ఇతర అధికారులను సిరిసిల్ల ఎస్పీ రాహుల్ హెగ్డే పిలిపించి వివరణ కూడా తీసుకున్నారు.

ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటున్నాం



సహారా ఏజెంట్లు, సంస్థపై చీటింగ్ కేసులు నమోదయ్యాయి. అవన్నీ ఒకే తరహా కేసులు. ఇటీవల సహారా ఉన్నతాధికారులను సైతం పిలిచి వివరణ అడిగాం. ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకుంటున్నాం. కేసులు దర్యాప్తు దశలో ఉన్నాయి.
– రాహుల్ హెగ్డే, సిరిసిల్ల ఎస్పీ

'ఇంటి' కథ కంచికి!

▶ మొదటి పేజీ తరువాయి

పేదలకు చవకగా ఇళ్లు కట్టించేందుకు 2007లో ప్రారంభమైన రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ల పరిస్థితీ ఇంతే. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గృహ నిర్మాణ కార్యకలాపాలు చేపట్టకపోవడంతో వీటికి ఎలాంటి పని లేకుండా పోయింది. అప్పట్లోనే కట్టి అసంపూర్తిగా మిగిలిన వాటిని ఉన్నవి ఉన్నట్టుగా అమ్ముకోవటానికే స్వగృహ కార్పొరేషన్ పరిమితమైంది. ఇక ఈ రెండు విభాగాల కథ కంచికి చేరినట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పేదల గృహ నిర్మాణం అన్నది ఎన్నికల ప్రధాన హామీల్లో ఒకటి కావడంతో హౌసింగ్ కార్పొరేషన్ మాత్రం కొనసాగే వీలుందని అంటున్నారు. ఇక పోలీసు సిబ్బందికి ఇళ్లు నిర్మించే పోలీసు హౌసింగ్ కార్పొరేషన్, వైద్యారోగ్య సిబ్బందికి ఇళ్లు నిర్మించి ఇచ్చే సంస్థలను కూడా ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోకి తీసుకురానున్నట్టు సమాచారం.

పూర్తికాని ఆస్తుల పంపకం

రాష్ట్రం విడిపోయాక హౌసింగ్‌బోర్డు ఆస్తుల పంపకం వివాదంగా మారింది. దీనిని రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం 9వ షెడ్యూల్‌లో చేర్చారు. రాజీవ్ స్వగృహ ఆస్తులను మాత్రం ఎక్కడివి అక్కడే పద్ధతిలో రెండు రాష్ట్రాల మధ్య పంచారు. దాని అప్పులను కూడా పంచగా.. తెలంగాణకు రూ.900 కోట్ల రుణాలు వచ్చాయి. ప్రస్తుతం సర్కారు స్వగృహ ఆస్తులను క్రమంగా వేలం వేస్తోంది.

మూసీ వరదలతో తెరపైకి 'హౌసింగ్ బోర్డు'!

గృహనిర్మాణ శాఖలో ప్రధాన విభాగంగా ఉన్న హౌసింగ్ కార్పొరేషన్ కంటే కొన్ని దశాబ్దాల ముందే హౌసింగ్ బోర్డుకు బీజం పడింది. 1908లో మూసీ వరదలతో దెబ్బతిన్న హైదరాబాద్ నగరాన్ని పునరుద్ధరించటంతోపాటు విశాలమైన రహదారుల నిర్మాణం, మెరుగైన పారిశుధ్య వ్యవస్థ ఏర్పాటు, వరదలతో నిరాశ్రయులైన వారికి ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్.. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా 'సిటీ ఇంప్రూమెంట్ బోర్డు'ను ప్రారంభించారు. మూసీ వరదలతో దెబ్బతిన్న నగరాన్ని ఆ బోర్డు ఆధ్వర్యంలోనే పునరుద్ధరించారు. వేల సంఖ్యలో ఇళ్లను నిర్మించి ఇచ్చారు. తర్వాత సికింద్రాబాద్ ప్రాంతంలో మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు 1931లో 'టౌన్ ఇంప్రూమ్‌మెంట్ ట్రస్టు'ను ఏర్పాటు చేశారు. 1956లో ఈ రెండింటినీ విలీనం చేస్తూ గృహనిర్మాణ మండలి (హౌసింగ్ బోర్డు)ను ఏర్పాటు చేశారు.

వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌తో..

చెన్నారెడ్డి సీఎంగా ఉండగా హౌసింగ్ బోర్డుకు చైర్మన్‌గా వ్యవహరించిన ధర్మారెడ్డి దీనికి భారీగా ల్యాండ్ బ్యాంకు సిద్ధం చేశారు. కూకట్‌పల్లి నుంచి మాదాపూర్ వరకు ఏకంగా 6 వేల ఎకరాల భూమిని సమీకరించారు. తర్వాత ప్రైవేటు సంస్థలతో కలిసి ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రత్యేకంగా డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (డీఐఎల్)ను ప్రారంభించి... కొన్ని వేల ఎకరాలను దానికి బదలాయించారు. కానీ కొన్ని బడా సంస్థలు వందల ఎకరాల భూమిని తీసుకుని బోర్డుకు పూర్తి డబ్బులు చెల్లించకుండా ఎగ్గొట్టి నష్టపర్చాయి. ఇప్పటికీ ఆ వివాదాలు కొనసాగుతున్నాయి. జేఎన్టీయూ సమీపంలో హౌసింగ్ బోర్డు ఉద్యోగులకు 1978లో కాలనీని నిర్మించారు. దానికి ధర్మారెడ్డి పేరే పెట్టుకున్నారు. అప్పట్లో ఉద్యోగులకు రూ.5.80కు గజం చొప్పున స్థలాన్ని కేటాయించటం గమనార్హం.

పీజేఆర్ టు కేసీఆర్..



పేదలకు ఇళ్లను నిర్మించి ఇచ్చే పథకం తొలుత సంక్షేమశాఖ అధీనంలో ఉండేది. 1990లలో కార్మిక శాఖ మంత్రిగా ఉన్న పి.జనార్దన్‌రెడ్డి ప్రత్యేకంగా గృహనిర్మాణ శాఖను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి అంగీకరించడంతో ప్రత్యేక శాఖగా ఏర్పాటైంది. నాటి నుంచి వివిధ విభాగాలు, కార్పొరేషన్లతో విస్తరించి.. పేదలు, మధ్యతరగతి ఇళ్లు కట్టించిన గృహనిర్మాణ శాఖ ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వంలో కాలగర్భంలోకి వెళ్లిపోయింది.

వైఎస్సార్ హయాంలో చరిత్ర సృష్టించి..



పేదల కోసం నిరంతరం తపించిన వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదల గృహ నిర్మాణ పథకానికి కొత్త నిర్వచనం చెప్పారు. పాదయాత్ర సమయంలో జనం బాధలను ప్రత్యక్షంగా చూసిన ఆయన.. ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించాలన్న లక్ష్యంతో ఇందిరమ్మ పథకాన్ని ప్రారంభించారు. తెలంగాణ ప్రాంతంలోనే ఏకంగా 18 లక్షల ఇళ్లను మంజూరు చేశారు. అప్పట్లో ఇది దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. దానిని చాలా రాష్ట్రాలు అనుసరించాయి. వైఎస్సార్ కన్నుమూసిన తర్వాత ఆ పథకం క్రమంగా నీరుగారుతూ వచ్చింది.

ఆసియాలోనే అతిపెద్ద హౌసింగ్ కాలనీ

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) కాలనీ.. ఒకప్పుడు ఆసియాలోనే మారుమోగిన పేరు. ఇక్కడ ఏడు ఫేజ్‌లలో అల్పాదాయ, మధ్య ఆదాయ, ఎగువ మధ్య ఆదాయ వర్గాలకు ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ పేర్లతో హౌసింగ్ బోర్డు దాదాపు 9 వేల ఇళ్లను నిర్మించింది. అప్పట్లో ఆసియాలోనే ఇది అతి పెద్ద హౌసింగ్ కాలనీ. అంతకుముందు హైదరాబాద్‌లో తొలి హౌసింగ్ బోర్డు కాలనీగా విజయనగర్ కాలనీని నిర్మించారు. తర్వాత మౌలాలి, ఎస్సార్ నగర్, వెంగళరావునగర్ కాలనీలను కట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన పట్టణాల్లోనూ కాలనీలు నిర్మించారు. ప్రభుత్వం నుంచి నిధులు లేకుండా సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతిలో ఇది కొనసాగింది. అయితే 1980 దశకం చివరికి వచ్చేసరికి ప్రైవేటు బిల్డర్ల హవా మొదలై.. హౌసింగ్ బోర్డు ప్రాభవం తగ్గుతూ వచ్చింది. అడపాదడపా కొన్ని కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టినా సింగపూర్ టౌన్ షిప్, మలేషియా టౌన్‌షిప్‌లు మినహా పెద్దగా గుర్తుండిపోయే ప్రాజెక్టులు లేవు. చివరిగా ఉమ్మడి రాష్ట్రంలో ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోని రావిర్యాలలో ఇళ్లను నిర్మించింది. రాష్ట్రం ఏర్పాటయ్యాక ఏ ప్రాజెక్టూ చేపట్టలేదు. మొత్తంగా తెలంగాణ పరిధిలో 20 వేలకుపైగా ఇళ్లను బోర్డు స్వయంగా నిర్మించింది.

దక్షిణాదిన కేసీఆర్... ఉత్తరాదిలో కేజ్రీవాల్

విపక్షాలు కలవకుండా చూసే బాధ్యతను వారికి అప్పగించిన బీజేపీ
- ఎంఐఎం బీజేపీకి బీ టీమ్.. సెక్యులర్ ఓట్లను చీల్చేపనిలో ఆ పార్టీ బిజీ
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారిఖ్ అన్వర్



మాట్లాడుతున్న తారిఖ్ అన్వర్. చిత్రంలో రేవంత్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఢిల్లీ ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖర్‌రావు, కేజ్రీవాల్ కలిసి కాంగ్రెస్ పార్టీని నష్టపరిచే చర్యలకు పాల్పడుతున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారిఖ్ అన్వర్ వ్యాఖ్యానించారు. 'దేశంలోని మెజార్టీ విపక్షాలు నరేంద్ర మోదీ ప్రభుత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నాయి. కానీ, అవి ఏకం కాకుండా బీజేపీ రాజకీయం చేస్తోంది. అందులో భాగంగానే ఉత్తరాదిన కేజ్రీవాల్‌కు, దక్షిణాదిన కేసీఆర్‌కు బాధ్యతలు అప్పగించింది. విపక్షాలు కాంగ్రెస్ వైపు రాకుండా చీల్చే పనిని ఆ ఇద్దరు తీసుకున్నారు' అని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఇక్కడి గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావెద్, పార్టీ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, కమలాకర్‌రావు, షబ్బీర్‌అలీతో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఏర్పాటు చేసిన ఖమ్మం సభ కూడా అందులో భాగమేనన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా కాంగ్రెస్ లేకుండా జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఎంఐఎంతో కాంగ్రెస్ పార్టీ కలిసే అవకాశాలు లేవని, ఆ పార్టీ బీజేపీకి బీటీమ్‌గా పనిచేస్తోందని పేర్కొన్నారు. దేశంలోని సెక్యులర్ ఓట్లను చీల్చి కాంగ్రెస్ పార్టీని ఓడించడం ద్వారా బీజేపీకి లబ్ధి కలిగించే పనిలో ఆ పార్టీ ఉందన్నారు.

నాడు వాజ్‌పేయే చెప్పారు

గుజరాత్‌లో జరిగిన మత ఘర్షణలకు మోదీయే బాధ్యుడని తాజాగా వచ్చిన బీబీసీ వార్తలపై తారిఖ్ అన్వర్ స్పందిస్తూ ఆ వార్తలు వాస్తవమేనని అన్నారు. ఈ విషయంలో మోదీ రాజధర్మాన్ని నిర్వర్తించలేదని నాటి బీజేపీ అగ్రనేత అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా వ్యాఖ్యానించారన్న విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ రూ.10 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఇస్తే ఎనిమిదేళ్ల పాలన తర్వాత సీఎం కేసీఆర్ రూ.5 లక్షల కోట్ల అప్పులకుప్పగా మార్చారని తారిఖ్ విమర్శించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ ఏర్పాటు లక్ష్యం నెరవేరలేదని, ఇక్కడి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని అన్నారు. ప్రధాని మోదీ కూడా దేశ ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదన్నారు. తెలంగాణ నుంచి గాంధీ కుటుంబం పోటీ చేస్తుందా లేదా అనేది ఆ కుటుంబమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. తెలంగాణలో పార్టీ పరిస్థితులను చక్కదిద్దే బాధ్యతను సీనియర్ నేత మాణిక్‌రావ్ ఠాక్రేకు అధిష్టానం అప్పగించిందని, ఆయన మార్గదర్శనంలో తెలంగాణలో పార్టీ బలోపేతం అవుతుందని తారిఖ్ ధీమా వ్యక్తం చేశారు.

పాదయాత్రకు రేవంత్ సన్నాహాలు!

నేటి టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో అనుకూల తీర్మానం
- కార్యవర్గం నిర్ణయం మేరకు ముందుకెళ్లాలని ఠాక్రేకు ఖర్గే సూచన!
- ఓకే అయితే జూన్ 2 వరకు యాత్ర

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్త పాదయాత్రకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. అధిష్టానం నుంచి అధికారికంగా అనుమతి తీసుకున్న తర్వాత భద్రాచలం నుంచి తన 126 రోజుల పాదయాత్రను ఆయన ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే తాజా పర్యటనలోనే పాదయాత్రకు లైన్ క్లియర్ కానుందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఠాక్రే శనివారం హాజరుకానున్న టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర చేయాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించనున్నట్టు సమాచారం. శనివారం పాదయాత్రకు సంబంధించిన తీర్మానం ఉంటుందని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే రేవంత్ పాదయాత్రపై రెండురకాల వాదనలు జరుగుతున్నాయి.

నేడు స్పష్టత?: టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ ఒక్కరే రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు సిద్ధం కావడాన్ని కొందరు పార్టీ నేతలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గం అనుమతి తీసుకోవడం ద్వారా అధిష్టానం దగ్గర లైన్ క్లియర్ చేసుకోనున్నారని తెలుస్తోంది. పార్టీ కార్యవర్గం (పీఏసీ) తీర్మానం చేస్తే రేవంత్ పాదయాత్రను వద్దనాల్సిన అవసరం లేదనే భావనలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉన్నారని, ఇదే విషయాన్ని ఆయన ఠాక్రేకు చెప్పారని సమాచారం. ఈ నేపథ్యంలోనే పీఏసీలో ఏకగ్రీవ తీర్మానం చేయనున్నారని కొందరు నేతలు చెబుతున్నారు. మరోవైపు హాథ్‌సే హాథ్‌జోడో యాత్రల్లో భాగంగా పాదయాత్రను ప్రారంభించాలని రేవంత్‌కు ఠాక్రే సూచించారని, వచ్చే స్పందనను బట్టి రాష్ట్రవ్యాప్త యాత్రకు అధిష్టానం నుంచి అనుమతి తీసుకుందామనే సంకేతాలను ఆయన రేవంత్‌కు ఇచ్చారనే చర్చ జరుగుతోంది. హాథ్‌సే హాథ్‌జోడో యాత్రల్లో భాగంగానే యాత్ర ప్రారంభమైనా అది జూన్ 2 వరకు కొనసాగుతుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. రేవంత్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి కూడా పాలుపంచుకుంటారా? వంటి విషయాలపై శనివారం జరిగే టీపీసీసీ కార్యవర్గ సమావేశం తర్వాత స్పష్టత రానున్నట్టు తెలుస్తోంది.

కేసీఆర్ ఏ క్షణమైనా ఎన్నికలకు వెళ్లొచ్చు



రేవంత్, కోమటిరెడ్డి మాటామంతీ...

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జికి ఈ విషయం చెప్పా
- పార్టీని సిద్ధం చేయాలని, 50–60 సీట్లకు అభ్యర్థులను ముందే ప్రకటించాలని ఠాక్రేకి సూచించా..
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి
- రేవంత్‌రెడ్డితో రెండుసార్లు భేటీ అయిన సీనియర్ నేత

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ఏ క్షణమైనా ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని, పార్టీని అందుకు సిద్ధం చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో చెప్పానని ఆ పార్టీ సీనియర్ నేత, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయనతో చర్చించానన్నారు. కోమటిరెడ్డి చాలా రోజుల తర్వాత గాంధీభవన్‌కు వచ్చారు. ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల్లో ఓటు వేసేందుకు గత ఏడాది అక్టోబర్ 17న పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన, మళ్లీ శుక్రవారం సాయంత్రం మాణిక్‌రావ్ ఠాక్రేను కలిసేందుకు గాంధీభవన్‌లో అడుగుపెట్టారు. రాష్ట్ర ఇన్‌చార్జిగా మాణిక్యం ఠాగూర్‌ను మార్చిన తర్వాత పార్టీలో క్రియాశీలంగా మారుతున్న కోమటిరెడ్డి, గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోనూ భేటీ అయ్యారు. ఆ తర్వాత ఠాక్రేను కలిసి తన అభిప్రాయాలు (మనసులోని మాటలు) వెల్లడించిన అనంతరం, మరోమారు రేవంత్‌తో ఆయన సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉప్పు, నిప్పులా వ్యవహరించే ఆ ఇద్దరు నేతలు రెండుసార్లు భేటీ అయి ఏం మాట్లాడుకున్నారనేది కాంగ్రెస్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాగా ఠాక్రేతో భేటీకి ముందు, ఆ తర్వాత వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

గాంధీభవన్ మీటింగ్‌లు తగ్గించాలని చెప్పా..

రాష్ట్రం ఇచ్చిన సోనియా రుణం తీర్చుకునేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే 50–60 మంది అభ్యర్థులను ముందే ప్రకటించాలని, ఎన్నికలకు వారం, పది రోజుల ముందు ప్రకటిస్తే ఉపయోగం ఉండదని సూచించానని కోమటిరెడ్డి చెప్పారు. రానున్న ఆరు నెలలు ప్రజా పోరాటాలు బలంగా చేయాలని, ఆ మేరకు కార్యకర్తల్ని సిద్ధం చేయాలని, గాంధీభవన్ మీటింగ్‌లు తగ్గించి ప్రజల్లో ఉండాలని, జిల్లాల్లో సమావేశాలు పెట్టాలని చెప్పినట్లు తెలిపారు. ఇందుకు ఠాక్రే సానుకూలంగా స్పందించారని చెప్పారు.

గాంధీభవన్‌తో 30 ఏళ్ల అనుబంధం

గాంధీభవన్‌కు రానని తానెప్పుడూ అనలేదని వెంకట్‌రెడ్డి చెప్పారు. తనకు 30 ఏళ్లుగా గాంధీభవన్‌తో అనుబంధముందని, కాంగ్రెస్ జెండాతోనే పని చేస్తున్నానని అన్నారు. ఈనెల 26 నుంచి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు. రూ.200 కోట్లు ఖర్చు పెట్టి ఖమ్మంలో బీఆర్‌ఎస్ సభ పెట్టిన కేసీఆర్ దేశానికి ఏం చేస్తాడో చెప్పలేదని విమర్శించారు. ఇలాంటి సభలు కాంగ్రెస్ ఎన్నో పెట్టిందన్నారు. అనంతరం 'సాక్షి'తో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే తమకు 40–50 సీట్లు వస్తాయని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో విభేదాలు లేవని, నేతలందరం కలిసే ఉన్నామని చెప్పారు.

కేసీఆర్ ప్రసంగంలో సిద్ధాంతం లేదు

మీడియాతో ఇష్టాగోష్టిలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం బీఆర్‌ఎస్ సభలో సీఎం కేసీఆర్ చేసిన ప్రసంగం సిద్ధాంతరహితంగా సాగిందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్‌రెడ్డి విమర్శించారు. 'జాతీయ స్థాయిలో సభను ఢిల్లీలో పెడతానని ఖమ్మంలో పెట్టారు. సభకు 5 లక్షల మంది వస్తారని గొప్పలు చెప్పుకుంటే లక్ష మంది వచ్చి ఉంటారని నిఘా బృందం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఆ సభలోనూ టెండర్లు, కాంట్రాక్టర్ల గురించి తప్ప దేశం కోసం ఏం చేసేదీ కేసీఆర్ చెప్పలేదు' అని రేవంత్ పేర్కొన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టి మాట్లాడారు. తెలంగాణలో లేని బీజేపీని ఓడిస్తామని చెప్పడం ద్వారా ఆ పార్టీని అతిగా చూపేందుకు కేసీఆర్ ప్రయత్నించారన్నారు. దేశవ్యాప్తంగా ఒక్క ఎంపీ సీటు కూడా లేని ఆమ్ ఆద్మీ పార్టీ, 2 సీట్లున్న సీపీఐ, 3 సీట్లుగల సీపీఎం, 9 సీట్లున్న టీఆర్‌ఎస్ కలిసి కేంద్రంలో బీజేపీని ఓడిస్తాయా అని ప్రశ్నించారు. ఆ పార్టీలకు ఉన్న ఎంపీ సీట్లన్నింటినీ కలిపినా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఉన్న దాంట్లో సగం సీట్లు కూడా లేవని రేవంత్ ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌కు మిత్రపక్షమైన ఎంఐఎంను కేసీఆర్ ఖమ్మం సభకు ఎందుకు పిలవలేదో... తెరవెనుక ఏం జరుగుతోందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను ఓడించేందుకు తమ పార్టీ నేత ఒకరికి కేసీఆర్ రూ. 500 కోట్ల ఆఫర్ ఇచ్చారంటూ తాను చేసిన ఆరోపణలను మంత్రి పువ్వాడ అజయ్ సమర్థించారని రేవంత్ గుర్తుచేశారు. కాంగ్రెస్‌ను ఎవరూ ఓడించాల్సిన పనిలేదని, ఆ పార్టీ వాళ్లే ఓడిస్తారని అజయ్ చెప్పారని, తాను చెప్పింది కూడా కర్ణాటకలో కాంగ్రెస్ నేత చేత పార్టీని ఓడించేందుకు ప్రయత్నించారన్నదేనని అన్నారు.

గవర్నర్‌కు మర్యాద ఇవ్వాల్సిందే...

రాజకీయంగా విభేదించొచ్చు కానీ గవర్నర్‌కు ఇవ్వాల్సిన మర్యాద ఇవ్వాల్సిందేనని... గవర్నర్‌కు ప్రొటోకాల్ అమలు పర్చాల్సిందేనని రేవంత్ పేర్కొన్నారు. తమిళనాడు ప్రభుత్వాన్ని అక్కడి గవర్నర్ అవమానపరుస్తుంటే తెలంగాణలో గవర్నర్‌ను ప్రభుత్వం అవమానిస్తోందన్నారు. అయితే గవర్నర్ వ్యవస్థ ఉన్నది రాష్ట్ర ప్రభుత్వాలను ఇరుకున పెట్టేందుకు కాదని వ్యాఖ్యానించారు.

మలి పర్యటనలో మరింత బిజీగా

ఠాక్రే వరుస భేటీలు.. కమిటీలతో సమావేశాలు
- తన మనోగతం వెల్లడించిన ఎంపీ కోమటిరెడ్డి.. పార్టీలో సమష్టి నిర్ణయాలు ఉండాలని స్పష్టీకరణ
- వీహెచ్, మహేశ్‌కుమార్‌గౌడ్‌ల మధ్య వాగ్వాదం



ఠాక్రేను కలిసిన ప్రతాప్‌రెడ్డి, కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే తన మలి పర్యటన కోసం శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా గాంధీభవన్‌కు వచ్చిన ఠాక్రే.. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఠాక్రేతో భేటీ సందర్భంగా వెంకట్‌రెడ్డి తన మనోగతాన్ని ఆయనకు వివరించారు. పార్టీలో సమష్టి నిర్ణయాలు ఉండాలని, పార్టీలో అందరికీ సరైన గౌరవం దక్కాలని, అప్పుడు తాను ఉత్సాహంతో పనిచేయగలనని ఠాక్రేకు వెంకట్‌రెడ్డి చెప్పినట్టు సమాచారం. ఇటీవల నియమించిన టీపీసీసీ కమిటీల్లో తాను సూచించిన నేతల పేర్లు లేకపోవడంపై కోమటిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఠాక్రేకు పరిచయం చేసిన కోమటిరెడ్డి, ఆయనకు జనగామ డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరినట్టు తెలుస్తోంది. ఆ తర్వాత ఠాక్రేను పార్టీ సీనియర్ నేత వీహెచ్ కలిశారు. ఈనెల 22న హైదరాబాద్‌లో జరిగే రాజీవ్ గాంధీ మెమోరియల్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. అయితే తాను బిజీగా ఉన్నందున హాజరు కాలేనని ఠాక్రే చెప్పినట్టు సమాచారం. ఈ సందర్భంగా వీహెచ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. కాగా, పలు కమిటీలతో ఠాక్రే సమావేశమై వాటి పనితీరు, హాథ్‌సే హాథ్ జోడో యాత్రల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, నదీమ్ జావెద్, రోహిత్‌చౌదరిలతో సమావేశమయ్యారు.


SMART BAZAAR
ఫుల్ పైసా వసూల్ సేల్
Powered by Jio TRUE 5G
21st-26th Jan
అందరూ అవుతారు మాయం ఎందుకంటే వచ్చేసింది, ఫుల్ పైసా వసూల్ సేల్
Jio TRUE 5G ఫుల్ పైసా వసూల్ ధమాకా ఆఫర్ !
5GB
బిస్కెట్స్ పెద్ద ప్యాక్ 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY2 GET ANY1 FREE
మాజా 1.2 ℓ / ఫ్రూటి 2 ℓ
BUY ANY2 GET ANY1 FREE
BUY ANY2 GET ANY1 FREE
BUY ANY2 GET ANY1 FREE
BUY ANY2 GET ANY1 FREE
BUY ANY2 GET ANY1 FREE
₹130 ₹75 ₹65 ₹108 ₹189 ₹50
BUY ANY2 GET ANY1 FREE
BUY ANY3 GET ANY1 FREE
BUY ANY1 GET ANY1 FREE
BUY ANY1 GET ANY1 FREE
₹230
25%
₹38 ₹182 ₹670 ₹500 ₹270 ₹430 ₹323
₹1099
₹299/ ₹379
₹610
₹134
₹1199 (₹39.96/kg)
₹80
₹1570 ₹471 ₹549 / ₹499 ₹250 / ₹120 ₹730 ₹120 ₹210 ₹76 ₹1650 ₹451 ₹425 ₹345
26%
₹20
₹699
₹2699
₹5999
₹32500
50%
₹129
₹999
₹2295
LA OPALA
₹999/ ₹1999
₹1995 / ₹4095
POLYSET
₹299
₹699
₹499/ ₹599
₹999 / ₹1849
SMART SUPERSTORE
SMART POINT
fresh Signature
JioMart.com
10% CASHBACK
SBI card
*Min. Trxn.: ₹2,500; Max. Cashback: ₹500 per card account.
Validity: 21 Jan - 26 Jan 2023. T&C Apply.

> సత్వగుణమువారు స్వర్గాది లోకములను, రజోగుణము వారు మధ్యమమగు మనుష్య లోకమును పొందుచున్నారు. తమోగుణము వారు అధోలోకమున అనగా మనుష్యులలో హీనులుగా, పశుపక్ష్యాదులుగా జన్మించుచున్నారు.
> – హైందవ ధర్మం

సాక్షి

శనివారం, జనవరి, 21

జసిండా అసాధారణ ఒరవడి

కాదు పొమ్మని ప్రజలు తీర్పిచ్చినా అధికారం కోసం ఎంతకైనా తెగించే డోనాల్డ్ ట్రంప్, బోల్సెనారో వంటివారిని చూసి విస్తుపోయిన ప్రపంచాన్ని న్యూజిలాండ్ ప్రధాని జసిండా ఆర్డెన్ తాజా నిర్ణయం ఆశ్చర్యపరిచి ఉండొచ్చు. పదవీకాలం ముగియడానికి పది నెలల ముందే ప్రధాని పదవి నుంచి తప్పుకొంటున్నట్టు ఆమె ప్రకటించటం ఆ దేశ ప్రజలకే కాదు... అంతర్జాతీయ సమాజానికి కూడా ఊహకందనిది. రెండేళ్ల క్రితం అమెరికాలో ట్రంప్, మొన్నటికి మొన్న బ్రెజిల్‌లో బోల్సెనారో ఏం చేశారో అందరూ చూశారు. జనం అధికారం ఇవ్వలేదని తెలిసి కూడా దాన్ని ప్రత్యర్థుల నుంచి బల ప్రయోగంతో కాజేయడానికి ప్రయత్నించారు. కానీ జసిండా వీరికి భిన్నం. సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించటం అసాధ్యమనుకున్న వెంటనే ఆమె రాజీనామా చేశారు. ఇప్పటికీ అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా ముందంజలో ఉన్న ఆమె ఇలా ఆలోచించటం ఊహాతీతం.

పదవీకాలం ముగియడానికి ముందే తప్పుకోవటం న్యూజిలాండ్‌కు కొత్తగాదు. ఆమెకు ముందు పనిచేసిన నేషనల్ పార్టీ నేత జాన్ కీ కూడా 2017 వరకూ పదవీకాలం ఉన్నా ఏడాది ముందే వైదొలగి డిప్యూటీ ప్రధాని బిల్ ఇంగ్లిష్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. అయితే సంక్లిష్ట సమస్యలు ఎదురైనప్పుడు ఆయన వ్యవహారశైలికీ, జసిండా తీరుకూ చాలా వ్యత్యాసముంది. జాన్ కీ అప్పట్లో అన్నిటా వైఫల్యాలు చవిచూసి పార్టీలో ఒత్తిళ్లు పెరిగి తప్పనిసరై తప్పుకోవాల్సి వచ్చింది. కానీ జసిండా అలా కాదు. పార్టీలో ఆమె పట్ల సానుకూలత చెక్కుచెదరలేదు. సంక్షోభ సమయాల్లో ఆమె దృఢంగా ఉండటమే, సమస్యలను అధిగమించటమే అందుకు కారణం. కరోనా విజృంభిస్తున్నప్పుడు అన్ని దేశాలూ లాక్‌డౌన్‌తో సహా అనేక ఆంక్షలు విధించి పౌర జీవనాన్ని స్తంభింపజేస్తే ఆమె మాత్రం నిబ్బరంగా ఎదుర్కొన్నారు. పరిమిత ప్రాంతాల్లో మాత్రమే స్వల్ప స్థాయి ఆంక్షలు విధించారు. చైనానుంచి స్వదేశానికి పోయిన ఫిలిప్పీన్స్ పౌరుడొకరు 2020 ఫిబ్రవరి 2న కరోనా వైరస్ బారినపడి మరణించినట్టు వార్త రాగానే చైనానుంచి రాకపోకలు నిలిపేస్తున్నట్టు ఆమె ప్రకటించారు. యూరప్ దేశాల్లో కరోనా మరణాలు నమోదు కావడం మొదలుకాగానే అక్కడి నుంచి కూడా విమానాలు నిలిపివేశారు. ఈ ఆంక్షలపై ఇంటా, బయటా విమర్శలొస్తున్నా లెక్క జేయలేదు. అయితే ఆమె తక్షణ స్పందనవల్ల ప్రపంచ దేశాల్లో వేలాదిమంది కరోనా బారినపడిన తరుణంలో న్యూజిలాండ్‌లో కేవలం రెండే కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత సైతం రెండంకెల సంఖ్యకు మించి కరోనా కేసులు లేవు. పౌరుల సాధారణ జీవనానికి అంతరాయం కలగలేదు. ప్రజలను భయభ్రాంతులను చేయడంకాక వారు అప్రమత్తంగా ఉండేలా, ఆత్మవిశ్వాసంతో మెలిగేలా సూచనలు చేయడంవల్లే ఈ విజయం సాధ్యమైందని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం జసిండాను ప్రశంసించింది. కరోనా సంబంధ కేసుల సమాచారాన్ని తొక్కిపట్టివుంచటం కాక పారదర్శకంగా వ్యవహరించటం ఆ మహమ్మారిని సునాయాసంగా ఎదుర్కొనడానికి దోహదపడింది.

అయితే జసిండా పాలనపై ప్రజానీకంలో ఇటీవల కొంత అసంతృప్తి ఏర్పడిన మాట వాస్తవం. సర్వేల్లో విపక్ష నేషనల్ పార్టీ ముందంజలో ఉంది. అయితే ప్రధాని పదవికి అర్హులని భావిస్తున్న నేతల్లో ఇప్పటికీ ఆమే అందరికన్నా ముందున్నారు. కరోనా అనంతర పరిస్థితులు, ఉక్రెయిన్‌లో రష్యా దురాక్రమణ యుద్ధం న్యూజిలాండ్‌ను కూడా సంక్షోభంలోకి నెట్టాయి. ఉపాధి కల్పనలో పురోగతి లేదు. ద్రవ్యోల్బణం పెరిగింది. ఈ పరిణామాలన్నీ పౌరులకు ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతోపాటు 2019లో క్రైస్ట్ చర్చి నగరంలో రెండు మసీదుల్లోకి చొరబడి ఒక దుండగుడు 51 మందిని పొట్టనబెట్టుకున్న ఉదంతాన్ని జనం ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నారు. ప్రపంచంలో ఐస్‌లాండ్ తర్వాత అత్యంత శాంతియుత దేశంగా ఎప్పుడూ రెండో స్థానంలో ఉండే న్యూజిలాండ్‌కు ఈ ఉదంతాలు ఊహకందనివి. అయితే ఆ సమయంలో జసిండా వ్యవహరించిన తీరు ఆదర్శ ప్రాయమైనది. వెనువెంటనే దేశ ప్రజలనుద్దేశించి ఆమె చేసిన ప్రసంగం, బాధితులపట్ల ఆమె చూపిన దయార్ద్రత అందరినీ చలింపజేసింది. ఆ తర్వాత మారణాయుధాల విషయంలో ఉదారంగా ఉండే దేశ చట్టాలను ఆమె సవరించారు. ఈ క్రమంలో పెద్దయెత్తున వ్యతిరేకత వచ్చినా లెక్కజేయలేదు. దృఢంగా వ్యవహరించటమంటే నిరంకుశంగా పాలించటం కాదని సమస్యలపై సకాలంలో స్పందించి, అవసరమైతే కఠినమైన నిర్ణయాలు తీసుకోవటమని తన ఆరేళ్ల పాలనలో జసిండా నిరూపించారు. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న లేబర్ పార్టీ సామ్యవాద విధానాలు ఆమెకు ప్రజాదరణ తెచ్చిపెట్టి ఉండొచ్చు. కానీ దేశం ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో ఒక మహిళగా మనసుపెట్టి ఆలోచించిన తీరు, తీసుకున్న సృజనాత్మక నిర్ణయాలు ఆమెను విలక్షణ నేతగా నిలిపాయి. ముఖ్యంగా నవజాత శిశువులున్న కుటుంబాలకు 2018లో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించటం, తాజాగా ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేందుకు ఆ కుటుంబాలకు నెలనెలా అదనపు ఆర్థిక సాయం అందించటం అందరినీ ఆకట్టుకుంది. వేతనాల్లో లింగ వివక్షను నిషేధించి, సమాన పనికి సమాన వేతనం లభించేలా తీసుకొచ్చిన చట్టం కూడా ప్రశంసలు పొందింది. అధికారమే పరమావధవుతున్న వర్తమానంలో జసిండా వంటి వారు చాలా అరుదు. వచ్చే అక్టోబర్ ఎన్నికల్లో విజేతలెవరో కచ్చితంగా ఎవరూ చెప్పలేకపోయినా ఆమెకు సాటిరాగల నేతలు పాలక, ప్రతిపక్షాల్లో ఎవరూ లేరన్నది వాస్తవం. ఎందుకంటే ఆమె నెలకొల్పిన పాలనా ప్రమాణాలు అటువంటివి.

మారువేషంలో కొలీజియంలోకా?

విశ్లేషణ



ఇందిరా జైసింగ్

అసలంటూ ప్రస్తుతం ఉనికిలోనే లేని 'శోధన, మూల్యాంకన కమిటీ'లో ప్రభుత్వ ప్రతినిధులు కూడా ఉండాలన్న కేంద్ర న్యాయమంత్రి సూచన తీవ్రమైనది! కేవలం న్యాయమూర్తులను మాత్రమే కలిగి ఉన్న కొలీజియంలో ప్రవేశించడానికి ప్రభుత్వం తెలివిగా మారువేషంలో వేస్తున్న తొలి అడుగుగా దీన్ని భావించాలి. న్యాయమూర్తుల ఎంపిక కమిటీలో ప్రభుత్వ ప్రాతినిధ్యం న్యాయవ్యవస్థ స్వతంత్రతను ధ్వంసం చేస్తుందని న్యాయమూర్తుల నియామక కమిటీ చట్టం కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పేర్కొంది. న్యాయమంత్రి సూచన ఆ తీర్పును తోసిపుచ్చే ప్రయత్నమే. అలాగని హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల ప్రాతిపదికలో ఎలాంటి తప్పూ లేదని సూచించడం లేదు. ఇక్కడే శోధన ప్రారంభం కావలసి ఉంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకాల కోసం 'శోధన, మూల్యాంకన కమిటీ' (సెర్చ్ కమ్ ఎవాల్యుయేషన్ కమిటీ)ని నియమించాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లేఖ రాసినట్టు తెలిసింది. ఈ విషయాన్ని చర్చించేముందుగా మంత్రి సూచించిన శోధన, మూల్యాంకన కమిటీ అనేది ఉనికిలో లేదని గమనించాలి. ప్రస్తుతం ఉనికిలో ఉన్న చట్టం ప్రకారం ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం... హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తూ ఉంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించినంతవరకూ ప్రధాన న్యాయమూర్తి, నలుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం సిఫార్సు చేస్తుంది.

శోధన, మూల్యాంకన కమిటీ అవసరం ఇప్పుడు ఉందా? సమాధానం నిశ్చయాత్మకంగా అవును అన్నట్లయితే, అలాంటి కమిటీ పొందిక ఎలా ఉండాలి అనేది మరో ప్రశ్న. హైకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే తాను పనిచేసే హైకోర్టులో ఆయన్ని ప్రధాన న్యాయమూర్తిగా నియమించరు. అలాగే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించే సందర్భంలోనే సుప్రీంకోర్టులో రాష్ట్రాల భౌగోళిక ప్రాతినిధ్యాన్ని లెక్కిస్తారు. కాబట్టి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన ప్రాతిపదిక ఇప్పటికే స్పష్టంగా ఉంది. కాబట్టి, కొత్తగా శోధన, మూల్యాంకన కమిటీ అవసరం లేదని తెలుస్తున్నది. దీనికి బదులుగా సీనియారిటీ నిబంధనను పక్కన పెట్టి చేసే నియామకాలకు ప్రాతిపదిక అవసరం.

పరిధి ప్రాతిపదికను పరిగణించే అవకాశం పైన చెప్పినట్టుగా పరిమితం. కాబట్టి కేంద్ర మంత్రి సూచించిన శోధన, మూల్యాంకన కమిటీ ఈ సంప్రదాయానికి చేసే జోడింపు పెద్దగా లేదనే చెప్పాలి. ఇక జడ్జీల పనితీరు మూల్యాంకనం కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల విధి. సుప్రీంకోర్టుకు నియమించాల్సిన న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుల బాగోగులను సుప్రీంకోర్టు న్యాయమూర్తులే చక్కగా మూల్యాంకన చేయగలరు. దీన్ని పక్కనబెడితే, న్యాయ నిర్ణయాలు చాలా తరచుగా సుప్రసిద్ధ న్యాయ పత్రికల్లో తీవ్రమైన విద్యాత్మక విమర్శలకు గురవుతుంటాయి. న్యాయమూర్తుల మూల్యాంకనకు ఇది సుపరిచితమైన పద్ధతి. ఇలాంటి పరిస్థితుల్లో శోధన, మూల్యాంకన కమిటీలో ప్రభుత్వ ప్రతినిధులు కూడా ఉండాలన్న కేంద్ర న్యాయ మంత్రి సూచన తీవ్రమైనది! కేవలం న్యాయమూర్తులను మాత్రమే కలిగి ఉన్న కొలీజియంలో ప్రవేశించడానికి ప్రభుత్వం తెలివిగా మారువేషంలో వేస్తున్న తొలి అడుగుగా దీన్ని భావించాలి.



స్పష్టంగా చెప్పాలంటే, భారత రాజ్యాంగం నిర్దేశించిన అధికారాల విభజన సూత్రాన్ని న్యాయమంత్రి తాజా సూచన ధ్వంసం చేస్తుంది. ఈ అధికారాల విభజన రాజ్యాంగ ప్రాథమిక లక్షణాల్లో ఒకటి. అన్ని రాజ్యాంగ బద్ధ సంస్థల్లో న్యాయవ్యవస్థ మాత్రమే, ప్రభుత్వాన్ని ఎన్నుకున్న మెజారిటీ ప్రజాభిప్రాయానికి ప్రతితులనాత్మకంగా ప్రభుత్వ పనితీరు పట్ల నిరోధ సమతౌల్యాన్ని అందించగలదు. ప్రభుత్వ పనితీరుకు నిరోధ సమతౌల్యంగా ఉండాల్సిన న్యాయమూర్తుల నియామక కమిటీలో అదే ప్రభుత్వం భాగమైతే, ప్రభుత్వ ఇతర విభాగాలను తనిఖీ చేసే కోర్టు విధిని అది ధ్వంసం చేస్తుంది. ఇది 'కోళ్ళగూటిలోకి నక్కను స్వయంగా ఆహ్వానించడమే' అవుతుంది.

న్యాయమూర్తుల ఎంపిక కమిటీలో ప్రభుత్వ ప్రాతినిధ్యం అనేది న్యాయవ్యవస్థ స్వతంత్రతను ధ్వంసం చేస్తుందని న్యాయమూర్తుల నియామక కమిటీ చట్టం కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో న్యాయ మంత్రి సూచన ఆ తీర్పును తోసిపుచ్చే ప్రయత్నమే.

సుప్రీంకోర్టు ద్వారా ప్రకటితమైన చట్టాన్ని మార్చడానికి రెండు సుపరిచిత మార్గాలు ఉన్నాయి. మొదటిది, సముచితమైన శాసనం ద్వారా న్యాయస్థానం అన్వయించిన తీర్పు ప్రాతిపదికనే మార్చివేయడం. రెండో మార్గం ఏమిటంటే, విస్తృత ధర్మాసనం ద్వారా ఆ తీర్పును తోసిపుచ్చడానికి ప్రయత్నించడం. ప్రభుత్వం ఈ రెండింటిలో ఏ ఒక్కదానికీ పూనుకోలేదు. బదులుగా, భారత ఉపరాష్ట్రపతి, న్యాయమంత్రి వంటి అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారే న్యాయస్థానం తీర్పునకు భిన్నంగా ప్రకటనలు చేస్తూ వచ్చారు. న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే ప్రయత్నంలో, మొత్తంగా న్యాయవ్యవస్థ చట్టబద్ధతనే రద్దుపరిచే ప్రయత్నంలో భాగంగా ఇదంతా జరుగుతూండటం గమనార్హం.

న్యాయమూర్తుల నియామక విధానాన్ని మార్చాలని ప్రభుత్వం తీవ్రంగా భావిస్తూ ఉన్నట్లయితే, న్యాయమూర్తుల నియామక చట్టాన్ని తోసిపుచ్చిన తర్వాత ఒక కొత్త చట్టాన్ని తీసుకురాకుండా దాన్ని ఏదీ అడ్డుకోలేదు. అయితే ఈ మార్గాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే చేపట్టడం లేదు. అసలు అలాంటి చట్టాన్ని రూపొందించే అవసరాన్నే ప్రభుత్వం పరిగణించలేదు. ఎందుకంటే, ప్రభుత్వంతో సంప్రదింపుల తర్వాతే నియామకాలను చేపడుతున్న పక్షంలో అలాంటి న్యాయమూర్తులతో ప్రభుత్వం ఎంతో సౌకర్యవంతంగా ఉంటూ వస్తోంది. రాష్ట్రపతి ఆదేశంతో నిమిత్తం లేకుండా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని గానీ, న్యాయమూర్తులను గానీ కొలీజియం సిఫార్సు చేసిన సందర్భం ఒక్కటి కూడా లేదు. అలాగే కొలీజియం చేసిన ఏ సిఫారసు అయినా ప్రభుత్వానికి అసౌకర్యంగా మారి వ్యతిరేకించిన పక్షంలో అలాంటి సూచనలను న్యాయవ్యవస్థ వెనక్కు తీసుకోవడం కూడా జరిగేది కాదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎన్నికైన జస్టిస్ ఎన్వీ రమణ యూపీఏ ప్రభుత్వ హయాంలో ఎంపికైన చివరి న్యాయమూర్తి కావడం తెలిసిందే. ఆ తర్వాత వచ్చిన ప్రధాన న్యాయమూర్తులు ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే నియమితులవుతూ వచ్చారు.

అలాగని హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల ఎంపిక ప్రాతిపదికలో ఎలాంటి తప్పూ లేదని ఇక్కడ సూచించడం లేదు. ఇక్కడే శోధన ప్రారంభం కావలసి ఉంది. ముఖ్యంగా, హైకోర్టుల నియామకాల కోసం ప్రాతిపదిక గురించి న్యాయ మంత్రి తాజా లేఖ పేర్కొనడం లేదు. సమస్య ఇక్కడే ఉందని నేను నమ్ముతున్నాను. న్యాయమూర్తులను నియమించే దశలోనే శోధన, మూల్యాంకనకు ప్రాధాన్యత ఉంటుంది. అయితే న్యాయమూర్తులతో కూడిన కమిటీనే దాన్ని చేపట్టాలి. న్యాయమూర్తుల నియామకాలకు నిర్దిష్ట ప్రాతిపదిక ఉండాలి. ఆ ప్రాతిపదికను ముందుగానే ప్రకటించి ప్రచురించాలి.

అందుబాటులో ఉన్న ఉత్తమ అభ్యర్థిని న్యాయమూర్తిగా ఎంపిక చేయడానికి సరైన మార్గం ఏదంటే, ప్రస్తుతం లోపభూయిష్టంగా ఉంటున్న న్యాయమూర్తుల నియామక వ్యవస్థను అధిగమించడం. దానికిగానూ సంబంధిత అభ్యర్థులు తమ ఆసక్తిని వ్యక్తపర్చడానికీ, స్వయంగా నామినేషన్ దాఖలు చేయడానికీ అనుమతించాలి. అప్పుడు మాత్రమే జడ్జీల నియమాకానికి చెందిన పరిగణన పరిధి విస్తృతం అవుతుంది. ప్రజలకు బహిరంగంగా తెలుస్తుంది కూడా. స్వీయ నామినేషన్ వ్యవస్థ మాత్రమే వర్గం, కులం, జాతి, లైంగిక ధోరణికి సంబంధించిన వైవిధ్యతకు హామీ ఇస్తుంది. ధర్మాసనంలో మనం చూడవలసిన బహుళత్వం, వైవిధ్యం గురించి అర్థం చేసుకోవడానికి అది వీలు కలిగిస్తుంది.

వ్యాసకర్త సీనియర్ న్యాయవాది,
భారత మాజీ అదనపు సొలిసిటర్ జనరల్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మరెందుకు కోపం?



తమ అత్యున్నత నాయకుడి పాలనలో మైనారిటీల పట్ల అమానవీయంగా ప్రవర్తించారని చెప్పే 'బీబీసీ డాక్యుమెంటరీ' మీద భక్తులు ఎందుకు కోపంగా ఉన్నారో అర్థం చేసుకోవడం కష్టంగా ఉంది. సరిగ్గా ఆ కారణంగానే కదా వాళ్లు ఆయనకు ఓట్లేస్తారు!

– పునీత్ పానియా, స్టాండప్ కమెడియన్

తరమడం నిజం



జనవరి 19న కశ్మీరీ హిందువుల మారణహోమ దినం. అవును, అది మారణహోమమే. ఇస్లామిస్టు తీవ్రవాదులు బలవంతంగా తరిమేయడం వల్ల మూడు నెలల లోపే హిందూ మైనారిటీలు అంటూ దాదాపుగా లేకుండా కశ్మీర్ ఖాళీ అయింది. ఇప్పుడు లక్ష రూకల ప్రశ్న: గత ముప్పై ఏళ్లలో ఇస్లామిస్ట్ మైండ్‌సెట్ ఏమైనా మారిందా?

– జావేద్ బేగ్, మాజీ సీఎం పీఆర్‌ఓ

అభ్యంతరం మీద అభ్యంతరం



న్యాయమూర్తి అభ్యర్థుల పట్ల ప్రభుత్వ అభ్యంతరాలను బహిరంగ పరచాలన్న సుప్రీంకోర్టు నిర్ణయం వివాదాన్ని పెంచుతుంది. న్యాయమూర్తులు తమ బహిర్గత రాజకీయ అభిప్రాయాలు, లింగ స్థితిని బెంచ్‌కు మోసుకెళ్ల కూడదనీ, అవి వారి తీర్పులను ప్రభావితం చేస్తాయనీ అభ్యంతరం వ్యక్తం చేసిన ప్రభుత్వం మీద కన్నెర్ర చేసే ప్రయత్నం తగదు.

– కన్వల్ సిబల్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి

ప్రతిష్ఠ కొనుగోలు



దావోస్ పోవడానికి భారతీయ వ్యాపారవేత్తలు రూ.1.7 కోట్లు (ప్రవేశ రుసుము) ఎందుకు ఖర్చు చేస్తారో ఒక లోపలి కోణం: వాళ్లు దావోస్ పోయారని అందరికీ తెలియాలి– అది గొప్ప స్టేటస్ సింబల్; వచ్చే రాజకీయ నాయకులతో ప్రైవేటుగా మాట్లాడే అవకాశం; జర్నలిస్టులకు ఇంటర్వ్యూలు ఇవ్వడం.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఆస్తుల విభజన చేసేది ఎన్నడు?

అభిప్రాయం



బచ్చు శ్రీనివాస్

పార్లమెంట్‌లో ఆమోదం పొందిన 'ఏపీ పునర్విభజన చట్టం–2014'లోని అంశాలు పరిష్కరించకుండా కేంద్రం సాచివేత ధోరణి ప్రదర్శిస్తున్నది. రాష్ట్రం ఏర్పాటై ఎనిమిదేండ్లు గడిచినా విభజన సమస్యలు ఎక్కడివి అక్కడే ఉన్నాయి. ప్రధాని నరేంద్ర మోదీని కలిసి వినతి పత్రాలు ఇచ్చినా, ఉపయోగం లేకుండా పోయింది.

పునర్విభజన చట్టం–2014 షెడ్యూల్ 9లో ఉన్న ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లతో పాటు 91 సంస్థలను, అదేవిధంగా షెడ్యూల్ 10లోని ఏపీ స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్, సింగరేణి కాలరీస్‌తో పాటు 142 సంస్థల్లోని ఆస్తులు, ఇతర లావాదేవీలను 48:52 ప్రకారం విభజించాల్సి ఉన్నది. కానీ కేంద్రం దేన్నీ తేల్చకుండా దాటవేత ధోరణి అవలంబిస్తున్నది.

విభజన చట్టంలోని 9వ షెడ్యూల్లో మొత్తం 91 సంస్థల్లో షీలా భిడే కమిటీ 68 సంస్థలకు చెందిన ఆస్తులను పంచింది. రాష్ట్రం ఏకీభవించని 22 సంస్థల విభజనపై భిడే కమిటీ చేసిన సిఫార్సులను రెండు రాష్ట్రాలూ అంగీకరించలేదు. ఆ సంస్థలకు సంబంధించిన ఆస్తులే 89 శాతం ఉంటాయని ఆఫీసర్లు చెప్తున్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని ఏ షెడ్యూల్లోనూ లేకుండా మరో 32 సంస్థలు ఉన్నాయి. వాటిని రెండు రాష్ట్రాలు పంచుకోవడం ఇబ్బందిగా మారింది. ఆస్తులను జనాభా నిష్పత్తికి అనుగుణంగా సెక్షన్ 64 ప్రకారం పంచుకోవాలని ఏపీ అడుగుతోంది.

ఇదీగాక తెలుగు యూనివర్సిటీ, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, తెలుగు అకాడమీ, జేఎన్‌యూ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీల విభజన పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. విద్యుత్ రంగ సమస్యల పరిష్కారానికి నీరజా మాథుర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఇప్పటికీ రిపోర్ట్ ఇవ్వలేదు. ఢిల్లీలోని ఏపీ భవన్ విభజన, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి వాటి విభజన పూర్తిగా జరగలేదు. ఫిల్మ్ డెవలప్‌మెంట్, టీఎస్ ఎంఎస్ఐడీసీ, మినరల్ డెవలప్మెంట్ సంస్థ వంటి ఆస్తుల పంపకాలపైనా గందరగోళం నెలకొంది. కొన్ని సంస్థల్లో జాయింట్ అకౌంట్ల కింద ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.2 వేల కోట్ల వరకు ఉన్నాయి. వాటిపై స్పష్టత లేదు. 2014 నుండి, చట్టంలోని వివిధ నిబంధనల అమలు పురోగతిని సమీక్షించడానికి కేంద్ర ప్రభుత్వం రెండు రాష్ట్రాల ప్రతినిధులతో మొత్తం 29 సమీక్షా సమావేశాలను నిర్వహించింది. అయినప్పటికీ సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. ఇరు రాష్ట్రాలు పరస్పరం ఆమోద యోగ్యమైన పరిష్కారాన్ని సాధించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది.

గోదావరి, కృష్ణా నదీజలాల వాటాల పంపిణీలోనూ కేంద్రం నిర్లక్ష్యం వహిస్తున్నది. దేశంలోని రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాల మధ్య జల వివాదం తలెత్తినప్పుడు రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్, 262 ఆర్టికల్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలి. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల నదీ జలాల వివాదాల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నది. 575 టీఎంసీల నీటి వాటా కోసం కృష్ణా నదీ జలాల పంపకం అంశాన్ని ట్రిబ్యునల్‌కు పంపాలని తెలంగాణ కొన్నేండ్లుగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా, ఆ అభ్యర్థనలన్నిటినీ కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతూ వస్తున్నది. తెలంగాణలో ఏదైనా ఒక సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని విభజన చట్టంలో స్పష్టంగా ఉన్నా, కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. కాగా ఎగువన ఉన్న కర్ణాటక ప్రాజెక్టుకు జాతీయ హోదా మంజూరు చేసింది. అలాగే ఏపీలోని పోలవరానికీ జాతీయ హోదా ఇచ్చింది. కానీ తెలంగాణకు మాత్రం మొండి చేయి చూపింది.



ఉన్న చట్ట ప్రకారం ఇవ్వాల్సిన నవోదయ పాఠశాలలు ఇవ్వకపోగా తెలంగాణకు మంజూరైన ఐటీఐఆర్‌ను రద్దు చేసింది. 'ఆస్తుల విభజన చేపట్టకపోవడంతో సమ స్యలు ఉత్పన్నమవుతున్నాయి. అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించాం. తగు మాత్రంలో నిధులు అందకపోవడం, విభజన చట్టం ప్రకారం ఆస్తుల విభజన చేపట్టకపోవడంతో... ఆంధ్రాలోని ప్రభుత్వ సంస్థలు తీవ్రంగా ప్రభావిత మవుతున్నాయి. రాష్ట్రప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న 1,59,096 మంది ఉద్యోగుల పరిస్థితి విభజన జరిగిన 2014 నుంచి డోలాయమానంలో ఉంది. సరిగా విభజన జరగకపోవడమే దీనికి ఏకైక కారణం.


విభజన తర్వాత రిటైరైన ఉద్యోగుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. పదవీ విరమణ సమయంలో వారికి దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందడం లేదు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా ఆస్తులు విభజించి ఈ అంశానికి ఇక్కడితో ముగింపు పలకాలి' అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా, కోర్టు కేంద్ర ప్రభుత్వానికీ, తెలంగాణకూ నోటీసులు జారీ చేస్తూ ఆరు వారాల్లో అఫిడవిట్లు దాఖలు చేయాలని కోరింది. సహజంగా ఏ రాష్ట్రమైనా తనకు లాభం జరగాలనే చూస్తుంది.

అయితే విభజన సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రానిదే. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ సమీకరణలను దృష్టిలో పెట్టుకొని కావాలనే సమస్యను నాన్చుతున్నది. మొత్తంగా రెండు రాష్ట్రాల ఏకాభిప్రాయం సాధించడంలో కేంద్రం విఫలం కావడం వల్లే, సమస్య కోర్టు వరకూ వెళ్లింది. ఇప్పటికైనా హక్కుగా ఏ రాష్ట్రానికి ఏం దక్కుతుంతో తేల్చి చట్టప్రకారం సంస్థలు, ఆస్తుల విభజన చేపట్టాలి.

వ్యాసకర్త బీఆర్ఎస్ సీనియర్ నాయకులు
మొబైల్: 93483 11117

గా వయ్యి యాడ దొరుక్తది జెర జెప్పండ్రి

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దుగాల ఛాయ్ దాక్కుంట గూసున్న. యాద్గిరి మామొచ్చిండు.

''ఊల్లె అందరు బాగుండ్రానె.''

''అందరెట్ల బాగుంటరురా? కొంత మందే బాగున్నరు. (మామ రాజకీయాలు మాట్లాడుడు షురువు జేసిండని మనసుల అనుకున్న.) మన ఊల్లె ఏంది. దేసంలనే పది మంది కోట్లు కమాయించి మజా జేస్తుంటె కద్మ జెనం ఆకలితోని సస్తున్నరు'' అని అన్నడు.

''సంటర్ సర్కార్ బీదోల్లకు ఐదు కిలల వొంతున బియ్యం ఫిరీగ ఇస్తున్నది. ఇంకేం జెయ్యాలెనే?''

''బియ్యం ఫిరీగ ఇయ్యంగనే అయిపాయెనా? గ్యాసు బండ దర మూడింతలు బెర్గె. సంక్రాంతి పండ్గ దినాన వందే బారత్ రేల్ గాడిని షురువు జేసింర్రు. లష్కర్ కెల్లి ఎన్మిదిన్నర గంటలల్ల విశాకపట్నం బోతది. గని గాడి ఛార్జీలే మొగులు మీదున్నయి. ఎగ్జిక్యూటివ్ కిలాస్ టికిట్ దర 3,170 రూపాయలు. గని గాలి మోటర్ టికిట్ దర 3,900. గాల్లు, గీల్లతో పండ్గ నాడు సీట్లు నిండినయి. ఆవలి దినం కెల్లి సగం కన్న ఎక్వ సీట్లు కాలిగున్నయి. ఒక్క దినం యేసానికి మూతి మీసం గొరిగిచ్చుకున్న తీర్గున్నది గీ రేల్ గాడి సంగతి.''



''మామా రాహుల్ గాంది పెండ్లెందుకు జేస్కోలేదే?''

''నెహ్రూ ప్రతాని అయినప్పుడు గాయిన పెండ్లాం లేదు. ఇందిరా గాంది ప్రతాని కుర్సి మీద గూసున్నప్పుడు గామె మొగడు లేడు. మొరార్జి దేశాయ్ ప్రతాని అయినప్పుడు గాయిన పెండ్లాం లేదు. గదే తీర్గ పీవీ నరసింహారావు ప్రతాని కుర్సి మీద గూసున్నప్పుడు గాయిన పెండ్లాం లేదు. వాజపేయి అయితే పెండ్లే జేస్కోలేదు. మోదీకి పెండ్లాం ఉన్నా లేనట్టే లెక్క. పెండ్లాం లేకుంటనే ప్రతాని అయ్యేటి మోక దొర్కుతదని రాహుల్ గాంది పెండ్లి జేస్కోలేదు. పెండ్లాం లేకుంటె ఎంత లాబమో ఒకపారి వాజపేయి జెప్పిండు.

రొండు దినాలల్ల పోక్రాన్ అను పరీచ్చ జేస్తరనంగ అబ్దుల్ కలాం అప్పటి ప్రతాని వాజపేయి దగ్గరకు బోయిండు. అనుపరీచ్చ జేస్తమన్న సంగతిని మనద్దరికి తప్పిడ్సి ఎవ్వల్కి ఎర్క గాకుంట సూడుండ్రి అన్నడు. మీకు పెండ్లాం లేదు, నాకు పెండ్లాం లేదు. గసువంటప్పుడు గీ సంగతి మనిద్దరికి దప్పిడ్సి కడ్మోల్లకు ఎట్ల ఎర్కైతది వయా అని వాజపేయి అన్నడు.''

''కేసీఆర్ సంగతేంది మామా?''

''కమ్మంల కేసీఆర్ బీఆర్ఎస్ పుట్టుక సబ బెట్టిండు. నగరమంత గులాబి జెండలు ఎగిరేసింర్రు. సబకొచ్చిన లీడర్ల కోసం అర్వై మూడు తీర్ల తెలంగాన వొంటకాలను జేపిచ్చింర్రు. నాటుకోడి కూర, బొమ్మిడాయిల పుల్సు, కొర్రమీను కూర, రొయ్యల ఫ్రై, బిర్యాని అసుంటియి గూడ ఉన్నాయి. ఏడు తీర్ల స్వీట్లను గుడ్క జేపిచ్చింర్రు. సబకు వొచ్చినోల్ల గురించి ఎన్మిది లచ్చల మంచినీల్ల సీసలు బెట్టింర్రు. నూట నల్వయి ఫీట్ల పొడ్గు, అర్వై ఫీట్ల ఎడల్పుతోని పెద్ద స్టేజి గట్టింర్రు. కేరల ముక్యమంత్రి విజయన్, డిల్లీ ముక్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ ముక్యమంత్రి బగవంత్ మాన్, యుపి మాజీ సీఎం అకిలేశ్ యాదవ్, సీపీఐ జాతీయ ప్రతాన కార్యదర్శి డి. రాజా గీ సబకొచ్చింర్రు. విజయన్, డి.రాజా అంగ్రేజీల స్పీచ్ గొడ్తె కడ్మోల్లు హిందిల మాట్లాడింర్రు. గాల్ల మాటలు అర్తం గాక జెనం లొల్లి బెట్టింర్రు. గిప్పుడు మనది జాతీయ పార్టీ, ఏ బాస ఎవ్వలు మాట్లాడినా లొల్లి బెట్టకుంట ఇనాలె అని కేసీఆర్ అన్నడు.''

''కేసీఆర్ ఏమని స్పీచ్ గొట్టిండే?''

''వొచ్చేటి లోక్‌సబ ఎలచ్చన్ల మోదీ ఇంటికి బోతడు. మనం డిల్లికి బోతం. దేసమంత రైతు బంధు, దలిత బంధు పద్కాలు బెడ్తం. 70 వేల టీఎంసీల నీల్లు దొర్కుతున్నా 20 వేల టీఎంసీల నీల్లు వాడుతున్నం. కాలేశ్వరం అసువంటి ప్రాజెక్టులు లేకపోయె బట్కె దేసంల 50 వేల టీఎంసీల నీల్లు పుజూల్ల బోతున్నది. బీఆర్ఎస్ సర్కారొస్తె దేసమంతట కాలేశ్వరం అసువంటి ప్రాజెక్టులు గట్టిపిస్తది అన్కుంట కేసీఆర్ స్పీచ్‌గొట్టిండు. చింతకాని మండలంల వందనం అనేటి ఊరున్నది. గా ఊరుకు బోరుతోని నీల్లు ఇస్తున్నరు. బోరు నడ్సెతందుకు వాడేటి కరెంటును బీఆర్ఎస్ పుట్టుక సబకు మల్పింర్రు. దాంతోని తాగెతందుకు నీల్లు లేక వందనం ఊరోల్లు తిప్పలబడ్డరు. యాడాదిల ప్రతాని అవుడెట్ల అనేటి వయ్యి గురించి కేసీఆర్ ఒక్క తీర్గ లెంకుతున్నడు. వొస్తరా'' అన్కుంట మా యాద్గిరి మామ బోయిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: అమావాస్య రా.3.21 వరకు, తదుపరి మాఘ శు.పాడ్యమి, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.9.40 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: సా.5.06 నుండి 6.34 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.38 నుండి 8.07 వరకు, అమృతఘడియలు: రా.2.03 నుండి 3.44 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.45

ఆ మాస్టర్ ప్లాన్లు రద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

రైతు పయ్యావుల రాములు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనతో పోరాటం ఉధృతమైంది. చివరికి మాస్టర్ ప్లాన్ ముసాయిదాను రద్దు చేస్తూ శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మరోవైపు పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్ కామారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌లతో సమీక్షించారు. అనంతరం ముసాయిదా ప్రక్రియను నిలిపివేస్తున్నామని అరవింద్‌కుమార్ ప్రకటించారు. విలీన గ్రామాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామని తెలిపారు. రైతుల భూమిని సేకరించే ఉద్దేశంతో మాస్టర్‌ప్లాన్ తయారు చేయ లేదని, రైతుల భూములు ఎక్కడికీ పోవని చెప్పారు. కొత్త రోడ్ల నిర్మాణంలో రైతులకు నష్టం జరగకుండా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు, నేతలు హర్షం వ్యక్తం చేశారు. అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో టపాసులు కాల్చారు. ఉద్యమానికి అండగా నిలిచారంటూ జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డిని అభినందించారు.

ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా నల్లమల

నల్లమలలో పర్యటించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని మన్ననూర్‌లో నూతన కాటేజీలు, సఫారీ వాహనాలు ప్రారంభం
- 26 నుంచి టైగర్ స్టే ప్యాకేజీ ప్రారంభం



సఫారీ వాహనం వద్ద మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని, అందులో భాగంగా ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా నల్లమల అటవీ ప్రాంతాన్ని తీర్చిదిద్దనున్నట్టు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. అటవీ శాఖ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలతో రాష్ట్రంలో పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో మంత్రి పర్యటించారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోబ్రియాల్‌తో కలసి మన్ననూరులో కొత్తగా నిర్మించిన ట్రీహౌస్, అదనపు కాటేజీలతోపాటు 8 సఫారీ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ల్లోని పులుల సంరక్షణపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో 2018లో 12గా ఉన్న పులుల సంఖ్య 2021లో 21కి పెరిగినట్టు తెలిపారు. వన్యప్రాణులను వేటాడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నామని, సమాచారం తెలిపిన వారికి బహుమతులు ఇస్తున్నామని చెప్పారు. పోడు భూముల విషయంలో సీఎం కేసీఆర్ త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నారని చెప్పారు.

ఎకో టూరిజంలో భాగంగా ప్యాకేజీలు..

టైగర్ స్టే ప్యాకేజీలో భాగంగా రెండ్రోజులు అడవిలో ఉండి టైగర్ సఫారీతోపాటు ట్రెక్కింగ్, కాటేజీల్లో బస చేసే అవకాశం కల్పిస్తున్నామని మంత్రి వివరించారు. ఇప్పటికే ఉన్న కాటేజీలకు మరో ఆరు కాటేజీలతోపాటు ఇటీవల నిర్మించిన ట్రీహౌస్ కాటేజీ ప్రత్యేకంగా నిలుస్తుందని చెప్పారు. ఈనెల 26 నుంచి టైగర్ స్టే ప్యాకేజీ అమల్లోకి రానుంది. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్‌లో బుకింగ్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. సాధారణ కాటేజీలో ఇద్దరికి రూ.4,600, మడ్ హౌస్‌లో రూ. 6 వేలు, ట్రీ హౌస్‌లో రూ. 8 వేలతో ప్యాకేజీని ఖరారు చేశామన్నారు. బుకింగ్‌ల కోసం www.amrabadtigerreserve.com సంప్రదించొచ్చన్నారు. పులుల అభయారణ్యాల్లోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారికి పునరావాసం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోబ్రియాల్ చెప్పారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు కలెక్టర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం పాదయాత్ర

యాదాద్రి కలెక్టరేట్ ఎదుట బస్వాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల ధర్నా



యాదాద్రి భువనగిరిజిల్లా కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా చేపట్టిన బస్వాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులు

సాక్షి, యాదాద్రి: పరిహారం కోసం వెయ్యి మంది రైతులు రోడ్డెక్కారు. పాదయాత్రగా వచ్చి అధికారులకు మొర పెట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వా పూర్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన బీఎన్ తిమ్మాపూర్ రైతులు, ప్రజలు 52 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. అధికారుల్లో చలనం లేకపోవడంతో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ప్రాజెక్టులో మునిగిపోతున్న భూములకు, ఇళ్లకు పరిహారం, పునరావాసం, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్(ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీ డబ్బులను ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం తమకు నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న వారికి 250 గజాల స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని కోరారు. 52 రోజులుగా రిజర్వాయర్ కట్టపై ఆందోళన చేసినా తమను అధికారులు పట్టించుకోనందునే మహాధర్నాకు దిగినట్లు గ్రామస్తులు, రైతులు తెలిపారు. మరో రెండు రోజుల పాటు ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. అంతకు ముందు బీఎన్ తిమ్మాపూర్ భూనిర్వాసితుల కమిటీ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భువనగిరిలోని ఆర్డీవో కార్యాలయం నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న కలెక్టరేట్ వద్దకు పాదయాత్ర చేశారు. కలెక్టరేట్ ఎదుట వంటావార్పు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్.వెంకట్రాములు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కులగణనను ఆపాలంటూ ఆదేశాలివ్వలేం

న్యూఢిల్లీ: రాష్ట్రంలో కులగణన చేపట్టాలంటూ బిహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. సర్వేను ఆపాలంటూ వేసిన పిటిషన్‌లు విచారార్హమైనవి కాదంటూ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్ సేథ్‌ల ధర్మాసనం పేర్కొంది. పిటిషన్ దారులు సంబంధిత హైకోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. 'ఇవి ప్రచారం కోసం వేసిన పిటిషన్లు. ఫలానా కులానికి రిజర్వేషన్ ఇంతే ఇవ్వాలని మేమెలా చెప్పగలం? ఎవరికి ఎంత రిజర్వేషన్ ఇవ్వాలో రాష్ట్ర ప్రభుత్వం ఎలా నిర్ణయిస్తుంది. ఈ విషయంలో ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేం. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టలేం' అని పేర్కొంది. పిటిషన్లను ఉపసంహరించుకుని, ఈ అంశంపై తగు నిర్ణయం కోసం పట్నా హైకోర్టుకు వెళ్లేందుకు పిటిషన్ దారులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది.

తెలుగులోనూ నాన్ టెక్నికల్ ఎస్ఎస్‌సీ పరీక్ష

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే మల్టీటాస్కింగ్ (నాన్ టెక్నికల్) స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)–2022ను తెలుగు సహా 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. భాష అవరోధం కారణంగా ఎవరూ అవకాశాలు కోల్పోకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. త్వరలోనే రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషలను చేర్చడానికి ప్రయత్నాలు చేస్తున్నామని జితేంద్ర సింగ్ తెలిపారు.

చార్జిషీట్‌ను బహిర్గతం చేయలేం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు సంస్థలు సమర్పించే చార్జిషీట్‌ను అందరికీ అందుబాటులో ఉండేలా బహిర్గతం చేయలేమని సుప్రీంకోర్టు తెలిపింది. అలా చేయడం నిందితులు, బాధితుల హక్కులకు భంగం కలిగించడమే అవుతుందని పేర్కొంది. చార్జిషీట్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలంటూ దాఖలైన పిల్‌ను జస్టిస్ షా, జస్టిస్ రవికుమార్‌ల ధర్మాసనం కొట్టివేసింది. పిటిషన్‌పై ఈ నెల 9న విచారణ ముగించిన ధర్మాసనం తీర్పును శుక్రవారం వెలువరించింది. ఎఫ్ఐఆర్‌లను వెబ్‌సైట్‌లో ఉంచినట్లే చార్జిషీట్లను సంబంధిత పత్రాలతో రాష్ట్ర ప్రభుత్వాల వెబ్‌సైట్‌లలో ఉంచలేమని పేర్కొంది. చార్జిషీట్‌ను బహిరంగ పరిస్తే కేసుతో సంబంధం లేని ఎన్జీవోలు, ఇతరులు అందులోని అంశాలను దుర్వినియోగపరిచే ప్రమాదముందని పేర్కొంది. అంతిమంగా నిందితులు, బాధితుల హక్కులకు భంగం కలుగుతుందని వివరించింది.

ఓటు వలస వెళుతుందా?

- రిమోట్ ఓటింగ్‌పై పెరుగుతున్న రాజకీయ వేడి
- ఈవీఎం లోపాలు పరిష్కరించకుండా ఆర్‌వీఎంలు ఎందుకు?
- నిలదీస్తున్న విపక్షాలు
- అడుగు ముందుకేనంటున్న సీఈసీ



ఓటు.. ప్రజాస్వామ్యం మనకిచ్చిన శక్తిమంతమైన ఆయుధం. అయినా దానిని వినియోగించుకోవడంలో ఏదో తెలీని ఉదాసీనత కనిపిస్తోంది. ముఖ్యంగా ఉపాధి కోసం వేరే ఊళ్లు వెళ్లే వలసదారులు ఓటు వెయ్యడానికి సుముఖత చూపించడం లేదు. అందుకే దేశంలో ఎక్కడ నుంచైనా ఓటు వెయ్యడానికి వీలు కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం విప్లవాత్మక మార్పులకి శ్రీకారం చుట్టింది. అవే రిమోట్ ఓటింగ్ మెషీన్లు(ఆర్‌వీఎం). ఈ ఓటింగ్ మెషీన్ల ద్వారా సొంతూరుకి వెళ్లకుండా తాముండే ప్రాంతం నుంచి తమ నియోజకవర్గం అభ్యర్థిని ఎన్నుకునే అవకాశం లభిస్తుంది. ఈ నమూనా ఆర్‌వీఎంలను ప్రదర్శించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 16న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ సహా 13 పార్టీలు వీటిని తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇప్పటికే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై విశ్వాసమే లేకుండా ఉన్న ఈ సమయంలో ఈ కొత్త ప్రక్రియకు తెరతీసి ఓటింగ్ వ్యవస్థను గందరగోళం చెయ్యడమెందుకనే చర్చ మొదలైంది. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆమ్ ఆద్మీ పార్టీ, జనతా దళ్ (యూ), శివసేన (ఉద్ధవ్ వర్గం), ఎన్‌సీపీ, సీపీఎం వ్యతిరేకంగా ఉండడంతో నమూనా ఆర్‌వీఎంల ప్రదర్శన జరగకుండానే సమావేశం ముగిసింది. అయితే వలస ఓటర్ల ఓటింగ్ శాతం పెంపు లక్ష్యంగా తాము చేస్తున్న ప్రయత్నాలను ముందుకు తీసుకువెళ్లడానికి సీఈసీ రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకోవడానికి ఫిబ్రవరి 28 వరకు గడువు పెంచింది.

ఎందుకీ ఆర్‌వీఎంలు ?

వలస ఓటర్లలో మూడో వంతు మంది ఎన్నికల్లో తమ ఓటు హక్కుని వినియోగించుకోవడం లేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 67.4శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. దాదాపుగా 30 కోట్ల మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఉన్న చోటు నుంచి సొంతూరికి వెళ్లే అవకాశం లేకపోవడం, ఓటర్ల జాబితాలో పేరు లేకపోవడం వంటి ఎన్నో కారణాలతో వారు ఓటు వెయ్యడం లేదు. భారత ప్రధాన ఎన్నికల అధికారిగా రాజీవ్ కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత వలస ఓటర్లపై దృష్టి కేంద్రీకరించి రిమోట్ ఓటింగ్ ప్రక్రియకు తెరతీశారు.

ఆర్‌వీఎంలు ఎలా పని చేస్తాయి ?

ప్రస్తుతం ఎన్నికల్లో వినియోగిస్తున్న ఎలక్ట్రానింగ్ ఓటింగ్ మెషీన్లకు (ఈవీఎం) ఇది సవరించిన వెర్షన్. ఇతర ప్రాంతాల్లో ఉన్న వలస ఓటర్లు తమ నియోజకవర్గంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత తాము ఏ ప్రాంతం నుంచి ఓటు హక్కు వినియోగించుకుంటారో రిజిస్టర్ చేసుకోవాలి. అలా రిజిస్టర్ చేసుకున్న వారిని రిమోట్ ఓటర్లు అని పిలుస్తారు. తమ ప్రాంతంలో ఉన్న రిమోట్ పోలింగ్ బూత్‌కు వెళితే ఆ ఓటరు నియోజకవర్గం వివరాలను కానిస్టిట్యూయెన్సీ కార్డ్ రీడర్ (సీసీఆర్) ద్వారా స్కాన్ చేసి గుర్తిస్తారు. అప్పుడు ఆర్‌వీఎం మెషీన్లపై ఆ నియోజకవర్గానికి సంబంధించిన బ్యాలెట్ పత్రం డిస్‌ప్లే అవుతుంది. తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తే రాష్ట్రం కోడ్, నియోజకవర్గం, అభ్యర్థుల నెంబర్ వివరాలన్నీ రిమోట్ కంట్రోల్ యూనిట్‌లో రికార్డు అవుతాయి. ఓటు నమోదైనట్టుగా వీవీప్యాట్ స్లిప్ వస్తుంది. ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తయారు చేసిన ఆర్‌వీఎంలు ఇంటర్నెట్ అవసరం లేకుండా పని చేస్తాయి.

ప్రతిపక్షాల అభ్యంతరాలు ఇవీ

- సీఈసీ ప్రతిపాదనలేవీ సమగ్రంగా లేవు. ఆర్‌వీఎంల వ్యవస్థ పైపైన రూపొందించినట్టుగా ఉంది.
- ఈవీఎంల పని తీరుపైనే సవాలక్ష సందేహాలున్న ప్రస్తుత పరిస్థితుల్లో అదే నమూనాలో రూపొందించిన ఆర్‌వీఎంలతో ఒనగూరే ప్రయోజనం ఉండదు.
- ప్రాంతీయ పార్టీలకు, చిన్న పార్టీలకు ఈ వ్యవస్థ ఏ మాత్రం అనుకూలం కాదు. దేశవ్యాప్తంగా ఏర్పాటయ్యే వివిధ పోలింగ్ బూత్‌లలో వారు తమ ఏజెంట్లను ఏర్పాటు చేసుకునే వనరులు ఆ పార్టీలకు ఉండవు.
- ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు వేరే రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉండకపోవడం వల్ల అక్కడ ఉండే వలస ఓటర్లని రాజకీయ పార్టీలు సులభంగా ప్రలోభ పెట్టొచ్చు
- ఓటరు స్థానికంగా నివాసం లేకపోతే రాజకీయ పార్టీలపై ఏర్పరచుకునే అభిప్రాయాలు, ఓటు వేయడంలో వారు తీసుకునే నిర్ణయాల్లో తప్పిదాలు జరిగే అవకాశం ఉంటుంది.
- దేశంలో ఒక చోట ఎన్నికలు జరుగుతూ ఉంటే, మరెక్కడి నుంచో ఓటు వేసే వ్యక్తి అసలు సిసలు ఓటరేనని ఎలా నమ్మాలి. ఓటింగ్‌లో జరిగే అక్రమాలు ఇకపై వివిధ నియోజకవర్గాలకు విస్తరిస్తాయి.

ఈసీ ఎదుట ఉన్న సవాళ్లు

- అసలు వలస ఓటర్లు అంటే ఎవరు ? వారిని ఎలా గుర్తించాలి. వలస ఓటర్లను గుర్తించడంలో ఏర్పడే న్యాయపరమైన చిక్కుల్ని ఎదుర్కోవడం
- ఈవీఎంలకు సవరించిన వెర్షన్‌గా రూపొందించిన ఆర్‌వీఎంలలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలకు పరిష్కారం కనుగొనడం
- ఎన్నికల్లో ఎన్ని రిమోట్ ఓటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న దానిపై స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవడం
- ఒక రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతూ ఉంటే వలస ఓట్లు ఉండే అన్ని ప్రాంతాల్లోనూ ఎన్నికల నియమావళిని అమలు చేయడానికి ఎలాంటి కసరత్తు చేయాలి.

ఇలాంటి సవాళ్లను అధిగమించడానికే ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల అభిప్రాయాలను కోరుతోంది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

> రిమోట్ ఓటింగ్ అనేది ఎన్నికల ప్రకియలో ఒక విప్లవాత్మకమైన మార్పు. పట్టణ ప్రాంతాల్లో, యువతలోనూ ఓటుపై ఆసక్తి పెంచడమే ధ్యేయంగా పని చేస్తున్నాం. కానీ దీని అమలులో ఎన్నో సవాళ్లున్నాయి. ఇది అంత సులభంగా జరిగేది కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిర్ణయాలు తీసుకోవడానికి సమయం పడుతుంది. మేం వేసే ప్రతీ అడుగు ముందడుగానే ఉంటుంది.
> **రాజీవ్ కుమార్, సీఈసీ**
>
> ధనిక పార్టీ అయిన బీజేపీకి ఇలాంటి ప్రక్రియలు అనుకూలంగా ఉంటాయి. ప్రాంతీయ పార్టీల ఆందోళనలో అర్థం ఉంది. రిమోట్ బూత్‌లున్న ప్రతిచోటా పోలింగ్ ఏజెంట్లను తెచ్చిపెట్టుకునే సామర్థ్యం వారికి ఉండదు. ఎన్నికల బరిలో ఉన్న పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లు లేకుండా రిమోట్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించడం సరి కాదు.
> **జగదీప్ చొకార్, అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ సహ వ్యవస్థాపకుడు**
>
> ఇటీవల జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో చివరి గంటలో 10 నుంచి 12% ఓట్లు పోలయినట్టు గుర్తించాం. అంటే ప్రతీ 25–30 సెకండ్లకి ఒక ఓటు పోలయినట్టు లెక్క. అదెలా సాధ్యం. ఒక ఓటు నమోదు కావడానికి కనీసం 60 సెకండ్ల సమయం పడుతుంది. ఈవీఎంలలో కళ్లకు కట్టినట్టు ఇన్ని దారుణాలు జరుగుతూ ఉంటే ఆర్‌వీఎం అవసరం ఏమొచ్చింది..?
> **జైరామ్ రమేష్, కాంగ్రెస్ ఎంపీ**

కారును ఢీకొట్టి బాయ్‌నెట్‌పై వేలాడుతున్నా ఆపకుండా..

బెంగళూరులో వెలుగుచూసిన అమానుష ఘటన

బనశంకరి: కర్ణాటక రాజధాని బెంగళూరులో మూడు రోజుల క్రితం ఓ వృద్ధుడిని స్కూటరిస్టు నిర్దాక్షిణ్యంగా ఈడ్చుకెళ్లిన ఘటన మరువక ముందే మరో అమానుష ఘటన వెలుగుచూసింది. ఓ మహిళ తన కారుతో యువకుడిని ఢీకొట్టి బాయ్‌నెట్‌పై వేలాడుతున్నా ఆపకుండా కిలోమీటరు దూరం వరకు వెళ్లారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ప్రియాంక అనే మహిళ కారు నడుపుకుంటూ భర్తతో కలిసి జ్ఞానభారతి నగర్ మీదుగా ఉల్లాళ రోడ్డులో వెళుతున్నారు. ఉల్లాల జంక్షన్‌లో దర్శన్ అనే యువకుడు నడుపుతున్న కారును ఆమె స్వల్పంగా ఢీకొట్టారు. అనంతరం అసహ్యకరంగా సంజ్ఞలు చేసుకుంటూ కారు ఆపకుండా వెళ్తున్న ప్రియాంకను దర్శన్ వెంబడించాడు. మంగళూరు పీయూ కాలేజీ వద్ద అడ్డుకున్నాడు. ప్రియాంక ముందుకు వెళ్లేందుకు యత్నించగా దర్శన్ తనను తాను రక్షించుకునేందుకు ఆమె కారు బానెట్‌పైకి ఎక్కాడు. ప్రియాంక కారును ఒక కిలోమీటరు వరకు అలాగే డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. ఈలోగా దర్శన్ సంబంధీకులు వచ్చి ప్రియాంక కారును అడ్డుకుని అద్దాలు పగలగొట్టారు. అనంతరం ఇరు వర్గాల వారు జ్ఞానభారతి పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ప్రియాంకపై సెక్షన్ 307 కింద హత్యాయత్నం కేసు.. దర్శన్, అతడి స్నేహితులపై సెక్షన్ 354 కింద మహిళ గౌరవానికి భంగం కలిగించిన ఆరోపణలపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ డీసీపీ చెప్పారు.

గోడపై మూత్రం పోస్తే చింది మీదనే పడుతుంది

బహిరంగ ప్రదేశాల్లో పని కానిచ్చే వారికి లండన్ యంత్రాంగం విరుగుడు

లండన్: బహిరంగ మూత్ర విసర్జన ప్రపంచవ్యాప్తంగా ప్రబలంగా ఉన్న దురలవాటు. దీని కారణంగా పరిసరాలు దుర్గంధంతో నిండి అందరూ ఇబ్బందులు పడుతున్నారు. లండన్ యంత్రాంగం దీనికి ఓ విరుగుడును కనిపెట్టింది. గోడలపై పోసే మూత్రం చింది తిరిగి వారిపైనే పడితే..? ఆ పాడు పనిని మానుకుంటారేమో. పారదర్శక వాటర్ రిపెల్లెంట్ రసాయనాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీనిని గోడలపై స్ప్రే చేస్తే పోసిన వ్యక్తి పైకే మూత్రం చింది పడుతుంది. దుస్తులు తడిచి పోతాయి. వారికి ఇదే తగిన శిక్ష అవుతుంది. లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ సిటీ కౌన్సిల్ ఇందుకోసం సోహో ప్రాంతాన్ని ఎంచుకుంది. సోహోలో 24 గంటలూ నడిచే బార్లు, రెస్టారెంట్లు, థియేటర్లు, ఇతర వినోద ప్రాంతాలతోపాటు నివాస ప్రాంతాలూ ఉన్నాయి. సుమారు 0.6 చదరపు కిలోమీటర్ విస్తీర్ణంలోని సోహోలో 400కు పైగా ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. పబ్లిక్ టాయిలెట్లు చాలినన్ని లేకపోవడంతో జనం రోడ్డు పక్కన గోడలపైనే మూత్రం పోసేస్తున్నారు. వీధులు దుర్గంధంతో నిండిపోతుండటంతో జనం గగ్గోలు పెడుతున్నారు. దీంతో వీధులను శుభ్రంగా ఉంచేందుకు లండన్ యంత్రాంగం ఏటా రూ.10.26 కోట్లు వెచ్చిస్తోంది. అయినా ఫలితం లేకపోవడంతో తాజాగా కొత్త ఆలోచనను కార్యరూపంలోకి తెచ్చింది. ముందుగా సమస్య తీవ్రంగా ఉన్న 12 ప్రాంతాల్లోని గోడలపై ఈ ద్రావకాన్ని స్ప్రే చేయించింది. ఆయా ప్రాంతాల్లో ఇది మూత్రం పోసే గోడ కాదు (దిస్ వాల్ ఈజ్ నాట్ ఫర్ యూరినల్) అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఇదే ప్రయోగాన్ని మరో ప్రాంతంతోపాటు జర్మనీలోనూ ప్రయోగాత్మకంగా చేసి, మంచి ఫలితం సాధించారు. ఆరునెలల్లోనే మంచి ఫలితం కనిపిస్తుందని స్థానిక అధికారి ఒకరు చెప్పారు.



నూతన భవనంలోనే బడ్జెట్ సమావేశాలు!

- సాంకేతిక సమస్యలు తలెత్తిన పక్షంలో ప్రత్యామ్నాయ ప్రణాళిక
- తొలి విడత పాత భవనంలో, మలి విడత కొత్త భవనంలో సమావేశాలు జరిపేందుకు ఏర్పాట్లు





సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఏడాది బడ్జెట్ సమావేశాలు పార్లమెంట్ నూతన భవనంలో జరిగే అవకాశాలున్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. నూతన భవన నిర్మాణ పనులు దాదాపు ముగింపుకు వచ్చాయని, ఈ నెలాఖరుకు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యేలా యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. 2023–24 ఆర్థిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త భవనంలోనే ప్రవేశపెడతారని, ఇందుకు సంబంధించి సన్నాహాలు జరుగుతున్నాయని చెబుతున్నాయి. 65 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న పార్లమెంట్ నూతన భవనంలో విశాలమైన హాళ్లు, ఆధునిక లైబ్రరీ, అత్యాధునిక రాజ్యాంగ హాలు, ఆధునిక సాంకేతికతతో కూడిన కార్యాలయాలు, కమిటీ గదులు ఉన్నాయి. కొత్త భవనంలోని లోక్‌సభలో 888 సీట్ల అమరిక నెమలి ఆకారాన్ని స్ఫూరించేలా, రాజ్యసభ హాలులో కమలం పువ్వును గుర్తుకు తెచ్చేలా 384 సీట్ల అమరిక ఉంటుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పార్లమెంట్ పాత భవనంలోనే రాబోయే బడ్జెట్ సెషన్‌లో ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి జనవరి 31న ప్రసంగిస్తారని స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం వెల్లడించారు. మరోవైపు లోక్‌సభ సెక్రటేరియట్ పార్లమెంటు కొత్త భవనాన్ని యాక్సెస్ చేయడానికి ఎంపీల కోసం కొత్త గుర్తింపు కార్డులను సిద్ధం చేస్తున్నారు. కొత్త భవనంలో వినియోగించే ఆడియో విజువల్ పరికరాలపై ఎంపీలకు శిక్షణ ఇస్తున్నారు. ఒకవేళ కొత్త భవనంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తిన పక్షంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరిగే తొలి విడత సమావేశాలను పాత భవనంలో, మార్చి 13 నుంచి జరిగే రెండో విడత సమావేశాలను కొత్త భవనంలో నిర్వహించే అవకాశాలున్నాయని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ వర్గాలు వెల్లడించాయి.

నిర్లక్ష్యానికి శిక్షగా మున్సిపాలిటీని రద్దుచేస్తాం!

అహ్మదాబాద్: మోర్బీ మున్సిపాలిటీ తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే మోర్బీ తీగల వంతెన దుర్ఘటన చోటుచేసుకుందని గుజరాత్ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ఆరోపించింది. ' మీ నిర్లక్ష్యానికి శిక్షగా మున్సిపాలిటీ పాలకమండలిని రద్దుచేద్దామనుకుంటున్నాం. అలా ఎందుకు చేయకూడదో సర్వసభ్య సమావేశం తీర్మానం రూపంలో లిఖితపూర్వక సమగ్ర సంజాయిషీ ఇవ్వండి' అని పట్టణాభివృద్ధి శాఖ నోటీసులు పంపించింది. ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణలో తేలిన వాస్తవాలు ఇవీ అంటూ ఆరోపణలు గుప్పించింది. ' తీగల వంతెన బాధ్యతలు చూసిన ఒరేవా గ్రూప్ నిర్వహణ ఒప్పందం 2017లోనే ముగిసింది. ఆ తర్వాత 2018–2020 కాలంలో వంతెన అధ్వానంగా తయారైందని, కూలే ప్రమాదముందని మున్సిపాలిటీకి ఒరేవా గ్రూప్ చాలా సార్లు ఉత్తరాలు రాసి హెచ్చరించింది. అయినా మున్సిపాలిటీ పెడచెవిన పెట్టింది. ఒప్పందం ముగిసినా వంతెనను తమ అధీనంలోకి తీసుకోలేదు' అని పేర్కొంది. కాగా, ఒరేవా సంస్థనూ పట్టణాభివృద్ధి శాఖ తలంటింది. ' తమ పని పూర్తయ్యాక అధీకృత విభాగానికి వంతెన నిర్వహణ బాధ్యతలను తిరిగి అప్పజెప్పలేదు. నిపుణులను సంప్రదించకుండానే రిపేర్లు పూర్తిచేశారు. అధిక బరువుతో పెద్దస్థాయిలో జనం ఒకేసారి వంతెనపై వెళ్తున్నా పట్టించుకోలేదు. పరిమితికి మించి టికెట్లు అమ్ముతున్నా మిన్నకుండిపోయారు' అని ఒరేవానుద్దేశిస్తూ నోటీసులో పేర్కొంది. గత ఏడాది అక్టోబర్ 30న మోర్బీ పట్టణంలో మచ్చూ నదిపై నిర్మించిన ప్రసిద్ధ తీగల వంతెన భారీ సంఖ్యలో వచ్చిన సందర్శకుల అధిక బరువుతో నదిలో కూలడంతో 135 మంది జలసమాధి అయిన విషయం విదితమే.

జోడో యాత్రలో సంజయ్ రౌత్



కథువా: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సారథ్యంలో కొనసాగుతున్న దేశవ్యాప్త భారత్ జోడో యాత్ర శుక్రవారం జమ్మూకశ్మీర్ సరిహద్దు జిల్లా కథువాలోని హట్లీ మోర్హ్ నుంచి ప్రారంభమైంది. ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో రాహుల్ రెయిన్ కోటు ధరించారు. ఇప్పటి వరకు తీవ్ర శీతల వాతావరణంలోనూ రాహుల్ ప్యాంట్, టీ–షర్ట్‌తోనే యాత్రలో పాల్గొన్న విషయం తెలిసిందే. శుక్రవారం యాత్రలో శివసేన ఉద్ధవ్ బాల్ ఠాక్రే వర్గం నేత సంజయ్ రౌత్ పాలుపంచుకున్నారు. 'మా పార్టీ తరఫున జోడో యాత్రలో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చాను. దేశంలో పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. వాస్తవ సమస్యలపై పోరాడుతున్న నేత రాహుల్ గాంధీ. ప్రజానాయకుడు కాబట్టే ఆయన బయటకు వచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా ఈ యాత్రలో పాల్గొని మమేకమవుతున్నారు. తమ నాయకుడిని ప్రజలే నిర్ణయించుకుంటారు'అని రౌత్ ఈ సందర్భంగా చెప్పారు. సీఆర్‌పీఎఫ్ జవాన్ల భారీ భద్రత నడుమ యాత్ర సాగుతోంది. యాత్ర 25 కిలోమీటర్ల మేర సాగి శుక్రవారం రాత్రి కథువా జిల్లా చంద్వాల్‌లో బస చేసింది. శనివారం యాత్రకు విరామం.

ఎయిరిండియాకు షాక్

న్యూఢిల్లీ: న్యూయార్క్–ఢిల్లీ ఎయిరిండియా విమానంలో తప్పతాగిన వ్యక్తి తోటి ప్రయాణికురాలిపై మూత్రం పోసిన ఘటనపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) చర్యలు ప్రకటించింది. టాటా యాజమాన్యంలోని ఎయిరిండియా సంస్థకు రూ.30 లక్షల జరిమానా విధించింది. సదరు విమానం పైలట్–ఇన్–కమాండ్ లైసెన్సుపై మూడు నెలలపాటు సస్పెన్షన్ విధించింది. నాటి ఘటనపై స్పందించడంలో విఫలమైన ఎయిరిండియా డైరెక్టర్ ఇన్ ఫ్లైట్‌కు రూ.3 లక్షల జరిమానా విధిస్తున్నట్లు తెలిపింది. గత ఏడాది నవంబర్ 26వ తేదీన ఈ ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ప్రయాణికురాలి పట్ల అమర్యాదకరంగా వ్యవహరించిన ఆరోపణలపై ఒక విమానయాన సంస్థకు డీజీసీఏ జరిమానా విధించడం ఇదే మొదటిసారి. డీజీసీఏ ఉత్తర్వులను పరిశీలిస్తున్నట్లు ఎయిరిండియా ప్రతినిధి ఒకరు తెలిపారు. 'అమర్యాదకరంగా ప్రయాణికులు వ్యవహరించిన సందర్భాల్లో నిబంధనల మేరకు స్పందించేందుకు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం'అని ఆయన అన్నారు.

బహు భార్యత్వం, నిఖా హలాలాపై సుప్రీం బెంచ్

న్యూఢిల్లీ: ముస్లింలు పాటిస్తున్న బహు భార్యత్వం, నిఖా హలాలా ఆచారాల రాజ్యాంగ చట్టబద్ధతను తేల్చేందుకు త్వరలో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని పునరుద్ధరిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. బహు భార్యత్వం, నిఖా హలాలాలను చట్టవ్యతిరేకమైనవిగా ప్రకటించాలంటూ న్యాయవాది అశ్వనీకుమార్ ఉపాధ్యాయ్ వేసిన పిల్‌నుద్దేశిస్తూ కోర్టు ఈ విషయాన్ని తెలిపింది. ' బహు భార్యత్వం సహా పలు కీలకాంశాలు గతంలోనే ఏర్పాటైన సంబంధిత ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ముందు ఉన్నాయి. అయితే ఈ బెంచ్‌లోని ఇద్దరు జడ్జీలు రిటైర్ అవడంతో కొత్త వారితో బెంచ్‌ను ఏర్పాటుచేయాల్సి ఉంది. త్వరలోనే ఈ పని పూర్తిచేస్తాం' అని సీజేఐ అన్నారు. బహు భార్యత్వం ప్రకారం భారత్‌లోని ఒక ముస్లిం పురుషుడు నలుగురు భార్యలను కల్గిఉండొచ్చు. కాగా, మాజీ భర్తను పెళ్లాడాలంటే ఒక ముస్లిం మహిళ.. మరొకరిని పెళ్లాడి, విడాకులు ఇవ్వాలి. ఆ తర్వాతే మాజీ భర్తను పెళ్లిచేసుకోవచ్చు.

బీబీసీ ఉదంతంలో మోదీకి సునాక్ మద్దతు

లండన్: ప్రధాని నరేంద్ర మోదీ గతంలో గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో చెలరేగిన గోద్రా అల్లర్ల ఘటనకు ఆయనే ప్రధాన బాధ్యుడు అని బీబీసీ వార్తసంస్థ ప్రసారంచేసిన డాక్యుమెంటరీ వివాదమైన నేపథ్యంలో మోదీకి బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ మద్దతు పలికారు. గోద్రా అల్లర్లకు మోదీని బాధ్యుడు అని మీరు భావిస్తున్నారా ? అని బ్రిటన్ పార్లమెంట్‌లో విపక్ష లేబర్ పార్టీ సభ్యుడు, పాక్ మూలాలున్న ఇమ్రాన్ హుస్సేన్.. సునాక్‌ను ప్రశ్నించారు. దీనికి సునాక్ సమాధానమిచ్చారు. ' ప్రధాని మోదీని ఇమ్రాన్ అభివర్ణించిన రీతిని నేను అంగీకరించను. భారత్ విషయంలో బ్రిటన్ వైఖరి శాశ్వతంగా ఒకేలా ఉంటుంది. అది ఏమాత్రం మారదు' అని సునాక్ వ్యాఖ్యానించారు. కాగా, గోద్రా అల్లర్లకు మోదీనే బాధ్యుడు అంటూ ప్రసారమైన డాక్యుమెంటరీని బీబీసీ సమర్థించుకుంది. 'అవిశ్రాంతంగా చేసిన పరిశోధన, అత్యున్నత ఎడిటోరియల్ ప్రమాణాల ఫలితమే ఈ డాక్యుమెంటరీ' అని పేర్కొంది.

వేగవంత అభివృద్ధి ఉపాధిని సృష్టిస్తోంది

71 వేల మందికి నియామక పత్రాలిస్తూ ప్రధాని మోదీ వ్యాఖ్య



న్యూఢిల్లీ: మౌలిక, అనుబంధ రంగాల్లో వడివడిగా అభివృద్ధి అడుగులు పడుతుండటం వల్లే దేశంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు పుట్టుకొస్తున్నాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో కొత్తగా ఉద్యోగాలు పొందిన 71,426 మందికి శుక్రవారం నియామక పత్రాలను ప్రధాని మోదీ ఎలక్ట్రానిక్ పద్ధతిలో అందజేశారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా శుక్రవారం ఢిల్లీలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్తగా ఎంపికైన సిబ్బందితో మోదీ కొద్దిసేపు మాట్లాడారు. ' నియామక ప్రక్రియలో పూర్తి పారదర్శకత, వేగం తెస్తూ కచ్చితమైన కాలవధితో రిక్రూట్‌మెంట్ చేస్తున్నాం. కొత్తగా వేలాది మందికి ఉద్యోగాలతో కొనసాగుతున్న ఈ రోజ్‌గార్ మేళానే మా ప్రభుత్వ పనితీరుకు చక్కని నిదర్శనం' అని వ్యాఖ్యానించారు.

విధిలో బాధ్యతగా మెలగండి

నూతన ఉద్యోగాల్లో కొలువుదీరే సిబ్బందిని ఉద్దేశించి మోదీ కొన్ని సూచనలు చేశారు. ' వ్యాపారి తన వినియోగదారుడికి అత్యంత ప్రాధాన్యతనిస్తాడు. ఇదే మంత్రం మీ మదిలో ప్రతిధ్వనించాలి. ప్రజాసేవకు అంకితం కావాలి. కార్యనిర్వహణలో పౌరుడి సేవే ప్రథమ కర్తవ్యంగా ఉండాలి. ప్రజాసేవే ముఖ్యం' అని సూచించారు. 'ప్రతీ గ్రామం భారత్‌నెట్ ప్రాజెక్టులో భాగస్వామి అయిననాడు అక్కడ ఉపాధి కల్పన ఎక్కువ అవుతుంది. టెక్నాలజీని అంతగా అర్థంచేసుకోలేని వారు ఉండేచోట వారికి ఆన్‌లైన్ సేవలు అందిస్తూ కొత్త వ్యాపారం ప్రారంభించేందుకు అవకాశం చిక్కుతుంది. ఇలాంటి కొత్త వ్యాపారాలు చేసేందుకు రెండో శ్రేణి, మూడో శ్రేణి పట్టణాలు అక్కడి అవకాశాలను అందిపుచ్చుకునే నిరుద్యోగ యువతకు నూతన గుర్తింపును తీసుకొస్తున్నాయి' అని అన్నారు. 'భవిష్యత్తులో దేశంలో వివిధ రంగాల్లో మరింతగా ఉపాధి కల్పనకు రోజ్‌గార్ మేళా ఒక ఉత్ప్రేరకంగా పనిచేయగలదు. దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యే యువతకు సరైన ఉపాధి అవకాశాలు దక్కాలి' అని ఈ సందర్భంగా ప్రధాని కార్యాలయం పేర్కొంది.

బీజేపీలోకి రండి లేదంటే బుల్డోజర్ రెడీ

గుణ/భోపాల్: బీజేపీ పార్టీలోకి వచ్చేయండి లేదంటే ముఖ్యమంత్రి రూపంలో ఉండే బుల్డోజర్‌ను మీరు ఎదుర్కోవాల్సి ఉంటుందని మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి, బీజేపీ నేత మహేంద్ర సింగ్ సిసోడియా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహేంద్ర ప్రస్తుతం ఆ రాష్ట్ర పంచాయతీ వ్యవహారాల మంత్రిగా ఉన్నారు. రాష్ట్రంలోని రుతియాయీ పట్టణంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు విస్తృతంగా షేర్ అవుతోంది. 'కాంగ్రెస్ సభ్యులారా.. మా వైపు(బీజేపీ పార్టీలోకి)కు వచ్చేయండి. ఈసారీ మేమే ప్రభుత్వం ఏర్పాటుచేస్తాం. మీరు ఇటు వైపు రాలేదంటే మీ కోసం ముఖ్యమంత్రి బుల్డోజర్ సిద్ధంగా ఉంటుంది' అని మంత్రి హెచ్చరించారు. ముఖ్యమంత్రి చౌహాన్.. వేర్వేరు నేరాల్లో నిందితులుగా ఉన్న వారి ఇళ్లను బుల్డోజర్లతో కూల్చి స్థానికంగా 'మామా'గా పేరుతెచ్చుకున్నారని మంత్రి చెప్పారు. మంత్రి వ్యాఖ్యలను కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ తీవ్రంగా తప్పుబట్టారు.

డేరా బాబాకు 40 రోజుల పెరోల్



చండీగఢ్: డేరా సచా సౌదా చీఫ్ గుర్మీత్ రాంరహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబా(55)కు కోర్టు 40 రోజుల పెరోల్ మంజూరు చేసింది. ఇద్దరు శిష్యురాళ్లపై అత్యాచారానికి పాల్పడిన కేసులో గుర్మీత్ 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. గతంలోనూ అంటే గత ఏడాది అక్టోబర్ 14వ తేదీన కోర్టు ఇతడికి పెరోల్ మంజూరు చేసింది. జైలు నుంచి బయటకు వచ్చిన ఈయన యూపీలోని బర్నావా ఆశ్రమానికి వెళ్లిపోయారు. అక్కడి నుంచే ఆన్‌లైన్ ద్వారా పలు సత్సంగ్‌లు నిర్వహించారు. వీటికి కొందరు హరియాణా బీజేపీ నేతలు సైతం హాజరయ్యారు. తాజా పెరోల్ సమయంలో ఈ నెల 25న జరగనున్న డేరా మాజీ చీఫ్ షా సత్నామ్ సింగ్ జయంత్యుత్సవాల్లో పాల్గొంటారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

సాక్షి కరీంనగర్

శనివారం । 21 । జనవరి । 2023



వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: రాజన్న సన్నిధిలో మాసశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు.



గోదావరికి మొక్కులు

ధర్మపురి:వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు శుక్రవారం గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు.

గరిష్టం/కనిష్టం
30.0/18.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బస్టాండ్‌లో భద్రత పటిష్టం

- సీసీ కెమెరాలను పరిశీలించిన టౌన్ ఏసీపీ



బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న టౌన్ ఏసీపీ తుల శ్రీనివాస్, సీఐ నటేష్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బస్టాండులో సీసీ కెమెరాల పనితీరును శుక్రవారం టౌన్ ఏసీపీ తుల శ్రీనివాసరావు, సీఐ సీహెచ్ నటేష్ పరిశీలించారు. బస్టాండ్ మొత్తం పరిశీలించి ప్రయాణికుల భద్రత కోసం పలు ఏర్పాట్లు చేశారు. గతంలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో కొన్ని పనిచేయడం లేదు. దీంతో వాటికి రిపేరు చేపించారు. బస్టాండులో నేరాలు జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. పనిచేయని వాటిని గుర్తించి వాటికి వెంటనే మరమ్మతు చేపించాలని సీఐకి సూచించారు.


స్టేషన్ రైటర్లు చురుకైన పాత్ర పోషించాలి



మాట్లాడుతున్న ఏసీపీ కాశయ్య

కరీంనగర్‌క్రైం: కేసుల వివరాల నమోదులో ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా పోలీస్ స్టేషన్ల రైటర్లు వివరాలు నమోదు చేయాలని, పోలీస్ స్టేషన్ల పనితీరులో చురుకైన పాత్ర పోషించాలని వివిధ విభాగాల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి ఏసీపీ పి.కాశయ్య అన్నారు. శుక్రవారం కమిషనరేట్ కేంద్రంలో వివిధ పోలీస్ స్టేషనకు చెందిన రైటర్లకు ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్‌తో కలిసి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టేషన్ రైటర్లు టీఎస్‌కాప్‌యాప్‌నకు అనుసంధానం అయ్యేలా వివిధ రకాల యాప్‌ల వినియోగంపై పట్టుసాధించాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శ్రద్ధాసక్తులతో అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టులో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. పెండింగ్ కేసులు పరిమిత సంఖ్యకన్నా తక్కువ ఉండేలా ఇన్వెస్టిగేషన్ అధికారులకు సహాయకులుగా వ్యవహరించాలని వివరించారు. పోలీస్ స్టేషన్లలో క్రమపద్ధతిలో రికార్డుల నిర్వహణను కొనసాగించాలని, ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా ఎప్పటికప్పుడు కేసుల వివరాలు నమోదు చేయాలన్నారు.

వరి పొలాల పరిశీలన



కొత్తగట్టులో పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శంకరపట్నం(మానకొండూర్): వరి పంటలో తెగుళ్ల తీవ్రత ఉధృతంగా ఉందని, వరి మొదళ్లు తడిచేవరకు పురుగు మందులు పిచికారీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ అన్నారు. మండలంలోని కొత్తగట్టు, మొలంగూర్ గ్రామాల్లో శుక్రవారం వరిపొలాలను కేవీకే శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. అన్నిరకాల పురుగుల నివారణకు ఎకరానికి బైపెత్రిన్ 200 మిల్లీలీటర్లు 250 లీటర్ల నీటిలో కలిపి వరి మొదళ్లు తడిచేవరకు పిచికారీ చేయాలన్నారు. కార్బట్ హైడ్రోక్లోరైడ్ మందు 400 గ్రాములు 250 లీటర్ల నీటిలో కలిపి వారం తర్వాత పిచికారీ చేయాలని సూచించారు. జింక్ లోప నివారణకు చిలేటడ్, సూక్ష్మపదార్థాల మిశ్రమం 500 గ్రాముల మందును 500 లీటర్ల నీటిలో కలిపి మొక్క తడిచేలా పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ సంజీవరెడ్డి, కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, ఏవో శ్రీనివాస్, ఏఈవో శ్రావణి, సీఈవో సదయ్య, రైతులు పాల్గొన్నారు.

నేడు హైకోర్టు జడ్జి వేణుగోపాల్ రాక



వేణుగోపాల్

కరీంనగర్‌క్రైం: హైకోర్టు జడ్జి ఈ.వీ.వేణుగోపాల్ శనివారం కరీంనగర్‌కు రానున్నారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్ 60వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇదే పాఠశాలలో చదువుకున్న ఆయన హైకోర్టు జస్టిస్‌గా సేవలందిస్తూ కార్యక్రమానికి రానుండడంతో పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

రైల్వే స్టేషన్లకు కొత్త సొబగులు!

- కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లకు మహర్దశ
- ప్రత్యేక ప్రణాళిక ద్వారా అభివృద్ధి చేయనున్న ద.మ. రైల్వే
- ఏయే సదుపాయాలు కల్పించవచ్చో అధ్యయనం
- అమృత్ భారత్ కింద ప్రతీ స్టేషన్‌కు రూ.20 కోట్లు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దక్షిణ మధ్య రైల్వే తన పరిధిలో ఉన్న స్టేషన్ల ఆధునికీకరణకు చర్యలు చేపడుతోంది. ఇటీవల సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలో ఉన్న అన్ని స్టేషన్లలో ట్రాకుల సామర్థ్యం గంటకు 130 కి.మీ మేరకు పెంచిన విషయం తెలిసిందే. తాజాగా తన పరిధిలో ఉన్న మొత్తం 20 స్టేషన్లలో ఆధునికీకరణ పనులు చేపట్టి, కావాల్సిన సదుపాయాలు కల్పించేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే సమాయత్తమవుతోంది. సదరు 20 స్టేషన్ల జాబితాలో కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల స్టేషన్లు కూడా ఉన్నాయి. ఈ స్టేషన్లలో ప్రయాణికులకు ఏయే సదుపాయాలు కల్పించవచ్చో గుర్తించే పనిని టెండర్లు సొంతం చేసుకున్న టెక్నికల్ కన్సల్టెన్సీలు గుర్తించి, దక్షిణ మధ్య రైల్వేకు అందజేస్తాయి. సదరు నివేదికల ఆధారంగా కావాల్సిన సదుపాయాలు, పనులను ద.మ.రైల్వే చేపడుతుంది.

ఉమ్మడిజిల్లాలో మూడు స్టేషన్లు..!

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లు కీలకమైనవి. ఇందులో పెద్దపల్లి, రామగుండం నిత్యం రద్దీగా ఉండే స్టేషన్లు.

- రాష్ట్రంలో తిరిగే రైళ్లతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ తదితర ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లేందుకు ఈ రూటు ప్రధానం.
- ఇటీవల ఈ మార్గంలో మూడో రైలు మార్గం కూడా అందుబాటులోకి వచ్చింది. అలాగే.. ఈ మార్గంలో 130 కి.మీ వేగంతో వందేభారత్ రైలు వెళ్లేలా పట్టాల సామర్థ్యాన్ని దక్షిణ మధ్య రైల్వే అప్‌గ్రేడ్ చేసింది.
- తాజాగా స్టేషన్లలో సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టడం శుభపరిణామం అని పలువురు ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు.
- కన్సల్టెన్సీలు ఇచ్చే నివేదికల ఆధారంగా రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు ఉన్నతాధికారులు చర్యలు చేపడతారు.
- వీటి ప్రకారం.. స్టేషన్ల సుందరీకరణ, గోడలపై స్థానిక కళారూపాలు, చిత్రాలు వేయడం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సైనేజ్ బోర్డులు, రెస్ట్ రూములు, వెయిటింగ్ రూములు, అదనపు, కౌంటర్లు, బెంచీలు, పార్కింగ్, లైటింగ్, హైలెవల్ ప్లాట్ ఫారాలు, రైళ్ల రాకపోకలను తెలిపే డిజిటల్ బోర్డులు, దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలు తదితరాలు కల్పిస్తారు.
- ముఖ్యంగా కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారం లేదు. అలాగే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేదు. ఈ సదుపాయాల కోసం కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఈ సదుపాయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి.
- ప్రతీ ఆదివారం, గురువారం కరీంనగర్ నుంచి తిరుపతికి బయల్దేరే బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ చాలా రద్దీగా ఉంటోంది. ప్రయాణికులతోపాటు వారి బంధువులతో ఆ రెండు రోజులు స్టేషన్ కిక్కిరిసిపోతోంది.
- ఒకటే ప్లాట్‌ఫారంతో ప్రయాణికులు, వారి బంధువులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి వచ్చిన వారి కష్టాలు చెప్పతరం కావు.

అమృత్ భారత్ కింద అభివృద్ధి..

అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజునవేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌మిషన్) పథకం కింద దేశంలోని 1000 చిన్న రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేయాలని కేంద్రం ఇటీవల నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన స్టేషన్లలో ప్రయాణికులకు కనీసం సదుపాయాలు కల్పించేలా వాటికి అవసరాన్ని బట్టి రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లు కేటాయించనుంది. కన్సల్టెన్సీలు పని పూర్తిచేసిన అనంతరం వాటి నివేదిక ఆధారంగా సదుపాయాల కోసం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లకు కనీసం రూ.30 కోట్ల నుంచి రూ.60 కోట్లు కేటాయించే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా అనేక రైల్వేస్టేషన్ల ముఖద్వారాల నిర్మాణం, అదనపు భవనాల నిర్మాణం, అవసరమైతే కారాల్యాలయాల తరలింపు కూడా చేపడతారు.

వేగంగా కొత్తపల్లి–మనోహరాబాద్ పనులు..

హైదరాబాద్–కరీంనగర్‌ను కలిపే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కొత్తపల్లి–మనోహరాబాద్. ఈ రైల్వే లైను ఇప్పటికే మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు పూర్తయ్యింది. సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల నుంచి వేములవాడ వరకు పనులు వేగంగా నడుస్తున్నాయి. సిరిసిల్ల డివిజన్‌లోని తంగళ్లపల్లి వద్ద తమకు 37 ఎకరాలు కావాలని దక్షిణ మధ్య రైల్వే కోరగా సిరిసిల్ల కలెక్టర్ కేటాయించారు. ఈ భూమి కేటాయింపులు ఇటీవల పూర్తయ్యాయి. మరోవైపు తంగళ్లపల్లి నుంచి కొత్తపల్లి వరకు భూసేకరణ పనులు నడుస్తున్నాయి.

శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

- కరీంనగర్ సీపీ వి.సత్యనారాయణ



మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ

కరీంనగర్‌క్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో అన్నిస్థాయిల పోలీసు అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని కరీంనగర్ సీపీ వి.సత్యనారాయణ ఆదేశించారు. జిల్లాలోని పోలీసు అధికారులతో శుక్రవారం సీపీ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనరేట్‌లోని వివిధ ప్రాంతాల్లో శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలతో నిరంతరం గస్తీ నిర్వహించాలని చెప్పారు. ఆన్‌లైన్ రుణాల పేరిట ఈ మధ్యకాలంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కమిషనరేట్ వ్యాప్తంగా అక్రమ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు నిరంతరం స్పెషల్ డ్రైవ్‌లను కొనసాగించనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలను నిరంతరం కొనసాగించాలని.. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

దళితబంధుతో సామాజిక మార్పులు

- వీసీకే పార్టీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ సింతనై సెల్వన్
- హుజూరాబాద్ నియోజకవర్గంలో పర్యటించిన తమిళనాడు బృందం



యూనిట్‌ను పరిశీలిస్తున్న తమిళనాడు బృందం

హుజూరాబాద్: దళితుల ఆర్థిక వృద్ధికి అమలు చేస్తున్న దళితబంధు పథకం భేష్‌గా ఉందని, దళితబంధుతో దళితుల జీవన ప్రమాణాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయని తమిళనాడు కట్టుమర్నాకోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే, వీసీకే (విదుతలై చిరుతైగల్ కచ్చి) పార్టీ ఫ్లోర్ లీడర్ సింతనై సెల్వన్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు, పల్లెప్రగతి పనులను తమిళనాడు బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం సభ్యుడు సింతనై సెల్వన్ మాట్లాడుతూ.. దళితబంధు పథకం వినూత్నమైన పథకం అని, ఎస్సీ సామాజికవర్గాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూ, వారిని గొప్ప పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రవేశపెట్టడం జాతీయస్థాయిలో మొదటిదని తెలిపారు. నిన్నటివరకు కూలీలుగా ఉన్నవారిని ఒకేసారి యజమానులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ పథకం దేశంలోని అన్నిరాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని, పర్యటన పూర్తిచేసుకొని వెళ్లిన వెంటనే తెలంగాణ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను తమిళనాడులో కూడా ప్రవేశపెట్టేలా ముఖ్యమంత్రి యం.కె.స్టాలిన్‌కు వివరిస్తానని చెప్పారు. దళితబంధు ద్వారా లబ్ధిదారులు వేల్పుల శారద, కొంకటి శ్రావ్య ప్రారంభించిన జ్యూట్ బ్యాగుల పరిశ్రమను సందర్శించారు. హుజూరాబాద్, కరీంనగర్, జమ్మికుంట, హన్మకొండ జిల్లాలకు జ్యూట్ బ్యాగ్స్ సరఫరా చేస్తూ నెలకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు లాభం పొందుతున్నామని ఈ సందర్భంగా వారు చెప్పారు. మరో లబ్ధిదారు మోత్కూరి హరిత మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ షాపును ప్రారంభించి నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదిస్తున్నట్లు తెలిపారు. అనంతరం హుజూరాబాద్ మండలం కనుకులగిద్ద గ్రామంలోని పల్లెప్రకృతి వనం, వైకుంఠధామం, రైతువేదిక, గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని బృంద సభ్యులు పరిశీలించారు. ఈ పర్యటనలో తిరుప్పూర్ ఎమ్మెల్యే ఎస్.ఎస్.బాలాజీ, చెన్నై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రిచర్డ్ దేవదాస్, సాసి త్రివేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ మురుగప్పన్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డా.వి.ఎ.రమేశ్ నాథన్, సోషల్ వాచ్ కుమార్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పక్షం రోజుల్లో ఓటరు జాబితా పరిశీలన

- వంద శాతం పూర్తవ్వాల్సిందే
- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ కర్ణన్, అదనపు కలెక్టర్లు

కరీంనగర్ అర్బన్: జిల్లాలో రాబోయే 15 రోజుల్లో ఓటరు జాబితాలో ఉన్న పీఎస్‌ఈ ఎంట్రీలు వంద శాతం క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌తో కలిసి జాతీయ ఓటరు దినోత్సవం, పీఎస్‌ఈ ఎంట్రీ ధ్రువీకరణ, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ, ఓటర్ ఐడీతో ఆధార్ అనుసంధానం ప్రక్రియపై వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో ఎన్నికల కమిషన్‌తో జారీచేసిన గీతాన్ని మైక్‌ల ద్వారా వినిపించాలని అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. 80 ఏళ్లు పైబడిన ఓటర్లను, నూతన ఓటర్లను సన్మానించాలని కలెక్టర్‌కు సూచించారు. నూతనంగా ఓటరుగా నమోదు చేసిన అభ్యర్థులకు ఓటరు కార్డులు పోస్టల్ శాఖ ద్వారా చేరేలా జిల్లా స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ.. ఆధార్ లింకేజీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మున్సిపల్ రిసోర్స్ పర్సన్స్ ద్వారా ఓటర్లను చైతన్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్యామ్ ప్రసాద్ లాల్, జడ్పీ సీఈఓ ప్రియాంక, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాల/ పాఠశాల, మానకొండూర్ (బాలుర)లో 2023– 24 విద్యా సంవత్సరానికి 5,6,7,8వ తరగతులు, ఇంటర్మీడియట్ సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పిడిశెట్టి సంపత్ తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు నేరుగా తిమ్మాపూర్‌లోని రవాణాశాఖ కార్యాలయం దగ్గర ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. 5వ తరగతిలో మైనార్టీ విద్యార్థులకు 60 సీట్లు, బీసీ–10, ఎస్సీ– 5, ఎస్టీ–3, ఓసీ– 2 సీట్లు ఉన్నాయని వివరించారు. ఇంటర్మీడియేట్‌లో మైనారిటీ విద్యార్థులకు 30, బీసీ– 5, ఎస్సీ– 2, ఎస్టీ– 2, ఓసీ–1 సీట్లు ఉన్నాయని తెలిపారు. 6,7,8 తరగతులలో కేవలం ముస్లిం మైనార్టీ బ్యాక్ లాగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.1,50,000, పట్టణ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రుల ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 79950 57932, 86393 44647 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వైద్య కళాశాల ప్రారంభానికి అడుగులు

- ఇప్పటికే రూ.7 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- కళాశాలకు కేటాయించిన స్థలంలో ఉన్న నిర్మాణాల పరిశీలన
- తాత్కాలిక తరగతులు, ల్యాబ్‌ల కోసం మరమ్మతులు



గోదాములను పరిశీలిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్, మెడికల్ సూపరింటెండెంట్ తదితరులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మెడికల్ కళాశాలను వచ్చే ఏడాది ప్రారంభించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. వైద్య కళాశాల మంజూరు కావడంతో ఇప్పటికే కళాశాల భవన నిర్మాణానికి కొత్తపల్లిలోని విత్తనాభివృద్ధి కేంద్రానికి సంబంధించిన 25 ఎకరాల స్థలంతోపాటు గోడౌన్లను మెడికల్ కళాశాల ఏర్పాటుకు అప్పగించారు. గతంలో వైద్య విధాన పరిషత్‌లో ఉన్న జిల్లా ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రులు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోకి చేరాయి. వచ్చే ఏడాదిలో వైద్య కళాశాలను ప్రారంభించేందుకు డీఎంఈ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా ఆసుపత్రిలోని రెండో అంతస్తులో ప్రస్తుతం వైద్య కళాశాల అడ్మినిస్ట్రేషన్ విభాగాల కోసం గదులు కేటాయించారు. ఇప్పటికే 500 పడకలతో ఆసుపత్రి నడుస్తుండగా, మరో 100 పడకలతో క్రిటికల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కరీంనగర్ పర్యటనలో ప్రకటించారు.

పెరగనున్న సేవలు

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ప్రధానాసుపత్రితోపాటు ఎంసీహెచ్ ఆసుపత్రి ఉన్నాయి. వైద్య కళాశాల మంజూరు కావడంతో ఇటీవలే ఆసుపత్రిని ప్రభుత్వ వైద్య కళాశాలగా పేరు మార్చారు. ఇటీవలే వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ విధుల్లో చేరారు. వైద్య కళాశాల ప్రారంభం తర్వాత విద్యార్థులకు కళాశాలలో చదువుతోపాటు జనరల్ ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రిలో విభాగాల వారీగా ప్రొఫెసర్ స్థాయి వైద్యులు సేవలందించనున్నారు.

విత్తనాభివృద్ధి గోదాముల పరిశీలన

వచ్చే ఏడాదిలో వైద్య కళాశాల ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. 100 మంది విద్యార్థులతో మొదటి బ్యాచ్ ప్రారంభం కానుంది. ఇందులో భాగంగానే శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్, మెడికల్ సూపరింటెండెంట్, ప్రోగ్రాం ఆఫీసర్, ఆర్ఎంవో, ఇతర వైద్య, వైద్యేతర సిబ్బంది కళాశాల నిర్మాణం కోసం కొత్తపల్లిలోని విత్తనాభివృద్ధి సంస్థకు చెందిన గోడౌన్లు, ఇతర భవనాలను పరిశీలించారు. ఇప్పటికే ప్రభుత్వం కళాశాల నూతన భవనం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా తరగతి గదులు, ల్యాబ్‌లు నడుపుకునేందుకు గోడౌన్లలోనే మరమ్మతులు చేపట్టేందుకు రూ.7 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులు ప్రారంభించనున్నారు. అయితే.. ఇప్పటికే కళాశాల నడిపేందుకు ఇక్కడ కల్పిస్తున్న వసతులపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) బృందం సైతం సందర్శించింది. ఈ బృందం సభ్యులు ఇచ్చే నివేదికనే కళాశాల ప్రారంభానికి కీలకంగా మారనుంది.

అలరించిన టీఎల్‌ఎం మేళా

- విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయుల ప్రయోగాలు
- ఆకట్టుకున్న బోధన ఉపకరణాలు



ఉపాధ్యాయుల ప్రదర్శనలకు జడ్జిమెంట్ చేస్తున్న న్యాయనిర్ణేతలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళాలో ఉపాధ్యాయుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బోధన, అభ్యసన, ఉపకరణాలు (టీచింగ్, లర్నింగ్, మెటీరియల్స్) పేరుతో లో కాస్ట్..నో కాస్ట్‌తో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రదర్శనలో జిల్లా వ్యాప్తంగా 16 మండలాల నుంచి 1–5వ తరగతి సబ్జెక్టులకు సంబంధించి 134 ప్రదర్శనలు ప్రదర్శించారు. తెలుగు 32, ఆంగ్లం 32, గణితం 32, ఈవీఎస్ 32, ఉర్దూ 6 ప్రదర్శనలు వచ్చాయి. జిల్లా స్థాయిలో సబ్జెక్టు పరంగా రెండు ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్రస్థాయి టీఎల్‌ఎం ప్రదర్శనకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు.

గణిత రోబో తయారు చేశా..



వేస్ట్ కాటన్ డబ్బాలు, పడేసిన వీల్స్, చార్టులతో గణిత రోబో తయారు చేశా. గణిత రోబోలో 1 నుంచి 5వ తరగతి వరకు గణితశాస్త్రంలో విద్యార్థులకు కావాల్సిన అన్ని గుణకాలు ఉండేలా చేసి చూపించా. 0 నుంచి 9999 వరకు నంబర్స్, 1 నుంచి 10 వరకు టేబుల్స్, గుర్తులు, బొమ్మలను గుర్తిస్తూ నంబర్స్ చదవడం లాంటి ఎన్నో బోధన పరికరాలు ఉండేలా తయారు చేశా.

– పి.మాధవిలత, ఎంపీయూపీఎస్, ఖాసీంపేట, గన్నేరువరం

తెలుగు పదాల క్రీడా ప్రాంగణం



పనికిరాని వస్తువులపై తెలుగు అక్షరాలను అందంగా రాసి వాటిని ఒక దానికి ఒకటి జోడించి పదాల క్రీడా ప్రాంగణాన్ని తయారు చేశా. పదచక్రం, పదాలు తయారు చేద్దాం, వ్యాక్యాలతో నిర్మాణం చేయడం, ఒత్తులు, ద్విత్వాక్షరాలు వంటి ప్రదర్శనలు తయారు చేసి ప్రదర్శించా.

– టి.రమేశ్, ఎంపీపీఎస్, రామచంద్రాపూర్, సైదాపూర్

సులభంగా ఆంగ్లం..



1 నుంచి 5వ తరగతి విద్యార్థులు సులభంగా ఆంగ్లం నేర్చుకునేందుకు ఉపయోగపడే చార్ట్ తయారు చేశా. ప్రీ పొజిషన్స్, హార్డ్ గ్రామర్‌ను సులువుగా ఎలా నేర్చుకోవాలో తదితర వాటిని జోడించి ప్రదర్శించా.

– ఎస్.హరిత, ఎంపీపీఎస్, చాకుంట, చొప్పదండి

పనికిరాని వస్తువులతో..



పనికిరాని వస్తువులు లెవల్ పైపు, థమ్సప్ బాటిల్, ఆర్వో కనెక్టర్, బెలూన్, ఎమ్‌సీల్, ఇయర్ ఫోన్స్, ఫ్లూయిడ్ బాటిల్స్, ఐవీ సెట్స్, రెడ్, బ్లూ కలర్స్, ఫాస్ట్ గ్లూ తదితర వాటిని ఉపయోగించి స్టెతస్కోప్, బ్లడ్ సర్క్యులేషన్ సిస్టంలను తయారు చేశా. ఇలాంటి వాటి ద్వారా బ్లడ్ సర్క్యులేషన్ ఎలా అవుతుందో సులువుగా ప్రదర్శన ద్వారా చూపించా.

– కె.గంగయ్య, ఎంపీపీఎస్, సాయబ్‌పల్లి, తిమ్మాపూర్

క్లుప్తంగా

శ్రీధర్ ఎంపికపై హర్షం


శ్రీధర్

కరీంనగర్: రాజన్న సిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న గోల్కొండ శ్రీధర్ ఇటీవల రంగారెడ్డి జిల్లాలో జరిగిన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీల్లో అన్ని ఖాళీలు చూపిస్తూ, 317 జీవో ద్వారా బదిలీ అయినవారికి కూడా అవకాశం కల్పించాలన్నారు. అలాగే 13జిల్లాల స్పౌజ్ బదిలీలు అందరికీ చేయాలని, పదోన్నతుల, బదిలీల ప్రక్రియలో పారదర్శకత పాటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముల్కల కుమార్, జావీద్, ఉపాధ్యక్షుడు చుక్కయ్య, ఉపాధ్యక్షురాలు ఎగదండి బబిత, కోశాధికారి రాజమౌళి, జిల్లా కార్యదర్శులు ఫహద్ బిన్ అలీ, మీర్ అసిఫ్ అలీ, లక్ష్మారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

24న అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 24న టాస్క్, నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి, టాస్క్ రీజినల్ కో ఆర్డినేటర్ గంగాప్రసాద్, నాంది ఫౌండేషన్ సంచాలకులు స్వాతి ప్రకటనలో తెలిపారు. సుమారు 15 బహుళ జాతి కంపెనీలు పాల్గొంటున్న జాబ్ మేళాను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2019 నుంచి 2022 విద్యా సంవత్సరం వరకు డిగ్రీ ఉత్తీర్ణులైన, 2023లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఆయా కళాశాలలోని ప్రిన్సిపాల్స్, టాస్క్ కో ఆర్డినేటర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏసీడీ పేరిట అదనపు చార్జీలు తొలగించాలి

కరీంనగర్: ఏసీడీ పేరిట అదనపు విద్యుత్ చార్జీలను ప్రభుత్వం తొలగించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్త రకం బిల్లుతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా వచ్చే సాధారణ బిల్లుతో పాటు ఇది రావడంతో మొదట్లో అర్థంకాక వదిలేశారని, తప్పక కట్టాల్సిందేనని తెలియడంతో ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గతేడాది విద్యుత్ చార్జీలు పెంచిన ప్రభుత్వం మళ్లీ ఇదోరకంగా బిల్లులు వేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. వెంటనే ఏసీడీ బిల్లులు తొలగించాలని లేకుంటే ప్రభుత్వంపై మరో విద్యుత్ పోరాటం చెయ్యక తప్పదని హెచ్చరించారు.

రేపు శ్రీభాష్యం విజయసారథి సంస్మరణ సభ

కరీంనగర్‌కల్చరల్: ఇటీవల మరణించిన ప్రముఖ సంస్కృత పండితుడు, పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి సంస్మరణ సభను సర్వవేదిక సంస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి బొమ్మకల్ యజ్ఞవరాహక్షేత్రంలో నిర్వహించనున్నట్లు శ్రీభాష్యం వరప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సాహితీవేత్తలు, కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు, ట్రస్టు సభ్యులు పాల్గొనాలని కోరారు. విజయసారథిపై పద్యం, గేయం, కవిత, వ్యాసాల్లో ఏదైనా వినిపించవచ్చని, వాటిని విజయసారథి స్మృతిలో ప్రచురించే ప్రత్యేక సంచికలో పొందుపరుస్తామని పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

- 23న అధ్యయనోత్సవాలు
- 30న శ్రీనివాసుని కల్యాణం
- ఫిబ్రవరి 2న శోభాయాత్ర


కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం


స్వామివారి మూలవిరాట్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23 నుంచి శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 'షష్ఠమ' బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. శ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి మంగళ శాసనములతో వేద పండితుడు గుదిమెళ్ల విజయ్‌కుమారాచార్యులు పర్యవేక్షణలో ఫిబ్రవరి 2న మార్క్‌ఫెడ్ గ్రౌండ్ నుంచి నిర్వహించే శోభాయాత్రతో ఉత్సవాలు ముగుస్తాయి. వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కార్యక్రమాలు ఇవే..

23న సోమవారం సాయంత్రం నుంచి అధ్యయనోత్సవాలు ప్రారంభమై 25న ముగుస్తాయి. 26న సహస్ర కళశాభిషేకం, సహస్ర దీపాలంకరణ, 27న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, సాయంత్రం శేష వాహన సేవ ఉంటుంది. 28న యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, సూర్యప్రభా వాహనసేవ, చంద్రప్రభ వాహనసేవ, 29న అన్నకూటోత్సవం, కల్పవృక్ష వాహనసేవ, సాయంత్రం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం నుంచి ఎదుర్కోళ్ల ఉత్సవం, 30న శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణం జరుగుతుంది. సాయంత్రం గరుడ వాహన సేవ ఉంటుంది. 31న హనుమత్ వాహనసేవ, సింహవాహన సేవ, ఫిబ్రవరి 1న మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, వసంతోత్సవం, పుష్పయాగం, ద్వాదశారాధన, ధ్వజారోహణ, ఏకాంతసేవ, 2 మార్క్‌ఫెడ్ గ్రౌండ్ నుంచి శోభాయత్ర తో ఉత్సవాలు ముగుస్తాయి.

వైభవంగా నిర్వహిస్తాం



వేంకటేశ్వరస్వామి షష్ఠమ బ్రహ్మోత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. లోక కల్యాణం, ప్రజా శ్రేయస్సు కోసం నిర్వహించే ఉత్సవాలను అందరూ కలిసి విజవంతం చేయాలి.

– గంగుల కమలాకర్, బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి

ఏర్పాట్లు చేస్తున్నం..



వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి. మంత్రి సూచనల మేరకు దేవాదాయ శాఖ తరుపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నం. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం.

– ఉడుతల వెంకన్న, ఆలయ ఈవో

ఉత్తమ బోధనతో మెరుగైన ఫలితాలు సాధించాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉపాధ్యాయులు ఉత్తమ బోధనతో మెరుగైన ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షణ కింద జిల్లా స్థాయి బోధనోపకరణాల ప్రదర్శన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బోధనతో మంచి ఫలితాలు తీసుకొస్తే పిల్లలు, తల్లిదండ్రులు అందరూ సంతోషిస్తారన్నారు. అభ్యసన ఫలితాల్లో రాష్ట్రంలో కరీంనగర్ ముందుండాలని సూచించారు. ప్రదర్శనలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి 134 ప్రదర్శనలు రాగా 10 రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. సెక్టోరల్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి, ఎంఈఓ మధుసూదనాచారి, జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్‌రెడ్డి, న్యాయనిర్ణేతలు కోట లక్ష్మారెడ్డి, గాజుల రవీందర్, కెఎస్ అనంతాచార్య, శ్రీనివాస్, హెచ్‌ఎం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు ఎంపికైన ఉపాధ్యాయుల జాబితాను డీఈవో విడుదల చేశారు. తెలుగులో.. జి.బలరాం (ఎంపీపీఎస్ కోరపల్లి), పి.వెంకట రమాదేవి (ఎంపీపీఎస్ తేనుగువాడ), ఇంగ్లిష్‌లో..కె.గిరిధర్ (ఎంపీపీఎస్, సిర్సపల్లి), జి.మాలతి (ఎంపీపీఎస్, సీతంపేట), గణితంలో..బి.రమేశ్ (ఎంపీయూపీఎస్, ఎలబోతారం), పి.మాధవిలత (ఎంపీపీఎస్ కాసీంపేట), ఈవీఎస్‌లో.. పి.సునీత (యూపీఎస్, శ్యాంపేట), కె.గంగయ్య (ఎంపీపీఎస్, సాయబ్‌పల్లి), ఉర్దూలో.. కూతేజా యాస్మీన్ (ఎంపీపీఎస్, మానకొండూర్), ఖాలీదా ఖానమ్ (ఎంపీపీఎస్, జమ్మికుంట) ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి.

మాది పనిచేసే ప్రభుత్వం: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి


మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పనిచేసే ప్రభుత్వం తమది అని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రంలో పర్యటించి ప్రజల బాధలను అవగతం చేసుకున్న సీఎం కేసీఆర్ ప్రజలకు కావలసిన అన్ని రకాల సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ప్రవేశపెడుతూ దేశానికి మోడల్ అయ్యారన్నారు. 20 ఏళ్ల టీఆర్‌ఎస్‌లో ఉండి అన్ని పదవులు అనుభవించి తన స్వార్థం కోసం పార్టీ మారిన ఈటల రాజేందర్‌కు ఈ విషయాలు తెలియవా అని ప్రశ్నించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొనడానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఈనెల 31న నియోజకవర్గంలో పర్యటించనున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్ , ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

వీణవంక: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 49మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. 15మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. తహసీల్దార్ రాజయ్య, ఎంపీపీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



సప్తగిరికాలనీ శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న కలెక్టర్, సీపీ

కరీంనగర్‌టౌన్: ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. శుక్రవారం కరీంనగర్ సప్తగిరికాలనీలోని కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ శిబిరంలో కంటి పరీక్షలు చేసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకొని.. దృష్టిలోపాలను దూరం చేసుకోవాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన పది వేల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి పదోన్నతుల ద్వారా ఇవ్వాలని శుక్రవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం(ఎస్‌జీటీయూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏడేళ్లుగా బదిలీలు, పదోన్నతులు నిర్వహించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి గందరగోళంగా ఉందని, ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేయనున్న బదిలీల, పదోన్నతుల షెడ్యూల్‌లో గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేలా చొరవ చూపాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీటీయూ నాయకులు పాల్గొన్నారు.

రెండోరోజు 12,580 మందికి పరీక్షలు

కరీంనగర్‌టౌన్: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో రెండో రోజు కొనసాగింది. కంటి పరీక్షల శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మొదటి రోజు మందకొడిగా సాగినా రెండోరోజు పరీక్షల కోసం తాకిడి పెరిగింది. శుక్రవారం మొత్తం 12,580 మందికి స్క్రీనింగ్ చేశారు. రీడింగ్ లోపం ఉన్న 2,454 గుర్తించి రీడింగ్ గ్లాసెస్ ఇచ్చారు. 2,038 మందికి ప్రిస్కిబ్ కళ్ల జోళ్లకు రెఫర్ చేశారు. వీరికి వారం రోజుల లోపు ఆశల ద్వారా కళ్లజోళ్లు ఇంటికి పంపించనున్నారు. మిగతావారికి ఎలాంటి దృష్టి లోపాలు లేవని పరీక్షల్లో తేలింది.

వకీల్‌పల్లి గనిలో డ్యాంలను పరిశీలించిన జీఎం



గోదావరిఖని(రామగుండం): వకీల్‌పల్లి గనిలో నిర్మించిన డ్యాంలను ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ శుక్రవారం పరిశీలించారు. గనిలోని పనిస్థలాల వద్దకు చేరుకుని నీటిని నిలువరించే డ్యాంలను పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. కంటిన్యూస్ మైనర్‌లో సాధిస్తున్న బొగ్గు ఉత్పత్తి, రక్షణ తదితర వివరాలను ప్లాన్ ద్వారా తెలుసుకున్నారు. గనిలో కొన్ని రోజుల క్రితం ప్రారంభమైన సీటూఎం ప్లాంట్, కంటిన్యూస్‌మైనర్ సెక్షన్ పని స్థలాలను తనిఖీ చేశారు. ప్రమాదాలు జరగకుండా రక్షణతో కూడిన నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. జీఎం వెంట ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ రవికుమార్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



సుల్తానాబాద్(పెద్దపల్లి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం మండలంలోని నీరుకుల్ల, గట్టెపల్లి గ్రామాల మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు 8 ట్రాక్టర్లను పట్టుకొని రెవెన్యూ కార్యాలయానికి తీసుకువచ్చారని తహసీల్దార్ యాకన్న తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడిచే ట్రాక్టర్లపై జరిమానా విధిస్తామని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి



కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం గ్రామం వద్ద మంథని– పెద్దపల్లి ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని తూర్పాటి సమ్మయ్య (70) మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. సమ్మయ్య తన కూమార్తె లావాణ్యను పెద్దపల్లి నుంచి గుండారం తీసుకొస్తున్న క్రమంలో వెనుకనుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో సమ్మయ్య, లావణ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్‌లో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమ్మయ్య పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాద స్థలాన్ని ఎస్సై షేక్ మస్తాన్ పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్టు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్టు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
95055 14424, 99124 40790
గమనిక : అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని బీజేవైఎం ఆందోళన


ఆందోళన చేస్తున్న బీజేవైఎం నాయకులు

కరీంనగర్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బీజేవైఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని తెలంగాణ చౌక్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి, కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో విద్యార్థులకు బీజేవైఎం అండగా నిలిచి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మర్రి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాయత్రి, జుపెల్లి ధీరజ్, అనిల్, అశోక్, రమేష్, నికేష్, అజయ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ విద్యుత్ బిల్లులపై బీజేపీ నిరసన


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్: ఇటీవల ట్రాన్స్‌కో ప్రజలపై వేసిన ఏసీడీ బిల్లులను వెంటనే రద్దు చేయాలని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గృహ వినియోగదారుల నుంచి ముందస్తు వినియోగ డిపాజిట్ బిల్లుల పేరిట ప్రభుత్వం బలవంతంగా బిల్లులు వసూలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం సామాన్య, మధ్య తరగతి ప్రజల రక్తం తాగుతుందని, పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చారాన ఖర్చు చేసి అక్రమంగా బారాన దండుకుంటుందని విమర్శించారు. విద్యుత్ వినియోగదారుల విషయంలో వ్యవహరిస్తున్న తీరే ఇందుకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజల గురించి ఆలోచన చేసే మనసుంటే తక్షణం ఏసీడీ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, మండల అధ్యక్షుడు రాముల కుమార్, ఎర్రబెల్లి సంపత్‌రావు, నరసింహరాజు, మాడుగుల ప్రవీణ్, జెల్ల సుధాకర్, మాడ గౌతంరెడ్డి, కేసిరెడ్డి విజేందర్‌రెడ్డి, నల్ల సుమన్, రావుల వేణు, ఒడ్నాల విజయ్ పాల్గొన్నారు. కాగా పోలీసులు బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి


ఆందోళన చేస్తున్న బంధువులు


కిషన్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): మండలంలోని మానేరువాగు ఇసుక క్వారీ నుంచి హైదరాబాద్‌కు ఇసుక తరలించేందుకు వచ్చిన లారీ డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్ మండలం, నేరెళ్లపల్లి గ్రామ పరిధి జాలుగడ్డ తండాకు చెందిన లారీ డ్రైవర్ కేతవాత కిషన్ (59) బుధవారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరి ఇసుక క్వారీకి గురువారం చేరుకున్నాడు. కిషన్ కూతురు ఫోన్ చేయగా సెల్‌ఫోన్ లారీలో ఉండిపోయింది. ఈక్రమంలో ఇసుక క్వారీ సూపర్‌వైజర్ కిషన్ ఫోన్ ద్వారా అతడి కుటుంబ సభ్యులతో మాట్లాడాడు. కనబడటం లేదని తెలిపాడు. కాగా కిషన్ సమీపంలోని బావిలో పడి మృతిచెందినట్లు ఇసుక క్వారీకి వచ్చిన పలువురు లారీ డ్రైవర్లు గుర్తించి, మృతుడి కుమారునికి సమాచారం అందించగా శుక్రవారం వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కిషన్ మృతిపై అనుమానం ఉందని రోడ్డుపై బంధువులు, స్థానికులతో బైఠాయించి ఆందోళన చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడి ఫిర్యాదు చేయాలని సూచించారు. క్వారీ యజమానిపై అనుమానం ఉందని మృతుడి చిన్న కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమ్మికుంట టౌన్ సీఐ రామచందర్‌రావు తెలిపారు. కిషన్‌కు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

క్లుప్తంగా

సుందరేశ్వరస్వామికి ఫలపంచామృతాభిషేకం



విద్యానగర్(కరీంనగర్): మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని దుర్గాభవానీ ఆలయంలో కొలువైన సుందరేశ్వర స్వామి వారలకు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి పూజ కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణశర్మ వైభవంగా నిర్వహించారు. పూజల్లో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయ హుండీల లెక్కింపు



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మార్కెట్ రోడ్డు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను శుక్రవారం లెక్కించినట్లు ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. రూ.4,60,458 ఆదాయం సమకూరిందన్నారు. లెక్కింపులో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, వ్యవస్థాపక వంశీయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, సిబ్బంది, అర్చకులు, గోవిందపతి శ్రీవారి సేవా సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన



కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని రెనె ఆసుపత్రిలో ఫైర్ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందికి అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్, ఎల్పీజీ గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ అధికారి పరమేశ్వర్‌తో పాటు ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో హనుమాన్ ఆలయ బ్రహ్మోత్సవాలు




కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని బొమ్మకల్‌రోడ్‌లో గల పంచముఖ హనుమాన్ ఆలయ 10వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బుస్స శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో పరబ్రహ్మానందగిరి స్వామి, కమిటీ సభ్యులు, అర్చకుల చేతుల మీదుగా కరపత్రం ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి మఠాధిపతులు హాజరవుతారని అన్నారు. 23న ఉదయం మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన, పతాకావిష్కరణ, 24న సామూహిక లక్ష నాగవల్లీ దళార్చన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి, రాజేందర్, విశ్వనాథం, హనుమాండ్లు, విద్యాసాగర్, భాస్కరాచారి, తిరుమలాచారి, వివేకానందచారి తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం గంజ్ ప్రాంతంలో..




బోయివాడలో..



ముకరంపురలో..



వెంకటసాయి థియేటర్ ప్రాంతంలో..



సర్కస్‌గ్రౌండ్ వెనుక ప్రాంతంలో..

మన నగరానికి భద్రత ఎంత..?

సికింద్రాబాద్‌లో గురువారం ఓ భవనంలో జరిగిన అగ్నిప్రమాదంతో కరీంనగర్‌లో భద్రతపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. బహుళ అంతస్తుల భవనాలను సైతం 10 ఫీట్ల రోడ్డు కూడా లేని గల్లీల్లో నిర్మించడంతో సికింద్రాబాద్ లాంటి అగ్నిప్రమాదాలు జరిగితే ఫైర్ ఇంజను కూడా వెళ్లలేని స్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితిలో అక్కడ నివసించే ప్రజల పరిస్థితేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా బహుళ అంతస్తుల భవనాలను 30 ఫీట్ల రోడ్డు సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే అనుమతులు ఇవ్వాలనే డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఉపాధి.. ఖరారు

- 1.55లక్షల పనిదినాలు
- రూ.6. 63 కోట్ల బడ్జెట్
- వచ్చే ఏడాది కోసం 155 పనుల గుర్తింపు



జుబ్లీనగర్ గ్రామసభలో పాల్గొన్న కూలీలు(ఫైల్)

కరీంనగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలు నిరోధించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించి వచ్చే 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను అధికారులు రూపొందించారు. ఆయా గ్రామాల్లో గతేడాది అక్టోబరు 2నుంచి నవంబరు 15 వరకు గ్రామసభలు నిర్వహించి పనులు గుర్తించారు. కూలీల నుంచి వచ్చిన డిమాండ్ ఆధారంగా పనుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేశారు.

రూ.6.63 కోట్ల బడ్జెట్‌కు ప్రతిపాదన

కరీంనగర్ మండలంలోని ఉపాధిహామీ కూలీలకు 1.55 లక్షల పనిదినాలను ఖరారు చేశారు. ప్రస్తుతం పనిచేసే కూలీలు 5,967 మంది ఉన్నారు. వీళ్లందరికీ 100రోజులు పనికల్పించాలనే లక్ష్యంతో ఈ పని దినాలను నిర్ణయించారు. ఆక్టోబర్, నవంబరు నెలల్లో నిర్వహించిన గ్రామసభల్లో గుర్తించిన 155 పనులను పూర్తి చేసేందుకు రూ.6కోట్ల 63లక్షల బడ్జెట్ అవసరమవుతుందని అంచనా వేశారు. దీనిలో లేబర్ బడ్జెట్ రూ. 3 కోట్ల 98 లక్షలు కాగా మెటీరియల్ కాంపోనెట్ రూ. 2 కోట్ల 25 లక్షలుగా నిర్ణయించారు. కేంద్రానికి ఆమోదం కోసం బడ్జెట్ ప్రతిపాదనను అధికారులు పంపించారు.

వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత

- గతంలో మట్టి పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత ఇవ్వడంతో చెరువుల్లో పూడికతీయడం, కాంటూరు కందకాల తవ్వకం తదితర పనులతో గ్రామాలకు ఎలాంటి ప్రయోజనం కలుగలేదు.
- మెటీరియల్ కాంపొనిట్ కింద చేపట్టే పనులు శాశ్వత ప్రయోజనం కలగాలనే ఉద్దేశ్యంతో ఈ ఏడాది వ్యవసాయ అనుబంధ రంగాలకు అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రాధాన్యతనిచ్చారు.
- ప్రధానంగా ఎస్సారెస్పీ కాలువల్లో పూడిక, కాలువల తవ్వకం, పొలాలకు వెళ్లేందుకు కొత్తగా మట్టిరోడ్ల నిర్మాణం, సరిహద్దు కందకాల తవ్వకం, భూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిచ్చారు.
- పలు గ్రామాల్లో కూలీలు, రైతులు కూడా ఈ పనులను చేపట్టాలని పట్టుపట్టారు.
- హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం, గుంతల తవ్వకం, కంచెల నిర్మాణం, మొక్కలకు నీళ్లు పోయడం తదితర పనులను నిరంతరం కొనసాగిస్తారు.

మండలంలో ఉపాధిహామీ పథకం వివరాలు

ఉపాధిజాబ్‌కార్డులు	6,816
పనిచేసే కూలీలు	5,967
గ్రామపంచాయతీలు	17
పూర్తయిన గ్రామసభలు	17

ప్రతిపాదనలు పంపించాం

వచ్చే ఏడాదికి సంబంధించిన ఉపాధిహామీ పనిదినాల ప్రతిపాదనను కేంద్రానికి నివేదించాం. కేటాయించిన బడ్జెట్ ప్రకారం పనులు జరుగుతాయి. శాశ్వత ప్రయోజనం కలిగే పనులను గ్రామసభల్లో గుర్తించి ప్రతిపాదించాం. మూడేళ్ల నుంచి కూలీలు చేస్తున్న పనిదినాల ఆధారంగా కొత్తగా 1.55 లక్షల పనిదినాలకు ప్రతిపాదన రూపొందించాం.

– శోభారాణి, ఏపీవో, ఉపాధిహామీ పథకం

కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాలు

- నగరంలోని 6 పీహెచ్‌సీల పరిధిలో ఏర్పాటు
- తొలి దశ 13 డివిజన్లలో క్యాంపులు



కరీంనగర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు శిబిరాలు కరీంనగర్‌లోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని 13 డివిజన్‌లలో ఈనెల 19న ప్రారంభమయ్యాయి. ఆయా డివిజన్లలో జనాభా ఆధారంగా ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు ఈ శిబిరాలు కొనసాగనున్నాయి. అనంతరం మిగతా డివిజన్లలో కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. డివిజన్లలో కేటాయించిన తేదీల్లో ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

యూపీహెచ్‌సీ	క్యాంపు	డివిజన్	తేదీ వరకు
బీఆర్ఆర్ కాలనీ	యూపీహెచ్‌సీ	22	ఫిబ్రవరి 8 వరకు
బీఆర్ఆర్ కాలనీ	అంబేద్కర్ కమ్యూనిటీహాల్	42	ఫిబ్రవరి 6 వరకు
హెచ్‌బీ కాలనీ	హౌసింగ్‌బోర్డుకాలనీ లైబ్రరీ	07	ఫిబ్రవరి 10 వరకు
హెచ్‌బీ కాలనీ	రిషి కాన్వెంట్	47	ఫిబ్రవరి 9 వరకు
కట్టరాంపూర్	చైతన్యయూత్‌క్లబ్	33	ఫిబ్రవరి 10 వరకు
కట్టరాంపూర్	అంబేడ్కర్‌స్టేడియం	51	ఫిబ్రవరి 9 వరకు
కట్టరాంపూర్	గౌతమినగర్ కమ్యూనిటీహాల్	11	ఫిబ్రవరి 10 వరకు
మోతాజ్‌ఖానా	రేడియంట్‌స్కూల్, హుస్సేన్‌పుర	27	ఫిబ్రవరి 10 వరకు
మోతాజ్‌ఖానా	యూపీహెచ్‌సీ, హుస్సేన్‌పుర	05	ఫిబ్రవరి 9 వరకు
సప్తగిరికాలనీ	మహిళాభవన్, రాంనగర్	37	ఫిబ్రవరి 8 వరకు
సప్తగిరికాలనీ	సప్తగిరి ప్రభుత్వ పాఠశాల	35	ఫిబ్రవరి 9 వరకు
విద్యానగర్	జ్యోతినగర్ ఈ–సేవా కేంద్రం	57	ఫిబ్రవరి 7 వరకు
విద్యానగర్	పాలిటెక్నిక్ కాలేజీ, విద్యానగర్	17	ఫిబ్రవరి 9 వరకు

జిల్లా కోర్టు న్యాయవాదుల ఆటల పోటీలు



చెస్ ఆడుతున్న న్యాయమూర్తి శ్రీవాణి

కరీంనగర్‌క్రైం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో న్యాయవాదులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. న్యాయవాది స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శి వడ్లూరి కృష్ణ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న క్రికెట్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, షటిల్, వాలీబాల్, ప్లేయింగ్ కార్డ్స్,చెస్, పాటలు, కవితల పోటీల్లో న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి తెలిపారు. శుక్రవారం వి.రఘురామన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలను ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శ్రీవాణి హాజరై ప్రారంభించి మహిళా న్యాయవాదులతో పోటీపడ్డారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజు జిల్లా జడ్జి బి.ప్రతిమ చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు తెలిపారు.

ఆత్మవిశ్వాసానికి జూడో క్రీడ దోహదం



జూడో క్రీడాకారులతో సాయ్ కబడ్డీ కోచ్ శ్రీనివాస్‌రావు

కరీంనగర్‌స్పోర్ట్స్: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా సెంటర్‌లతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కబడ్డీ కోచ్ కె శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఖేలో ఇండియా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ జూడో అకాడమిని పరిశీలించి మాట్లాడారు. ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి జూడో క్రీడ దోహదపడుతుందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూడో సెంటర్ ఏర్పాటైందని ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన స్కిల్స్, టెక్నిక్స్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా శాఖా అధికారి కీర్తి రాజవీరు, జూడో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ప్రాంతీయ క్రీడా పాఠశాల హెడ్‌మాస్టర్ లీలాప్రసాద్, జూడో కోచ్ సందమల్ల ప్రియాంక, ఎలగందుల శ్రీనివాస్, క్రీడా పాఠశాల కోచ్‌లు దేశెట్టి పవన్, సాయిరాం యాదవ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వరిపంట పరిశీలన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో, శాస్త్రవేత్త

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్ల, చెర్లభూత్కూర్, దుబ్బపల్లి గ్రామాల్లో వివిధ తెగుళ్ల ఆశించిన వరిపంటను శుక్రవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సల్ఫైడ్‌గాయం, మొగిపురుగు, జింక్‌లోపమున్న పొలాలను పరిశీలించి నియంత్రణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. సల్ఫైడ్ గాయానికి పొలాన్ని ఆరబెట్టిన అనంతరం సూక్ష్మపోషకాలను అందించాలని, మొగిపురుగు నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2జీ లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి బి.సత్యం, ఏఈవో స్వర్ణలతలున్నారు.

నేతాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న గవ్వ వంశీధర్‌రెడ్డి

కరీంనగర్: స్వాతంత్ర్య సమరయోధుడు, నిష్కలంక దేశభక్తుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదినాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఏబీఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేతాజీ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమని అన్నారు. జనవరి 23ను దేశ్ ప్రేమి దివస్‌గా ప్రకటించి సెలవు దినంగా ప్రకటించాలని తెలిపారు. అనేక మంది జాతీయ నేతల జయంతులు, వర్ధంతిలు అధికారికంగా నిర్వహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేతాజీ జయంతిని నిర్వహించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈనెల 23న సుభాష్ చంద్రబోస్ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఏబీఎస్‌బీ నాయకులు ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ఏబీఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి మొలుగు హరికృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల హరీశ్‌రెడ్డి ,నాయకులు కలికోట అభిలాష్, శంకర్ కురువెల్లి, రాజేశ్, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



వరిని పరిశీలిస్తున్న నాగప్రసాద్, రైతులు

కొత్తపల్లి: వరి పంట దెబ్బతిన్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిపురం నాగప్రసాద్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామంలోని వరి పొలాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాండం తొలిచే పురుగుతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులతో రైతుల జాబితా తయారు చేసి రైతులకు అండగా ఉండాలన్నారు. దెబ్బతిన్న పంట పొలాలకు రైతులకు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బోనాల లక్ష్మయ్య, బోనాల సంపత్, పెంట సురేశ్, బోనాల కిరణ్, ఆకుల సతీశ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



కరీంనగర్‌కల్చరల్: బిల్డింగ్ పెయింటింగ్ సంఘం కరీంనగర్ ఉమ్మడి జిల్లా చైర్మన్ దాదా ఆనంద్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈశ్రామ్‌కార్డు, లేబర్ కార్డులు పంపిణీ చేశారు. కార్మికుల కుటుంబసభ్యులకు కంటి పరీక్షలు, వైద్య శిబిరం నిర్వహించి మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అంబాల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బషీరుద్దీన్, జేఏసీ కన్వీనర్ ప్రవీణ్, జేఏసీ కన్వీనర్ సలీం బాయ్ తదితురులు పాల్గొన్నారు.

'నిజాంను కీర్తించడం అవమానించడమే'

విద్యానగర్(కరీంనగర్): సీఎం కేసీఆర్ నిజాం పాలనను కీర్తించడం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర సంపద కొల్లగొట్టి రాష్ట్రాన్ని సర్వనాశం చేసిన మతోన్మాదుల చివరి నిజాం ముకురంజ చనిపోతే అధికారికంగా నిర్వహించడం సిగ్గుచేటన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు సంతోశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనిల్‌కుమార్, రవీందర్, సుమన్, మాతాంగి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్‌కు అభినందన



శాతవాహనయూనివర్సిటీ: కర్ణాటకలోని హుబ్లీ–ధర్వాడలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు జరిగిన జాతీయ యువ ఉత్సవాల్లో కరీంనగర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ సాయిలిఖిత ప్రతిభ కనబర్చింది. సాయి లిఖితను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ అధికారులు లావణ్య, శకుంతల, సుజాత, అరుణలు అభినందించారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: సబ్‌స్టేషన్‌లలో నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా కరీంనగర్‌లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 33/11 కేవీ బ్యాంక్ కాలనీ, వావిలాలపల్లి, అంబేడ్కర్‌నగర్, టవర్ సర్కిల్, వాటర్ వర్క్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. అదేవిధంగా కేబుల్‌బ్రిడ్జి పనులు కొనసాగుతున్నందున ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 33/11 కేవీ భగత్‌నగర్, ఉజ్వలపార్కు, పద్మనగర్, సప్తగిరికాలనీ, ఎస్ఆర్ఆర్ కళాశాల, వాటర్ గ్రిడ్, అలుగునూర్ సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

కొత్తపల్లి, రూరల్ పరిధిలో..

విద్యుత్ సబ్‌స్టేషన్లలో నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కేవీ కొత్తపల్లి, రేకుర్తి, బొమ్మకల్, నగునూర్, శాతవాహన యూనివర్సిటీ, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్, బద్దిపల్లి, బావుపేట, ఆసిఫ్‌నగర్, ఖాజీపూర్ సబ్ స్టేషన్ల పరిధిలోని ఆరెపల్లి, కొత్తపల్లి, దేశ్‌రాజ్‌పల్లి, వెదిర, వెలిచాల, రేకుర్తి, సీతారాంపూర్, మల్కాపూర్, చింతకుంట, కమాన్‌పూర్, బొమ్మకల్, లక్ష్మీనగర్, రజ్వీచమన్, సిటిజన్ కాలనీ, సిరిపురం కాలనీ, ఎలక్ట్రిసిటీ కాలనీ, ప్రియదర్శినికాలనీ, క్రిష్ణనగర్, మధురానగర్, ఆటోనగర్, దుర్శేడ్, గోపాల్‌పూర్, చెలిమెడ ఆసుపత్రి, నగునూర్, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, శ్రీరాంనగర్‌కాలనీ, ఇరుకుల్ల, చెర్లభూత్కూర్, తాహెర్‌కొండాపూర్, బహదూర్‌ఖాన్‌పేట, దుబ్బపల్లి, చామన్‌పల్లి, బద్దిపల్లి, నాగులమల్యాల, బావుపేట, ఆసిఫ్‌నగర్, ఎలగందుల, కమాన్‌పూర్, ఖాజీపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు తెలిపారు.

ఆల్ ఇండియా హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



శివశంకర్‌ను అభినందిస్తున్న గోవిందవరంకృష్ణ

కరీంనగర్‌స్పోర్ట్స్: ఆల్ ఇండియా యూనివర్సిటీ స్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి చిటాల శివశంకర్ ఎంపికయ్యాడు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన శాతవాహన యూనివర్సిటీస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించి ఆల్ ఇండియా పోటీలకు ఎంపికైనట్లు కళాశాల పీడీ శ్రీనివాస్ తెలిపారు. శివశంకర్‌ను శుక్రవారం కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణతో పాటు ప్రిన్సిపాల్ పూరెల్ల రాజశేఖర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ మునీందర్‌గౌడ్, పీజీ ఇన్‌చార్జి పి.రమేశ్, అధ్యాపకులు అభినందించారు. కళాశాలలో అత్యున్నతస్థాయి విద్యతో పాటు వివిధ క్రీడల్లో కూడా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

'ప్రభుత్వ ఫలాలు అందించాలి'

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్, కమాన్‌పూర్ గ్రామ పరిసరాల్లో 50 ఏళ్లుగా బండలు కొడుతూ స్థిర నివాసం ఏర్పర్చుకున్న సుమారు 300 తమిళ కుటుంబాలకు ప్రభుత్వ ఫలాలు అందించాలని కోరుతూ జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు వేముల అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా బండలు కొట్టుటకు మద్రాసు నుంచి కూలీలను తీసుకొచ్చారని తెలిపారు. ఆనాటి నుంచి నేటి వరకు ఇక్కడే ఉండి జీవనోపాధి పొందుతున్న కొన్ని కుటుంబాలకు ప్రభుత్వం స్థిర నివాసం కల్పించిందన్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణలక్ష్మీ, ఆసరా పెన్షన్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అనేకమార్లు ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించినట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శరత్‌చంద్రారెడ్డి బెయిలు పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో శరత్‌చంద్రారెడ్డి బెయిలు పిటిషన్‌పై విచారణ రౌజ్ అవెన్యూ కోర్టు వాయిదా వేసింది. విచారణ ఈ నెల 25కు వాయిదా వేస్తున్నామని నిందితులందరి బెయిలు పిటిషన్లపై ఆ రోజు నిర్ణయిస్తామని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ తెలిపారు. శరత్‌చంద్రారెడ్డి బెయిలు పిటిషన్‌పై రౌజ్ అవెన్యూ కోర్టులో శుక్రవారం వాదనలు జరిగాయి. ఈడీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ సౌత్‌గ్రూప్‌పైనే ప్రధాన ఆరోపణలు చేశారు. రూ.100 కోట్లకు సంబంధించిన ఆధారాలు సేకరించామన్నారు. బెయిలు మంజూరు చేయొద్దని కోరారు. శరత్‌చంద్రారెడ్డి తరపు సీనియర్ న్యాయవాది సిబల్ వాదనలు వినిపిస్తూ... సౌత్‌గ్రూప్ పేరుతో కొందరిని ఎంపిక చేసి అరెస్టు చేయడం తగదన్నారు. ఆధారాలు ఏమీ లేకుండా ఈడీ విచారణ సాగిస్తోందన్నారు.

'డెక్కన్'లో టెన్షన్

శుక్రవారం సాయంత్రానికీ లభించని ఆ ముగ్గురి ఆచూకీ

- భవనం బయట ఆర్తిగా ఎదురుచూస్తున్న కుటుంబీకులు
- మంటలు, పొగ తగ్గినప్పటికీ భరించలేని స్థాయిలో వేడి
- లోపలికి ప్రవేశించ లేకపోతున్న అగ్నిమాపక బృందాలు
- డ్రోన్ల సహాయంతో కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్
- భవనం కూల్చివేతకు సిద్ధమవుతున్న జీహెచ్‌ఎంసీ
- పరిశీలించి వెళ్లిన వరంగల్ నిట్‌కు చెందిన కమిటీ



భవనాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం


వసీం


జునైద్


జహీర్

సాక్షి, సిటీబ్యూరో/రామ్‌గోపాల్‌పేట: సికింద్రాబాద్ మినిస్టర్స్ రోడ్‌లోని రాధా ఆర్కేడ్‌లో ఉన్న డెక్కన్ కార్పొరేట్ అగ్నిప్రమాదంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ దుర్ఘటనలో గల్లంతైన ముగ్గురి ఆచూకీ శుక్రవారం కూడా లభించలేదు. భవనంలోకి అడుగుపెట్టడానికి పరిస్థితులు అనుకూలించకపోవడంతో విక్టిమ్ లోకేషన్ కెమెరాతో (వీఎల్‌సీ) కూడిన డ్రోన్ల సాయంతో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. రాధా ఆర్కేడ్‌లో గల్లంతైన డెక్కన్ కార్పొరేట్ ఉద్యోగులు జునైద్, వశీం, జహీర్ కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాలని పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు శుక్రవారం ఉదయం ఉపక్రమించారు. వీరి సెల్‌ఫోన్ల లాస్ట్ లోకేషన్స్ గురువారం ఉదయం భవనం వద్దే ఉండగా...ఆ తర్వాత స్విచ్ఛాఫ్ అయ్యాయి. మరోపక్క ప్రమాదానికి కారణాలు విశ్లేషించడానికి క్లూస్‌టీమ్‌ను లోపలకు పంపాలని భావించారు. అయితే మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ దట్టమైన పొగ, భరించలేని వేడి ప్రతికూలంగా మారాయి. వీటి కారణంగా నేరుగా, లేడర్ ద్వారా ప్రయత్నించినా బృందాలు భవనంలోకి అడుగుపెట్టే పరిస్థితి కనిపించలేదు.

డ్రోన్ల సాయంతో...

లోపలికి వెళ్లలేక వెనక్కు వచ్చిన టీమ్స్ డ్రోన్ కెమెరాల సాయం తీసుకోవాలని స్పష్టం చేశాయి. దీంతో అధికారులు ఓ ప్రైవేట్ సంస్థను సంప్రదించి వీఎల్‌సీతో కూడిన డ్రోన్లను రప్పించారు. వేడి కారణంగా ఈ డ్రోన్లు సైతం లోపలకు వెళ్లడం సాధ్యం కాకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించారు. భవనం ముందు భాగంతో పాటు నాలుగు వైపుల నుంచి డ్రోన్ ఎగురవేసి అనువైన, ఖాళీగా ఉన్న భాగాల నుంచి లోపలి ప్రాంతాన్ని పరిశీలించారు.

స్పష్టత లేదు...

ఈ నేపథ్యంలోనే రెండో అంతస్తులో భవనం వెనుక వైపు రెండు చోట్ల మృతదేహాలు ఉన్నట్లు ఆనవాళ్లను శుక్రవారం సాయంత్రం గుర్తించారు. అయితే ఇవి స్పష్టంగా కనిపించకపోవడంతో ఔనా? కాదా? అనేది స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. దీంతో డ్రోన్ కెమెరా చిత్రీకరించిన వీడియోను ఇంప్రొవైజేషన్ విధానంలో విశ్లేషించడానికి ల్యాబ్‌కు పంపించారు. మొదటి అంతస్తులో కొంత వరకు లోపలికి వెళ్లిన డ్రోన్ అక్కడ మెట్ల మార్గం, శ్లాబ్ కూలి ఉన్నట్లు గుర్తించింది. భవనం మొత్తం శిథిలాలు, కాలిపోయిన వస్తువులు ఉండటంతో పాటు బూడిద సుమారు రెండు అడుగుల మేర పేరుకుపోయినట్లు గుర్తించారు. పది గంటలకు పైగా మంటల్లో ఉన్న ఈ ఆరంతస్తుల భవనం స్ట్రక్చరల్ స్టెబిలిటీని నిర్ధారించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ణయించారు. దీంతో వరంగల్ నిట్ నిపుణుల బృందంతో కలిసి పరిశీలించారు. నిట్ డైరెక్టర్ రమణ రావు, జీహెచ్‌ఎంసీ అధికారులు క్రేన్ సహాయంతో భవనం పై అంతస్తుల వరకు వెళ్లి పరిశీలించి మంటల్లో కాలిపోయిన కొన్ని శిథిలాలను సేకరించారు. భవనం పూర్తిగా బలహీనంగా మారిందని దీన్ని పూర్తిగా విశ్లేషించిన తర్వాత మాత్రమే పూర్తి వివరాలు చెప్పగలుగుతామని రమణరావు అన్నారు.

బయటే బస్తీల జనం..

ఈ భవనాన్ని ఆనుకుని ఉన్న కాచిబోలిలో సుమారు 15 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బస్తీలో చాలా ఇళ్లకు శుక్రవారం కూడా తాళాలు కనిపించాయి. భవనం వెనుక ఉన్న ఉత్తమ్ టవర్స్‌లో కిమ్స్ ఆస్పత్రి నర్సింగ్ హాస్టల్ ఉంది. ఇక్కడ నుంచి నర్సులను ఖాళీ చేయించారు. ఈ భవనాన్ని కూల్చిన తర్వాతే చుట్టుపక్కల వారికి అనుమతిస్తామని అధికారులు స్పష్టం చేశారు. మరోపక్క ఈ భవనం కూల్చివేత పనులు ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారని తెలిసింది. శుక్రవారం సాయంత్రం దీన్ని పరిశీలించిన ఆ సంస్థ బృందం కూల్చివేత పూర్తి చేయడానికి మూడు–నాలుగు రోజులు పడుతుందని అభిప్రాయపడింది. గల్లంతైన వారు గుజరాత్ నుంచి వలసవచ్చిన వాళ్లు కావడంతో శుక్రవారం ఉదయానికి వారి కుటుంబీకులు నగరానికి చేరుకున్నారు. తమ వారి కోసం ఆర్తిగా ఎదురు చూస్తున్న వీరికి రెండు మృతదేహాలు కనిపించాయనే వార్త శరాఘాతమైంది. అవి ఎవరివో, కనిపించని మూడో వ్యక్తి ఎక్కడ ఉన్నాడో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వసీం సోదరుడు ఇమ్రాన్, జునైద్ సోదరుడు ఆసిఫ్ రోజంతా భవనం ముందే గడిపారు. చీకటి పడటంతో శుక్రవారం రాత్రి సెర్చ్ ఆపరేషన్ ఆపేసిన అధికారులు శనివారం మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించారు. అగ్నిప్రమాదం తీరు తెన్నులు, భవనం లోపలి పరిస్థితులను గమనించిన ఓ పోలీసు అధికారి 'ఆ ముగ్గురూ బతికే అవకాశాలు లేవు. ఇన్ని గంటల మంటలు, ఇంత వేడి, ఫైర్ ఇంజన్లు చల్లిన నీళ్లు..ఇవన్నీ పరిశీలిస్తుంటే వారి ఎముకలు దొరికే అవకాశమూ తక్కువే' అని వ్యాఖ్యానించారు.

పోరాటాలు లేకుండానే మా ఆశయం నెరవేర్చారు

- ఏపీ సీఎం జగన్‌కు సీపీఎం దిగ్గజ నేత, మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య ప్రశంసలు
- మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందనలు
- మీలాంటి మనసున్న సీఎం ఆనాడు ఉంటే తన తల్లి బతికుండేదని వెల్లడి



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీపీఎం కురువృద్ధుడు, కృష్ణా జిల్లా నిడుమోలు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌తో భేటీ అయ్యారు. పేదల శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన రామయ్య నిస్వార్థపరుడు, నిరాడంబరుడు, రైతు బాంధవుడు, భూపోరాట యోధుడుగా పేరు పొందారు. ఉద్యమాలే ఊపిరిగా బతికిన ఆయన ప్రస్తుతం వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన రామయ్య సీఎంను కలిశారు. సీఎం జగన్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఉద్యమాలు, పోరాటాలు లేకుండా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మిస్తున్న సీఎంను రామయ్య అభినందించారు. తమ ఆశయాన్ని నెరవేర్చారని ప్రశంసించారు. 2024లో మళ్లీ అధికారంలోకి రాగానే పేదలకు వ్యవసాయ భూములు పంపిణీ చేయాలని సీఎంను కోరారు.

వైఎస్సార్‌లాగే మీరు ప్రజల గుండెల్లో ఉంటారు

పేద, మధ్య తరగతి కుటుంబాల జీవితాలను మెరుగు పరిచేందుకు విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వటం చాలా గొప్ప విషయమని రామయ్య అన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం లాంటి సాహసోపేతమైన కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా వైఎస్ జగన్ నేడు మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. తాను జన్మించిన కొన్ని ఘడియలకే పోషకాహార లోపంతో తన తల్లి కన్నుమూసిందని తెలిపారు. 'మీ లాంటి మనసున్న మహారాజు ఆనాడు ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే, ప్రభుత్వమే పోషకాహారం అందజేసి ఉంటే తన తల్లి బతికి ఉండేది' అంటూ రామయ్య గద్గద స్వరంతో అన్నారు. పేదల గురించి ఇంతలా ఆలోచించటం చాలా గొప్ప విషయమని, ఇదే దృక్పథం కొనసాగించాలని సీఎం జగన్‌కు సూచించారు.

సీఎంను ప్రశంసించాలనే వచ్చా

సీఎంతో భేటీ అనంతరం రామయ్య మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్‌ను కలవటంలో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. ఎలాంటి కోర్కెలు, అవసరాల కోసం కలవలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ చేపట్టిన కార్యక్రమాలు చాలా బాగున్నాయని ప్రశంసించడానికే వచ్చానని తెలిపారు. ఊహ తెలిసినప్పటి నుంచి సీపీఎం ఆశయాలకు కట్టుబడి పని చేశానని, తుదిశ్వాస వరకు అలాగే ఉంటానని అన్నారు. పేదల కోసం ఎన్నో పోరాటాలు చేసి లాఠీ దెబ్బలు తిన్నానని, జైలు జీవితం కూడా అనుభవించానని చెప్పారు.

టీటీడీ ధార్మిక సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

తిరుపతి అలిపిరి: టీటీడీ ధార్మిక కార్యక్రమాల సలహాదారుగా ప్రముఖ ప్రవచనకర్త, పండితుడు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నియమిస్తూ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహక కమిటీ నిర్ణయం తీసుకుందని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో శుక్రవారం హెచ్‌డీపీపీ, ఎస్వీబీసీ కార్యనిర్వాహక కమిటీ సమావేశాలు జరిగాయి. అనంతరం టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి తీసుకున్న ముఖ్యమైన ఆయా సమావేశాల్లో నిర్ణయాలను ఛైర్మన్ సుబ్బారెడ్డి మీడియాకు వెల్లడించారు.

డైరెక్టర్ల ఎంపికకు సింగరేణి కసరత్తు

- ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న డైరెక్టర్
- సంస్థలో మూడు పోస్టులు ఖాళీ
- రెండు పోస్టులకు పదిమంది జీఎంలకు ఇంటర్వ్యూలు
- రెండేళ్లు పైబడి సర్వీస్ ఉన్నవారికే చాన్స్
- డైరెక్టర్(పా) పోస్టుకు ఐఏఎస్ అధికారిని ఎంపిక చేస్తారా?



హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయం

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో అత్యంత కీలకంగా ఉన్న రెండు డైరెక్టర్ పోస్టులు ఈనెలాఖరున ఖాళీ కానున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణిలో సీఅండ్‌ఎండీతో పాటు ఐదుగురు డైరెక్టర్లు సంస్థ నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం ఇద్దరు డైరెక్టర్లు నాలుగు డైరెక్టర్ల పోస్టులను నిర్వహిస్తున్నారు. డైరెక్టర్(పా)తో పాటు డైరెక్టర్ ఆపరేషన్స్ ఒక్కరే బాధ్యతలు కొనసాగిస్తుండగా, డైరెక్టర్ ఫైనాన్స్ బలరాంకు అదనంగా ప్రాజెక్టు అండ్ ప్లానింగ్(పీఅండ్‌పీ) బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం డైరెక్టర్లలో రెండు బాధ్యతలు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్నారు. దీంతో ఆయన నిర్వహిస్తున్న రెండు పోస్టులు ఒకేసారి ఖాళీ కానున్నాయి. ఈక్రమంలో డైరెక్టర్(పా)కు అదనంగా ఉన్న డైరెక్టర్ ఆపరేషన్, ఫైనాన్స్ డైరెక్టర్‌కు అదనంగా ఉన్న ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ల పోస్టుల భర్తీ కోసం యాజమాన్యం కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం సింగరేణిలో డైరెక్టర్(పా), డైరెక్టర్ ఆపరేషన్స్, డైరెక్టర్ ప్రాజెక్టు అండ్‌ప్లానింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో డైరెక్టర్(పా) పోస్టు కోసం గతంలో ఐఏఎస్ అధికారిని నియమించేవారు. ఆపరేషన్స్ డైరెక్టర్, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ పోస్టులను అంతర్గతంగా సంస్థ వ్యాప్తంగా ఉన్న సీనియర్ జీఎంలను ఎంపిక చేయడం జరుగుతోంది. రెండు పోస్టుల భర్తీకి సంస్థ వ్యాప్తంగా రెండేళ్లకు తక్కువ కాకుండా సర్వీస్ ఉండి సీనియర్లుగా ఉన్న పదిమంది జీఎంలను ఇంటర్వ్యూకు పిలవనున్నారు. దీనికి సంబంధించి యాజమాన్యం సీనియర్ జీఎంలకు త్వరలో కాల్ లెటర్లు పంపే అవకాశం ఉంది.

డైరెక్టర్(పా) పోస్టు ఈసారైనా భర్తీ చేసేనా..

సింగరేణిలో కీలకంగా మారిన డైరెక్టర్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ వింగ్(పా) పోస్టు గడిచిన దశాబ్దకాలంగా సంస్థలోని అధికారుల ద్వారానే కొనసాగిస్తూ వస్తున్నారు. వాస్తవానికి ఐఏఎస్ అధికారిని ఈపోస్టుకు ఎంపిక చేయాల్సి ఉండగా ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో అంతర్గతంగా ఉన్న డైరెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు. ఈసారి రెండు డైరెక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించనున్న క్రమంలో మూడో పోస్టు డైరెక్టర్(పా) కూడా ఐఏఎస్ అధికారిని నియమించాలని కార్మికులు కోరుతున్నారు. దీనిపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సీనియర్ జీఎంలకు అవకాశం

సింగరేణిలో రెండేళ్లకన్నా సర్వీస్ ఎక్కువగా ఉండి సంస్థలో సీనియర్లుగా ఉన్న 10 మంది జీఎంలను ఇంటర్వ్యూలకు పిలిచి ఎంపిక చేయనున్నారు. సమర్థత, సీనియార్టీ, సిన్సియార్టీ ప్రతిపాదికన ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సీనియర్ల ప్రతిపాదిక ప్రకారం కార్పొరేట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ జీఎం ఎస్‌డీఎం సుభానీ, మణుగూరు జీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, క్వాలిటీ జీఎం హబీబ్‌హుస్సేన్, సీఎంసీ జీఎం దుర్గం రాంచందర్, కార్పొరేట్ జీఎం ఎ.రవికుమార్, ఏపీఏ జీఎం ఎస్‌వీకే శ్రీనివాస్, కార్పొరేట్ పర్చేజ్ జీఎం ఎం.సుబ్బారావు, కార్పొరేట్ ఎస్టేట్ జీఎం డి.రవిప్రసాద్, ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, మందమర్రి జీఎం చింతల శ్రీనివాస్‌లను ఇంటర్వ్యూకు పిలవనున్నారు. ఒక్కో పోస్టుకు ఐదుగురు చొప్పున రెండు డైరెక్టర్ పోస్టులకు పదిమందిని పిలిచి వారిలో ఇద్దరిని ఎంపిక చేయనున్నారు.

కేంద్రంలో పాసిస్టు.. రాష్ట్రంలో దోపిడీ పాలన


పాదయాత్రలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, తదితరులు

గంగాధర(చొప్పదండి): కేంద్రంలో పాసిస్టు పాలన, రాష్ట్రంలో దోపిడీ పాలన కొనసాగుతుందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా 170వ రోజు గంగాధర మండలం ఒద్యారం, ఆచంపల్లి, గర్శకుర్తి, ఉప్పరమల్యాల, కురిక్యాల, మధురానగర్, గంగాధర, లక్ష్మీదేవిపల్లి, బూర్గుపల్లి, నర్సింహులపల్లి గ్రామాల్లో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం ప్రతీ ప్రభుత్వ సంస్థను తమ ఆధీనంలో ఉంచుకోవాలని చూస్తుందని, న్యాయమూర్తుల నియామకంలో రాద్ధాంతం చేస్తుందని, పత్రికా స్వేచ్ఛను హరిస్తుందని విమర్శించారు. తెలంగాణలో నిజాలు రాస్తున్న పత్రికలను కేసీఆర్ కొనుగోలు చేస్తున్నాడని, వినకుంటే అరెస్టులు చేసి జైలుకు పంపించి అణచివేసే ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశ్నించే గొంతును లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ కిసాన్ సర్కార్ పేరుతో మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడన్నారు. లిక్కర్ స్కాంలో కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడిన ఆప్, బీఆర్‌ఎస్ దోస్తీ చేస్తున్నాయని విమర్శించారు. అవినీతి, దోపిడీ పాలనకు ప్రతీక అయిన బీఆర్‌ఎస్ సభకు హాజరైన పినరయ్ విజయన్, కేజ్రీవాల్ తమ విశ్వసనీయతను కోల్పోయారన్నారు. ప్రజలు దోపిడీ పార్టీలకు స్వస్తి పలికి సంపదను సమానంగా పంచే బీఎస్పీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. బీఎస్పీకి వస్తున్న ఆదరణ చూసి బీఆర్‌ఎస్‌కు భయం పట్టుకుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్కని సంజయ్, శిరీష, స్వరూప, నల్లాల రాజేందర్, చిర్ర శంకర్, నల్లాల శ్రీనివాస్, మంద రవీందర్, తిరుపతి, స్వప్న, అనూష తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతుల నిరసన



గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామ శివారు మోత్కులపల్లిలో శుక్రవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. నాలుగురోజుల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని దీంతో పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉందని వాపోయారు. సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా కరెంట్ బిల్లులు చెల్లించిన రశీదులు తీసుకువచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌కు దరఖాస్తు చేసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని సొల్లు అజయ్‌వర్మ పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత కరెంటు అని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, విద్యుత్ అధికారులు, సిబ్బంది మాత్రం ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చావుల తిరుపతి, సొల్లు రాజవీరు, సిందే నర్సింహం, సిందే రాజిరెడ్డి, బుజ్జయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ములుగు అటవీ కాలేజీలో ఫారెస్ట్రీ పీహెచ్‌డీకి నోటిఫికేషన్

ములుగు (గజ్వేల్): సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల, పరిశోధన సంస్థ (ఎఫ్‌సీఆర్‌ఐ)లో 2022–23 విద్యాసంవత్సరం ఫారెస్ట్రీ కోర్సుల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ శుక్రవారం నోటిఫికేషన్ విడుదలైంది. ఆ వివరాలను ఎఫ్‌సీఆర్‌ఐ డీన్ ప్రియాంక వర్గీస్ వెల్లడించారు. ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు ఐకార్/యూజీసీ గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో ఫారెస్ట్రీ మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎఫ్‌సీఆర్‌ఐటీఎస్.ఇన్ వెబ్‌సైట్ లేదా హెల్ప్‌లైన్ ఫోన్‌నంబర్: 8074350866, 8919477851లో సంప్రదించాలని సూచించారు.

అండర్ టేకింగ్‌కు ఈనెల 31 వరకు గడువు

గర్భిణులు, బాలింతలకు పోలీసు తుదిరాత పరీక్షకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: యూనిఫామ్ సర్వీసెస్ ఉద్యోగాల కోసం పోటీపడుతున్న మహిళా అభ్యర్థుల్లో గర్భిణులు, ఇటీవలే ప్రసవించిన వారికి నేరుగా తుది రాత పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. అయితే అలాంటి అభ్యర్థులు తుదిరాత పరీక్షలో అర్హత సాధిస్తే.. తుది రాత పరీక్ష ఫలితాలు వెల్లడైన నెల రోజుల్లోపు దేహదారుఢ్య పరీక్షలను పూర్తి చేస్తామని రాతపూర్వకంగా అండర్ టేకింగ్ ఇవ్వాల్సి ఉంటుందని శ్రీనివాసరావు వెల్లడించారు. అండర్ టేకింగ్ ఇచ్చేందుకు తుది గడువు ఈనెల 31 వరకు ఉంటుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, ఇటీవలే డెలివరీ అయిన అభ్యర్థులకు ఒకసారి మినహాయింపుగా అవకాశం ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ అవకాశం కల్పించినట్లు ఆయన స్పష్టంచేశారు. ఇప్పటికే ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, పార్ట్–2 దరఖాస్తును పూర్తి చేసిన అభ్యర్థులకే ఈ మినహాయింపు వర్తిస్తుందని పేర్కొన్నారు. రాతపూర్వక అండర్ టేకింగ్‌ను టీఎస్‌ఎల్‌పీఆర్బీ వెబ్‌సైట్‌లో సూచించిన ఫార్మాట్‌లో పంపాలని, మెడికల్ సర్టిఫికెట్లను జత చేయాలని సూచించారు. వీటిని జనవరి 31లోపు లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయం ఇన్‌వార్డ్ సెక్షన్‌లో అందజేయాలని శ్రీనివాసరావు చెప్పారు. ఇప్పటికే వినతిపత్రాలు ఇచ్చిన అభ్యర్థులు కూడా మరోసారి అండర్‌టేకింగ్ ఇవ్వాలన్నారు. జనవరి 31లోపు రాతపూర్వకంగా అండర్‌టేకింగ్ ఇవ్వని అభ్యర్థులను తుది రాత పరీక్షకు అనుమతించబోరని స్పష్టంచేశారు.

బీఆర్‌ఎస్ సభతో ఆర్టీసీకి అ‘ధనం’!

ఖమ్మం మయూరి సెంటర్: ఖమ్మంలో ఈ నెల 18న జరిగిన బీఆర్‌ఎస్ సభ ద్వారా ఆర్టీసీకి గత కొన్నేళ్లలో ఎన్నడూలేని విధంగా రోజువారీ అదనపు ఆదాయం సమకూరింది. సాధారణంగా ఆర్టీసీ రోజువారీ ఆదాయ లక్ష్యం రూ. 15.69 కోట్లుకాగా 18న సంస్థ ఏకంగా రూ. 18.31 కోట్ల రాబడిని ఆర్జించింది. ఖమ్మం సభకు కార్యకర్తలను తరలించేందుకు బీఆర్‌ఎస్ నేతలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల పరిధిలో బస్సులను బుక్ చేసుకోవడం సంస్థకు అదనపు ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. రాష్ట్రంలో ఆర్టీసీకి మూడు జోన్లు ఉండగా కరీంనగర్ జోన్‌లో రోజువారీ ఆదాయ లక్ష్యమైన రూ.6.59 కోట్లకుగాను రూ. 7.76 కోట్లు, హైదరాబాద్ జోన్ పరిధిలో రూ. 5.02 కోట్లకుగాను రూ. 5.84 కోట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో రూ.4.06 కోట్లకుగాను రూ. 4.70 కోట్ల మేర ఆదాయం లభించింది.

కంటి వెలుగు శిబిరం మార్పు

యథావిధిగా పాఠశాల తరగతులు

సాక్షి ఎఫెక్ట్..


కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు (జీ) శివారు తాట్యతండా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు–2 శిబిరాన్ని మార్చారు. కంటి వెలుగు శిబిరాన్ని పాఠశాలలో ఏర్పాటుచేయడంతో విద్యార్థులకు పక్క ఇంట్లో పాఠాలు బోధించారు. దీనిపై శుక్రవారం ‘సాక్షి’ ప్రధాన సంచికలో ‘బడిలో కంటి వెలుగు’.. పక్కింట్లో పాఠాలు’ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన వైద్యాధికారులు తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన క్యాంపును పాఠశాల వెనుక భాగంలోని ఒక గదిలో నిర్వహించారు. పేర్ల నమోదుకు వరండాను ఉపయోగించారు. దీంతో పిల్లలకు తరగతులను గదుల్లోనే నిర్వహించారు.

రెండో రోజు 2.14 లక్షల మందికి కంటి వెలుగు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కంటి వెలుగు కార్యక్రమం రెండో రోజు శుక్రవారం 2.14 లక్షల మందికి పరీక్షలు నిర్వహించారు. దీంతో రెండ్రోజుల్లో 3.81 లక్షల మందికి పరీక్షలు నిర్వహించినట్లయింది. రెండో రోజు 53,719 మందికి రీడింగ్ గ్లాసెస్ పంపిణీ చేశారు. 38 వేలమందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమని గుర్తించారు. కంటి సమస్యలు లేనివారు 1.22 లక్షల మంది ఉన్నట్లు తెలిపారు.

ఐదుగురికి కరోనా పాజిటివ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం 4,223 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఐదుగురు వైరస్ బారిన పడినట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు తెలిపారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరిందని వెల్లడించారు.



- గందరగోళానికి గురిచేసి, కంగారు పెడుతూ దోపిడీ
- క్యూఆర్ కోడ్ పంపి స్కాన్ చేయాలని, పిన్ ఎంటర్ చేయమంటూ ఒత్తిడి
- నేరగాళ్లు చెప్పినట్టు చేసి మోసపోతున్న జనం
- నగదు మన బ్యాంకు ఖాతాలోకి రావాలంటే ఎట్టి పరిస్థితుల్లోనూ క్యూఆర్ కోడ్ చేయకూడదంటున్న నిపుణులు

‘కోడ్’తో కొట్టేస్తున్నారు!

సైబర్ కేటుగాళ్ల కొత్త మోసాలు ● క్విక్ రెస్పాన్స్ కోడ్ స్కానింగుల్లో బురిడీ

→ కొండాపూర్‌కు చెందిన స్వామినాథన్ తన 3 బీహెచ్‌కే ఇంటిని నెలకు రూ.20 వేలకు అద్దెకు ఇస్తానంటూ రియల్ ఎస్టేట్ వెబ్‌సైట్‌లో యాడ్ ఇచ్చారు. రెండురోజుల తర్వాత ఒక వ్యక్తి తాను సీఐఎస్‌ఎఫ్ అధికారి రాజ్‌దీప్‌సింగ్ అని, తనకు పుణే నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయ్యిందంటూ పరిచయం చేసుకున్నాడు. ఇంటి అద్దె అడ్వాన్స్ చెల్లిస్తానని చెప్పి తొలుత కొంత డబ్బు పంపాడు. ఆ తర్వాత మిగతా డబ్బు పంపిస్తానంటూ స్వామినాథన్‌ను గందరగోళానికి గురిచేసి, తాను పంపిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, పిన్ నంబర్ ఎంటర్ చేయాలంటూ తొందరపెట్టాడు. స్వామినాథన్ అలానే చేయడంతో అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.2.5 లక్షలు అవతలి వ్యక్తికి బదిలీ అయిపోయాయి.

→ బల్క్ ఆర్డర్ల పేరిట ఒకేసారి 20 ఫ్రిజ్‌లు కావాలని ఓ షోరూం నిర్వాహకులకు ఒక అపరిచిత వ్యక్తి కాల్ చేశాడు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లిస్తానంటూ వాళ్లు పంపిన క్యూఆర్ కోడ్ ద్వారా తొలుత కొంత డబ్బు పంపాడు. ఆ తర్వాత మరోసారి డబ్బులు పంపించానని, ఆ నగదు మధ్యలో ఆగిపోయిందని చెబుతూ తాను పంపే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పిన్ ఎంటర్ చేయాలంటూ కంగారు పెట్టాడు. అతడు చెప్పినట్టు చేసిన షోరూం నిర్వాహకులు రూ.10 లక్షలు పోగొట్టుకున్నారు.



సాక్షి, హైదరాబాద్: నగదు లావాదేవీల్లో భాగంగా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగిపోయాయి. కొందరు అసలు నగదు అనే మాటే లేకుండా లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే చేసేస్తున్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతూ డబ్బులు కొల్లగొడుతున్నారు. ఆన్‌లైన్ పరిజ్ఞానం అంతగా లేని అమాయకుల్ని మాటలతో మభ్యపెట్టి, గందరగోళానికి గురిచేసి, కంగారు పెట్టేస్తూ బోల్తా కొట్టిస్తున్నారు. రెగ్యులర్‌గా ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించే వారు కూడా కొన్నిసార్లు వీరి బారిన పడుతూ వేలు, లక్షల రూపాయలు నష్టపోతున్నారు. కేటుగాళ్లు కూర్చున్న చోటు నుంచి కదలకుండానే తమ జేబులు నింపుకుంటున్నారు. ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులు అనుసరిస్తున్న సైబర్ నేరగాళ్లు.. తాజాగా క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్) కోడ్ స్కానింగ్‌తో చేసే చెల్లింపులు ఆధారంగా చేసుకుని బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.

సరికొత్త మోసం.. క్యూరిషింగ్



ఇటీవలి కాలంలో క్యూఆర్ కోడ్ వినియోగం గణనీయంగా పెరిగిపోయింది. జేబులో నగదు ఉండాల్సిన పనిలేదు. బ్యాంకులో డబ్బు, చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. పెద్ద షోరూంలు మొదలుకుని చిన్న కిరాణా షాపుల్లో కూడా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా చెల్లింపులు చేయడం సర్వసాధారణంగా మారిపోయింది. నగదు చెల్లింపులకే కాదు..పెద్ద కంపెనీలు తమ వెబ్‌సైట్లు, బిజినెస్ కార్డులు, బ్రోచర్లు, ఇలా ప్రతి సమాచారమూ స్కాన్ చేస్తే చాలు వచ్చేలా క్యూఆర్ కోడ్ ఆప్షన్ ఇస్తున్నాయి. దీంతో సైబర్ దోపిడీగాళ్లు క్యూఆర్ కోడ్‌పై దృష్టి పెట్టారు. దీన్ని వినియోగిస్తూ బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును, అది కుదరకపోతే ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని కొట్టేస్తున్నారు. ఈ సరికొత్త సైబర్ మోసాన్ని సైబర్ సెక్యూరిటీ నిపుణులు క్యూరిషింగ్‌గా చెబుతున్నారు.

క్యూఆర్ కోడ్ మోసాలకు ఇక్కడే ఎక్కువ..

- గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, ఫ్రీ రీచార్జ్ వంటి యూపీఐ యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్‌లలో జరిగే లావాదేవీలను నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు.
- వెబ్‌సైట్‌లో వస్తువుల అమ్మకాల విషయంలో ఎక్కువగా ఈ తరహా మోసాలు జరుగుతున్నాయి.
- కోవిడ్ వెరిఫికేషన్ పేరిట కూడా సైబర్ నేరగాళ్లు ఫేక్ క్యూఆర్ కోడ్‌లను పోస్ట్ చేస్తున్నారు.
- బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పార్కింగ్ ప్రదేశాల్లో, ఇతర కంపెనీలకు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్లపైనా నకిలీ క్యూఆర్ కోడ్ లింక్‌లు పెడుతున్నారు.

ఇలా చేస్తే మేలు..



- అపరిచితులు పంపే ఈ మెయిల్స్, వాట్సాప్, ఇతర డాక్యుమెంట్లలోని క్యూఆర్ కోడ్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ స్కాన్ చేయవద్దు.
- క్యూఆర్ కోడ్ కింద రాసి ఉన్న యూఆర్‌ఎల్ లింక్, మనం స్కాన్ చేసిన తర్వాత వచ్చిన వివరాలు ఒకేలా ఉన్నాయా లేదా? అన్నది సరిచూసుకోవాలి.
- యూపీఐ ఐడీలు, బ్యాంక్ ఖాతాల వివరాలు అపరిచితులతో ఎట్టిపరిస్థితుల్లో షేర్ చేసుకోవద్దు.
- ఓఎల్‌ఎక్స్ లేదా ఇతర వెబ్‌సైట్లలో వస్తువుల క్రయ, విక్రయాలు చేసేటప్పుడు వీలైనంత వరకు ఆన్‌లైన్ చెల్లింపుల కంటే నగదు లావాదేవీలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

అప్రమత్తంగా వ్యవహరించాలి




క్యూఆర్ కోడ్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ‘సైబర్ నేరగాళ్లు క్యూఆర్ కోడ్‌ల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. నకిలీ క్యూఆర్ కోడ్‌లను సృష్టిస్తున్నారు. వీటిని ఉపయోగించి మన వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేస్తున్నారు. అనుమానాస్పద క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసినప్పుడు మనకు తెలియకుండానే మన మొబైల్ ఫోన్‌లోకి కొన్ని సాఫ్ట్‌వేర్స్ ఇన్‌స్టాల్ అవుతుంటాయి. లేదంటే క్యూఆర్ కోడ్‌ను మనం స్కాన్ చేయగానే మనల్ని అవి అన్‌సేఫ్ (సైబర్ నేరగాళ్ల అధీనంలో ఉండే) వెబ్‌సైట్లలోకి తీసుకెళ్లేలా యూఆర్‌ఎల్ లింకులు జత చేసి ఉంటున్నాయి’ అని చెబుతున్నారు.

ఆన్‌లైన్ చెల్లింపుల్లో తొందరపడొద్దు

“ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లలో కొనుగోళ్లు చేసేటప్పుడు తొందరపడొద్దు. అవతలి వ్యక్తులు మనల్ని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలని, పిన్ ఎంటర్ చేయాలని గందరగోళ పెడుతున్నట్లయితే అది మోసమని గ్రహించాలి. మనకు పంపే క్యూఆర్ కోడ్‌ను గమనించినా..మన బ్యాంకు ఖాతా నుంచే డబ్బులు కోతకు గురవుతాయని గుర్తించవచ్చు.

– బి.రవికుమార్‌రెడ్డి, డీఎస్పీ, సీఐడీ సైబర్ క్రైమ్స్

రాష్ట్రంలో నమోదైన సైబర్ నేరాలు..



నేటి నుంచి జేఈఈ మెయిన్స్ హాల్‌టికెట్లు

24 నుంచి పరీక్షలు.. అన్ని పేపర్లలో నెగెటివ్ మార్కులు



సాక్షి, హైదరాబాద్: ఈనెల 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగే జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులు శని, ఆదివారాల్లో విడుదల చేసే అవకాశం ఉంది. ఇందులో పరీక్ష కేంద్రం వివరాలు, సమయం పేర్కొంటారు. పరీక్షకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌కు లాగిన్ అయి అడ్మిట్ కార్డు పొందవచ్చు. జేఈఈ పరీక్షకు తెలంగాణ నుంచి 2 లక్షల మంది హాజరుకానున్నారు. రెండేళ్లుగా కోవిడ్ కారణంగా 21 పట్టణాల్లో పరీక్ష నిర్వహించగా.. ఈసారి వీటిని 17కు తగ్గించారు. జేఈఈ పరీక్ష కేంద్రాల జాబితాను ఎన్టీఏ ఇది వరకే ప్రకటించింది. ఇందులో హయత్‌నగర్, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మేడ్చల్, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్ ఉన్నాయి. ఈసారి అన్ని విభాగాల్లోనూ నెగెటివ్ మార్కింగ్ ఉంటుందని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. దీంతో పాటు మెయిన్స్ సిలబస్‌లోనూ మార్పు చేశారు. మేథ్స్‌లో ప్రపోర్షన్ ఆఫ్ ట్రయాంగిల్స్ (యాజ్ సొల్యూషన్స్ ఆఫ్ ట్రయాంగిల్స్)ను పూర్తిగా తొలగించారు. సెట్స్, రిలేషన్స్, స్టాటిస్టిక్స్, త్రీ డైమెన్షన్, జామెట్రీలో లైన్స్ అండ్ ప్లేన్స్‌పై కొంత భాగాన్ని మేథ్స్‌లో కొత్తగా చేర్చారు. ఫిజిక్స్‌లో యంగ్స్ మాడ్యూల్స్ బై సియర్లస్ మెథడ్‌ను తొలగించారు. కెమిస్ట్రీలో న్యూక్లియర్ కెమిస్ట్రీ, ప్రాక్టికల్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో కెమికల్ ఆఫ్ రెస్పిరేషన్ ఆఫ్ మోనో–ఫంక్షనల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ ఫ్రమ్ బైనరీ మిక్చర్స్ తొలగించారు. వీటితో పలు అంశాలపై సిలబస్‌లో స్పష్టత ఇచ్చారు.

ఈడీ కేసు నమోదు చేయొచ్చా?: హైకోర్టు

ఎంబీఎస్ జ్యువెల్లరీ కేసులో అమికస్‌క్యూరీ నియామకం



సాక్షి, హైదరాబాద్: ఫారెన్ ఎక్స్ఛేంజ్‌లో అవకతవకలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కేసు నమోదు చేయవచ్చో, లేదో తెలియజేయాలని కోరుతూ ఎంబీఎస్ కేసులో హైకోర్టు అమికస్ క్యూరీని నియమించింది. చట్టవిరుద్ధంగా బంగారం, వజ్రాల కొనుగోళ్లకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రముఖ నగల వ్యాపార సంస్థ ముసద్దీలాల్ జెమ్స్ అండ్ జువెల్లర్స్‌పై అక్టోబర్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సంస్థ కార్యాలయాలు, దుకాణాలు, యజమానుల నివాసాల్లో ఈడీ అధికారులు సోదాలు జరిపి రూ.100 కోట్ల విలువైన బంగారు, వజ్రాల నగలను, మరో రూ.50 కోట్ల విలువైన ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. బంగారం, వజ్రాల కొనుగోళ్లకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈడీ కేసును సవాల్ చేస్తూ యజమాని సుఖేశ్‌గుప్తా హైకోర్టును ఆశ్రయించగా న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ శుక్రవారం విచారణ చేపట్టారు. అసలు ఫారెన్ ఎక్స్ఛేంజ్‌లో తేడాలకు సంబంధించి ఈడీ కేసు నమోదు చేయవచ్చా?.. ప్రొసీడింగ్స్ ఆఫ్ క్రైమ్‌గా పరిగణించవచ్చా? అనేది చెప్పాలని అమికస్ క్యూరీగా సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డిని న్యాయమూర్తి నియమించారు. కేసు మెటీరియల్ అంతా ఆయనకు అందజేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారు.

విడివిడిగా విచారణ చేపడతాం

- ఏఐఎస్‌ల కేటాయింపుల కేసుల్లో హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీలకు ఆలిండియా సర్వీస్(ఏఐఎస్) కేడర్ కేటాయింపులకు సంబంధించి దాఖలైన కేసులను విడివిడిగా విచారణ చేపడతామని హైకోర్టు స్పష్టం చేసింది. ఇవి కవర్డ్ మేటర్ల కిందికి రావని, ఇతర కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్) కేసుల్లానే విచారణ చేపడతామని స్పష్టం చేసింది. రెగ్యులర్ బెంచ్‌కు వీటిని బదిలీ చేయనున్నట్లు పేర్కొంటూ.. ఈ మేరకు రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది. 2014లో ఉమ్మడి ఏపీ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. ఈ కేటాయింపులపై క్యాట్‌ను ఆశ్రయించిన కొందరు తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. క్యాట్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం హైకోర్టులో 15 రిట్ పిటిషన్లు దాఖలు చేసింది. వీరిలో ఇద్దరిపై పిటిషన్‌ను ఉపసంహరించుకోగా, తెలంగాణ మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్‌పై తీర్పు వెలువడింది. మిగతా 12 మందిపై దాఖలైన పిటిషన్లలో విచారణ పెండింగ్‌లో ఉంది. శుక్రవారం ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్రం తరపున హాజరైన డిప్యూటీ సొలిసిటర్ జనరల్(డీఎస్‌జీ) గాడి ప్రవీణ్ కుమార్.. ఈ కేసులో వాదనలు వినిపించేందుకు చెన్నై నుంచి అడిషనల్ సొలిసిటర్ జనరల్ రావాల్సి ఉందన్నారు. వారం సమయం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న ధర్మాసనం.. పిటిషన్లు కవర్డ్ మేటర్ల కిందికి రావని, కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా విడివిడిగా విచారణ జరపాలని స్పష్టం చేసింది. ఈ మేరకు రిజిస్ట్రీని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. కాగా పలువురు ఏఐఎస్ అధికారులు కోర్టుకు హాజరయ్యారు.

టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు స్కోచ్ అవార్డులు

హనుమకొండ: తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీఎస్ ఎన్పీడీసీఎల్)కు రెండు ‘స్కోచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్’ అవార్డులు దక్కాయి. శుక్రవారం ఢిల్లీ నుంచి ఆన్‌లైన్ ద్వారా 88వ స్కోచ్ సదస్సు జరిగింది. ఈ మేరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్కోచ్ వైస్ చైర్మన్ గురుశరణ్ డంజల్ స్కాచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డులను ప్రకటించారు. ఐఆర్‌డీఏ జీపీఆర్‌ఎస్ ఎనేబుల్డ్ ఇంటిగ్రేటెడ్ స్పాట్ బిల్లింగ్, డిస్ట్రిబ్యూటెడ్ సోలార్ ఎనర్జీ ఇన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ అవార్డులు వచ్చాయి. ఆ సంస్థ సీఎండీ ఎ.గోపాల్‌రావు ఆన్‌లైన్‌లో అవార్డులు స్వీకరించారు.



ఆన్‌లైన్‌లో అవార్డు స్వీకరిస్తున్న గోపాల్‌రావు

బడ్జెట్‌లో అనవసర ఖర్చులొద్దు: ఎఫ్‌జీజీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ 2023–24లో అభివృద్ధికే ఎక్కువ నిధులు కేటాయించాలని, ఖజానా ఖాళీ అయ్యే పథకాలను పక్కకు పెట్టాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) కోరింది. లేనిపోని ఆర్భాటాలకు పోయి రాష్ట్రాన్ని అప్పులపాలు చేయొద్దని సూచించింది. ఈ ఏడాది అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌పై కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం ఆర్థికమంత్రి తన్నీరు హరీశ్‌రావుకు ఎఫ్‌జీజీ కార్యదర్శి పద్మనాభరెడ్డి లేఖ రాశారు. రైతుబంధు పథకాన్ని 10 ఎకరాల్లోపు భూము లున్న చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులకే వర్తింపజేయాలని కోరారు. మిషన్ కాకతీయ అమలు ద్వారా చెరువులు నిండి భూగర్భ జలాలు పెరిగినందున ఇకపై భారీ ప్రాజెక్టుల జోలికి పోవద్దని సూచించారు. దళితబంధు లోపాలను సరిచేసి ముందుకు వెళ్లాలని, మద్యంపై అధిక పన్నులు వేయాలని కోరారు.

ఇక పక్కాగా ఇన్ఫెక్షన్ల కట్టడి

- ప్రభుత్వ ఆసుపత్రులకు మార్గదర్శకాలు జారీ చేసిన వైద్య, ఆరోగ్యశాఖ
- ఇద్దరు బాలింతల మృతి ఘటనల నేపథ్యంలోనే..



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ల నియంత్రణకు స్పష్టమైన మార్గదర్శకాలను వైద్య, ఆరోగ్యశాఖ మార్గదర్శకాలు ఖరారు చేసింది. అందుకు సంబంధించిన మ్యాన్యువల్‌ను విడుదల చేసింది. గాంధీ ఆసుపత్రి రూపొందించిన ఈ మార్గదర్శకాలు ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ల నియంత్రణకు తోడ్పడతాయని పేర్కొంది. రాష్ట్రంలో అక్కడక్కడా ఇన్ఫెక్షన్ కేసులు నమోదు కావడం, ఇటీవల మలక్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు బాలింతలు ఇన్ఫెక్షన్‌కు గురై మరణించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు పేర్కొన్నారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచడం, రోగుల చికిత్సలకు ఉపయోగించే పరికరాలను స్టెరిలైజ్ చేయడం, పీపీఈ కిట్లు వాడటం, లాండ్రీ నిర్వహణ, ఆరోగ్య సంరక్షణ కార్మికులకు ఇమ్యునైజేషన్ తప్పనిసరి చేయడం వంటివి చేపట్టాలని మార్గదర్శకాల్లో వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది.

ముఖ్యమైన మార్గదర్శకాలు...

- రోగుల మూత్ర నమూనాలు, ఆసుపత్రుల్లోని నీటి నమూనాలు, వెంటిలేటర్లపై ఉన్న రోగుల మందుల నమూనాలను ఎప్పటికప్పుడు ల్యాబ్‌లో పరీక్షించి వాటి ఫలితాలపై ఆసుపత్రి అంటువ్యాధుల నియంత్రణ కమిటీ తగిన నిర్ణయాలు తీసుకోవాలి.
- రోగులకు అందించే ఆహారాన్ని ప్రతి 4 నెలలకోసారి పరీక్షించాలి.
- తాగునీటిలో ఉండే బ్యాక్టీరియాపై నెలవారీ నిఘా చేపట్టాలి. పేషెంట్ కేర్ యూనిట్లు, హాస్పిటల్ కిచెన్, క్యాంటీన్లు, హాస్టళ్ల నుంచి ల్యాబ్‌లో ప్రతి నెలా ఒకసారి తాగునీటి పరీక్ష నిర్వహించాలి.
- వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులకు చేతి శుభ్రత శిక్షణా కార్యక్రమాన్ని నెలకోసారి తప్పని సరిగా నిర్వహించాలి.
- బయో వ్యర్థాల నిర్వహణ, పారబోత విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. సెంట్రల్ స్టోరేజీ ఏరియాలో బయోమెడికల్ వ్యర్థాలను నిల్వ చేయడానికి సురక్షితమైన, వెంటిలేషన్ ఉన్న ప్రాంతం కేటాయించాలి. ఆయా సిబ్బందికి తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాలి.
- అంటువ్యాధుల తీవ్రత ఉన్నప్పుడు రోగులు, సిబ్బంది, సందర్శకుల రాకపోకలను తగ్గించాలి. రోగులను ఐసోలేషన్‌లో ఉంచాలి. వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి.
- అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్న సమయంలో అదనపు సిబ్బందిని నియమించుకోవాలి.
- ఒకేసారి అవుట్‌బ్రేక్ జరిగితే వ్యాప్తిని గుర్తించి ప్రమాదంలో ఉన్నవారెవరో తెలుసుకోవాలి.

‘స్పేస్’లో మన ప్రగతి గర్వకారణం!

- పరిశోధనల ఫలితాలు సామాన్య ప్రజలకూ చేరాలి: గవర్నర్ తమిళిసై
- ‘రీసెంట్ ట్రెండ్స్ ఇన్ స్పేస్ సెక్టార్: న్యూఇండియా’ పేరిట సదస్సు



సాక్షి, హైదరాబాద్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వంటి స్వదేశీ సంస్థల ప్రగతి భారతీయులందరూ గర్వంగా తలెత్తుకుని తిరిగేలా చేస్తోందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పారు. అయితే పరిశోధనల ఫలితాలు సామాన్య ప్రజలకు కూడా చేరినప్పుడే వాటికి సార్థకత అని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని భూభౌతిక పరిశోధన కేంద్రం (ఎన్‌జీఆర్‌ఐ)లో ‘రీసెంట్ ట్రెండ్స్ ఇన్ స్పేస్ సెక్టార్: న్యూ ఇండియా’ పేరిట జరిగిన ఒకరోజు సదస్సులో గవర్నర్ మాట్లాడారు. అంతరిక్ష రంగంలో ఇస్రో ఘనతలను కొనియాడారు. అంతరిక్ష రంగంలో జరిగిన పరిశోధనలు వివిధ రూపాల్లో సామాన్యుడికి ఉపయోగపడ్డాయని వివరించారు. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్‌లు స్కైరూట్, ధ్రువ స్పేస్‌లు దేశంలోనే మొదటిసారి ప్రైవేటుగా రాకెట్, ఉపగ్రహాలను విజయవంతంగా పరీక్షించడాన్ని గవర్నర్ అభినందించారు.

2026 నాటికి అంగారకుడిపైకి మనిషి..

అంతరిక్ష రంగంలో వస్తున్న మార్పులను పరిగణనలోకి తీసుకుంటే.. ఇంకో మూడేళ్లలోనే మనిషి అంగారక గ్రహంపైకి అడుగుపెట్టినా ఆశ్చర్యం లేదని ఇస్రో మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ చెప్పారు. ప్రపంచంలో పౌర అవసరాలు తీర్చేందుకు అంతరిక్ష ప్రయోగాలు చేపట్టిన తొలి దేశంగా భారత్‌కు రికార్డు ఉందని, స్పేస్ టెక్నాలజీని గరిష్ఠంగా ఉపయోగించుకున్నదీ మనమేనని తెలిపారు. ప్రస్తుతం సుమారు 50 ఉపగ్రహాలు దేశానికి సేవలు అందిస్తున్నాయని.. పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటి సంఖ్య రెండు వందలకుపైగా ఉండాలని పేర్కొన్నారు.

అరగంటలో ఖండాలు దాటేయవచ్చు..

అంతరిక్ష రంగంలో రానున్న పదేళ్లు చాలా కీలకమని దేశంలో తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ లిమిటెడ్ సీఈవో పవన్‌కుమార్ చందన తెలిపారు. ప్రపంచంలోని 90కిపైగా దేశాలకు తమవైన ఉపగ్రహాలు లేవని, యాభై శాతం జనాభాకు హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులో లేదని వివరించారు. మరో పది, ఇరవై ఏళ్లలో కేవలం అరగంట సమయంలోనే ఖండాలను దాటేసేందుకు రాకెట్లను ఉపయోగించే పరిస్థితి రానుందని చెప్పారు. విమానాల మాదిరిగానే రాకెట్లను కూడా మళ్లీమళ్లీ వాడుకునే దిశగా స్కైరూట్ పరిశోధన చేపట్టిందని తెలిపారు. సెమినార్‌లో ధ్రువస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో నెక్కంటి సంజయ్, అకాడమీ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్స్ చైర్మన్, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ సీహెచ్ మోహనరావు, ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్ ప్రకాశ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ విభాగం కార్యదర్శి ఎం రవిచంద్రన్ పాల్గొన్నారు.

మరో రూ. 16,000 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఆ సంస్థ ఈ మేరకు ప్రకటన చేసింది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెజాన్ వినియోగదారులకు అత్యుత్తమ క్లౌడ్ కంప్యూటింగ్ సేవలను అందించేందుకు ఏడబ్ల్యూఎస్ ఇప్పటికే చందన్‌వెల్లి, ఫ్యాబ్ సిటీ, ఫార్మా సిటీలో మూడు డేటా సెంటర్ల క్యాంపస్‌లను ఏర్పాటు చేసింది. వాటి మొదటి దశ ఏర్పాటు ప్రక్రియ పూర్తి కావడంతో వినియోగదారులకు పూర్తిస్థాయిలో క్లౌడ్ కంప్యూటింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

అమెజాన్ విస్తరణకు సహకరిస్తాం: మంత్రి కేటీఆర్

అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ, అదనపు పెట్టుబడి ప్రకటనను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు స్వాగతించారు. రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాలకు వెళ్లిన కేటీఆర్ అక్కడి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ‘ఏడబ్ల్యూఎస్ ఎంపవర్ ఇండియా ఈవెంట్’లో ప్రసంగించారు. అమెజాన్ భారీ పెట్టుబడులతో డేటా సెంటర్ హబ్‌గా తెలంగాణ మారుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అమెజాన్ విస్తరణ ప్రణాళికలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. రాష్ట్రానికి వస్తున్న అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఇదొకటని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ–గవర్నెన్స్, హెల్త్‌కేర్, పురపాలక కార్యకలాపాలను మెరుగుపరిచేందుకు ఏడబ్ల్యూఎస్‌తో కలిసి తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. హైదరాబాద్‌లోని ఏడబ్ల్యూఎస్ క్యాంపస్‌లతో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతోపాటు స్టార్టప్‌లకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.

మెడనొప్పి నివారణ ఉపశమనం



ఇటీవలి కాలంలో మెడనొప్పి సమస్య చాలా మందిని వేధిస్తోంది. మెడనొప్పి ఉంటే ఏ పనులూ సరిగ్గా చేయలేం. ఈ మెడనొప్పికి కారణాలు చాలానే ఉన్నాయి. ముందుగా కారణాన్ని తెలుసుకుని, అందుకు తగ్గ చికిత్సను తీసుకుంటే మెడ నొప్పిని సులువుగా తగ్గించుకోవచ్చు.

ఆఫీసులో లేదా వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉన్న వారు గంటల తరబడి కూర్చుని లాప్‌టాప్ లేదా కంప్యూటర్ మీద పనిచేయడం వల్ల మెడనొప్పి వస్తుంది. సాధారణంగా మనం కూర్చునే విధానం సరిగ్గా లేకుంటేనే మెడ నొప్పి వస్తుంది. చిన్న సమస్యే అని తేలిగ్గా తీసేస్తే సమస్య మరింత పెద్దదయ్యే ప్రమాదం ఉంది. అయితే కొన్ని చిట్కాలను అనుసరించడం వల్ల ఈ నొప్పిని తగ్గించుకోవచ్చు. అవేంటంటే..

మెడ నొప్పిని తగ్గించే చిట్కాలు



సరైన భంగిమ: కూర్చున్నప్పుడు లేదా నిలబడినప్పుడు భుజాలు తుంటిపై సమానమైన వాలులో ఉన్నాయని నిర్ధారించుకోండి. అలాగే మీ చెవులు నేరుగా మీ భుజాలకు సమకోణంలో ఉండేట్టు చూసుకోవాలి. సెల్ ఫోన్లు, టాబ్లెట్లు లేదా ఇతర చిన్న స్క్రీన్లు వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఉపయోగిస్తున్నప్పుడు మెడను వంచకూడదు. అలా వంచకూడదంటే ఈ వస్తువులు మీ తలకు అనుగుణంగా కాస్త ఎత్తులో పెట్టాలి. అలాగే మీ వర్క్ టేబుల్, కంప్యూటర్, కుర్చీని సౌకర్యంగా ఉండేలా చూసుకోవాలి.

విరామం అవసరం: ఎక్కువసేపు డ్రైవ్ చేయాల్సి వచ్చినా.. లేదా స్క్రీన్ ముందు గంటల తరబడి పని చేయాల్సి వచ్చినా.. మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవాలి. ముఖ్యంగా మెడను, భుజాలను బాగా కదిలించండి. అలాగే మీ శరీరాన్ని సాగదీయండి.

భుజాలపై ఎక్కువ బరువును వేయద్దు: మీ భుజాలు, చేతులపై ఎక్కువ బరువుండే బ్యాక్ ప్యాక్‌లను మోయకండి. ఎందుకంటే ఇవి మీ భుజాలపై ఒత్తిడిని కలిగిస్తాయి. తద్వారా. మెడ నొప్పి వస్తుంది.

సౌకర్యంగా పడుకోవాలి: మీ తల, మెడ.. మీ శరీరంలోని మిగిలిన భాగాలకు అనుగుణంగా ఉండాలి. మీ తల కింద పెద్ద సైజు దిళ్లను అసలే ఉపయోగించకండి. దిండు లేకుండా ఉండలేమనుకుంటే చిన్న దిండును మాత్రమే ఉపయోగించండి. కాళ్ల కింద దిండును వేసుకుంటే మంచిది. దీనివల్ల వెన్నెముక కండరాలు రిలాక్స్ అవుతాయి.






జీవన శైలిలో మార్పులు: ఒకేచోట ఎక్కువ సేపు కూర్చోవద్దు. ఎక్కువగా తిరగండి. నడవండి. ధూమపానం అలవాటుంటే వెంటనే మానుకోండి. ఎందుకంటే ఇది మెడ నొప్పి వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది.

స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజులు: ఇంటి నుంచి పని చేయడం లేదా ల్యాప్ టాప్‌ల ముందు గంటల తరబడి కూర్చోవడం వల్ల మెడ నొప్పి వస్తుంది. అయితే శరీరాన్ని సాగదీసే స్ట్రెచింగ్ వ్యాయామాల వల్ల మెడ నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. అదేవిధంగా వైద్యులు లేదా ఫిజియో థెరపిస్టులు చెప్పే కొన్ని చిట్కాలను అనుసరించడం వల్ల మెడనొప్పి తొందరగా తగ్గుతుంది.

కాపడం: మెడ నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి, వాపు లేదా మంటను తగ్గించడానికి చల్లని లేదా హీట్ కంప్రెస్ రెండింటినీ ఉపయోగించొచ్చు. ఇది కండరాల సడలింపునకు సహాయపడుతుంది. నొప్పిని తగ్గిస్తుంది. అయితే ఈ టెక్నిక్ ను 20 నిమిషాల కంటే ఎక్కువ సార్లు ఉపయోగించకూడదు.

మసాజ్: మెడ నొప్పికి మసాజ్ థెరపీ వల్ల కండరాలను సడలించవచ్చు. తీవ్రమైన మెడ నొప్పిని తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. అలాగే ఇది రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. ఒత్తిడి, ఆందోళన వంటి లక్షణాలను తగ్గిస్తుంది.

మెడనొప్పి తగ్గడానికి నొప్పి నివారణ మందులు ఉంటాయి. అయితే అలా మందులు వాడటం వల్ల సైడ్ ఎఫెక్టులు తప్పవు. అందువల్ల మందులకు బదులు కొన్ని నొప్పి నివారణ చర్యలు, ఉపశమన చర్యలను పాటించడం మంచిది.



మెడ నొప్పికి కారణాలు

కీళ్ళు అరిగిపోవడం: శరీరంలోని ఇతర కీళ్ల మాదిరిగానే మెడ కీళ్లు కూడా వయస్సు వచ్చే కొద్దీ అరుగుతాయి. ఈ అరుగుదల వల్ల మెడ కదలికలు ప్రభావితం అవుతాయి. దీనివల్ల మెడనొప్పి వస్తుంది.

గాయాలు: తల అకస్మాత్తుగా వెనుకకు, తరువాత ముందుకు కదిలినప్పుడు, నరాలు ఒత్తుకుపోవడం... వల్ల కూడా మెడనొప్పి వస్తుంది.

సరిగ్గా కూర్చోకపోవడం: కంప్యూటర్ లేదా స్మార్ట్ ఫోన్‌లను ఎక్కువ సేపు ఉపయోగించేటప్పుడు సరిగ్గా కూర్చోకపోవడం వల్ల దీనివల్ల కండరాలకు ఒత్తిడి కలుగుతుంది. మంచం మీద పడుకుని లేదా కూర్చొని చదవడం వల్ల కూడా ఒత్తిడికి దారితీస్తాయి. ఇది మెడనొప్పికి కారణమవుతుంది.

రక్తం వృద్ధి అవడానికి...



కొంత మంది కొన్ని విటమిన్ల లోపం వల్ల రక్తలేమితో బాధపడుతుంటారు. రక్తలేమి వల్ల నీరసం, శ్వాస ఆడకపోవడం, కళ్లు తిరగటం, నిస్సత్తువగా ఉండటంతోపాటు అనేకరకాల సమస్యలు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా వృద్ధులకు, గర్భిణులకు రక్తహీనత సమస్య ఎక్కువగా ఎదురయ్యే సమస్య. సాధారణంగా రక్తలేమికి కొన్ని విటమిన్ టాబ్లెట్లు వాడమని వైద్యులు సూచిస్తుంటారు. అయితే అలా మందులు వాడటం వల్ల కొన్ని దుష్ఫలితాలు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల సహజంగానే రక్తం పట్టే ఆహారం తీసుకోమని కూడా చెబుతారు. అలాంటి వాటిలో కొన్ని చిట్కాలు మీకోసం...

- సపోటా జ్యూస్ తాగటం లేదా సపోటా పండ్లు తినడం వల్ల శరీరానికి తొందరగా రక్తం పడుతుంది.
- దానిమ్మ రసం తాగడం, దానిమ్మ పండ్లు తినడం కూడా చాలా మంచిది.
- బూడిద గుమ్మడి శరీర ఆరోగ్యానికి చాలా మంచిది. రోజుకు కప్పు బూడిద గుమ్మడి రసాన్ని తాగుతూ ఉంటే శరీరంలో మంచి రక్తం వృద్ధి అవుతుంది. బూడిద గుమ్మడి కాయ గుజ్జు తీసి దానిని దళసరి గుడ్డలో వేసి బాగా పిండితే వచ్చే రసాన్ని కప్పులో పోసుకుని తాగాలి.
- కిస్‌మిస్ లేదా ద్రాక్షపండ్లు బాగా తింటూ ఉంటే రక్తం వృద్ధి అవుతుంది. పచ్చివి దొరకనప్పుడు ఎండువి తినవచ్చు.
- రాత్రులు గుప్పెడు ఎండు ద్రాక్ష పళ్ళు గ్లాసెడు నీటిలో నానవేసి ఉదయం వాటిని బాగా పిసికి ఆ పిప్పిని పారవేసి ఆ నీటిని తాగాలి. అలా రోజూ తాగుతుంటే ఒక నెలలోనే రక్తం వృద్ధి అవుతుంది.
- ఎండు ఖర్జూరాలతో కూడా పైన చెప్పిన విధంగా చేసి ఆ నీటిని తాగుతుంటే రక్తం వృద్ధి అవుతుంది.
- రాత్రిపూట గుప్పెడు శనగలు నీటిలో నానవేసి ఉదయం తింటూ ఉంటే రక్తం వృద్ధి అయ్యి శరీరం పుష్టిగా అవుతుంది. వ్యాయామం చేసేవారికి ఈ విధానం చాలా మంచిది.
- అంజీర్ పండ్లు తింటున్నా రక్తం వృద్ధి అవుతుంది.
- లేత కొబ్బరి నీరు, లేత కొబ్బరి తింటూ ఉంటే శరీరంలో రక్తం బాగా వృద్ధి అవుతుంది.

వీటిలో మీ శరీర తత్వాన్ని, మీకున్న ఇతర ఆరోగ్య సమస్యలను కూడా దృష్టిలో ఉంచుకుని మీకు ఏవి బాగా సరిపడతాయో, ఏది సులభమో వాటిని అనుసరిస్తే సరి.

పెరటి వైద్యం

తులసి ఇంత ఆరోగ్యం అంత



- ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న తులసి ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. తులసిలో ఆల్సోలిక్ యాసిడ్, యూజినాల్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది జలుబు, జ్వరం వంటి అనేక సమస్యల నుండి ఉపశమనం అందిస్తుంది. అందువల్ల మీకు యూరిక్ యాసిడ్ సమస్య ఉన్నట్లయితే తులసి మీకు ఉత్తమమైనది.
- చక్కెర వ్యాధిగ్రస్తులకు తులసి దివ్యౌషధం. తులసి ఆకులు హైపోగ్లైసీమిక్ స్థాయి నియంత్రణ లక్షణాలను కలిగి ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. దీని కోసం మీరు గుప్పెడు తులసి ఆకులను తీసుకొని రాత్రంతా ఒక గ్లాసు నీటిలో నానబెట్టండి. తర్వాత ఉదయం ఖాళీ కడుపుతో ఆకులు నములుతూ నీళ్లు తాగేసెయ్యండి. ఇలా చేయడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి.
- తులసిలో విటమిన్ ఎ, విటమిన్ డి, ఐరన్, ఫైబర్ వంటి పోషకాలు ఉన్నాయి. ఈ అంశాలన్నీ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. జీర్ణక్రియను బలోపేతం చేయడానికి కూడా తులసి బాగా పనిచేస్తుంది. తులసి ఆకులలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఏజింగ్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. తులసి ఆకుల కషాయాన్ని రోజూ తాగడం వల్ల రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది.

హెల్త్ టిప్స్



- బరువు తగ్గాలనుకున్న వాళ్లు రోజువారీ ఆహారంలో కనీసం ఐదుసార్లు పచ్చికూరగాయలు, పండ్లు తీసుకోవాలి. వాటిలో శరీరానికి అవసరమైన విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ సమృద్ధిగానూ కేలరీలు తక్కువగానూ వుంటాయి.
- భరించరానంత తలనొప్పి తగ్గాలంటే పది తులసి ఆకులు, పది నల్ల మిరియాలను నూరి అందులో టీ స్పూను తేనె కలిపి రోజుకు మూడు సార్లు తినాలి.
- బాదం, గసగసాలు కలిపి తింటే రక్తం శుద్ధి అవుతుంది.
- బాగా నమిలి తినాల్సిన ఆహారాన్ని తీసుకునే వారిలో చర్మం త్వరగా ముడతలు పడకపోవడాన్ని చూస్తుంటాం. ఎక్కువ సేపు నమలడం ద్వారా చర్మపు మెటబాలిజమ్ మెరుగై చర్మం ముడతలు పడదు.
- పెరుగులో బెల్లం, మిరియాల పొడి కలిపిన మిశ్రమాన్ని తీసుకుంటే జలుబు తగ్గుతుంది.
- బొప్పాయి కాయ లేదా, ఆకుని మెత్తగా కాటుకలా నూరి ఆ ముద్దని అరికాళ్ళ ఆనెల మీద పెట్టి, కట్టుకడితే అవి మెత్తబడతాయి.
- గ్లాసు మజ్జిగలో తురిమిన అల్లం లేదా శొంఠి పొడిని, ఉప్పుని కలిపి తీసుకుంటే విరేచనాలు తగ్గుతాయి.
- మూడు టీ స్పూన్ల ఆలివ్ ఆయిల్, రెండు టీ స్పూన్ల యూకలిప్టస్ ఆయిల్‌ను షాంపూలో కలుపుకొని తలస్నానం చేస్తే పేలు పోతాయి..

సినిమా

ఆ విషయంలో నిరాశపడ్డాను!



రాజమౌళి

'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం 95వ ఆస్కార్ అవార్డ్స్‌కు ఇండియా తరపున అఫీషియల్ ఎంట్రీగా ఎంపిక కాకపోవడం అనేది కాస్త నిరుత్సాహపరిచిందని దర్శకుడు రాజమౌళి పేర్కొన్నారు. ఓ ఆంగ్ల ఆన్‌లైన్ పోర్టల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజమౌళి ఈ విధంగా స్పందించారు. ''మన దేశం తరపున 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాకు అధికారిక ఎంట్రీ లభించకపోవడంతో నిరాశ చెందాను. 'ఆర్‌ఆర్‌ఆర్'కు ఆఫీషియల్ ఎంట్రీ లభిస్తే బాగుండేదన్నట్లుగా విదేశీయులు సైతం అనుకుంటున్నారు. అయితే మా సినిమాకు ఎందుకు అధికారిక ఎంట్రీ లభించలేదు? అని పదే పదే ఆలోచిస్తూ ఉండే మనస్తత్వాలు కావు మావి. జరిగిందేదో జరిగిపోయింది. మనం ముందుకు సాగిపోవాలి. అయినా ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) కమిటీ నియమ, నిబంధనలు, మార్గదర్శకాలు వంటి అంశాల గురించి నాకు తెలియదు కాబట్టి నేను ఈ విషయంపై కామెంట్ చేయాలనుకోవడం లేదు. ఇక దేశం తరపున అఫీషియల్ ఎంట్రీగా పంపిన 'ఛెల్లో షో' (గుజరాతీ ఫిల్మ్, ఇంగ్లిష్‌లో 'లాస్ట్ ఫిల్మ్ షో) చిత్రానికి ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో స్థానం లభించినందుకు నాకు సంతోషంగా ఉంది. ఎందుకంటే ఇది కూడా ఇండియన్ సినిమాయే'' అని చెప్పుకొచ్చారు రాజమౌళి. కాగా 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటునాటు' సాంగ్‌కు ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో స్థానం లభించింది. ఇక గుజరాతీ ఫిల్మ్ 'ఛెల్లో షో' ఇండియా తరపున అధికారిక ఎంట్రీగా బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ విభాగంలో షార్ట్‌లిస్ట్ కాగా, 'ఆర్‌ఆర్‌ఆర్'తో పాటు మరో ఎనిమిది ఇండియన్ చిత్రాలు 'ఆస్కార్ రిమైండర్ లిస్ట్'లో ఉన్న సంగతి తెలిసిందే. ఇక 95వ ఆస్కార్ అవార్డ్స్‌కు సంబంధించిన నామినేషన్స్ ఈ నెల 24న వెల్లడికానున్నాయి. అవార్డ్ ఫంక్షన్ మార్చిలో జరగనుంది. 'ఆర్‌ఆర్‌ఆర్' విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన విషయం తెలిసిందే.

డబ్బు కోసమే... డబ్బు, ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకునే ఓ దర్శకుడిగా నేను సినిమాలు తీస్తాను. విమర్శకుల ప్రశంసల గురించి పెద్దగా ఆలోచించను. 'ఆర్‌ఆర్‌ఆర్' ఓ కమర్షియల్ ఫిల్మ్. బాక్సాఫీస్ వద్ద నా సినిమా కమర్షియల్‌గా సక్సెస్ అయితే నేను హ్యాపీ. అవార్డ్స్‌ను బోనస్‌లా భావిస్తాను. అయితే ఓ సినిమా కోసం పడిన కష్టానికి గుర్తింపు లభిస్తే నాకు, నా చిత్రబృందానికి సంతోషం అనిపిస్తుంది'' అని కూడా పేర్కొన్నారు రాజమౌళి. ఇక మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి తర్వాతి సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే.


ముగ్గురూ ఒక్కరే!

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'అమిగోస్'. రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శాండిల్‌వుడ్ బ్యూటీ ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా ఈ చిత్రంలోని 'యెక యెక..' అనే లిరికల్ సాంగ్‌ని శుక్రవారం విడుదల చేశారు. జిబ్రాన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు. ఒకరికొకరు సంబంధం లేని ముగ్గురు వ్యక్తులు మంజునాథ్, సిద్ధార్థ్, మైఖేల్ మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేసే పాట ఇది. ఈ మూడు పాత్రలనూ కల్యాణ్ రామే చేశారు. ఫిబ్రవరి 10న ఈ చిత్రం విడుదల కానుంది.



కల్యాణ్‌రామ్

తిరుపతిలో భారతీయుడు



కమల్‌హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' ('భారతీయుడు') బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు 25 సంవత్సరాల తర్వాత 'ఇండియన్'కు సీక్వెల్‌గా 'ఇండియన్ 2'ని రూపొందిస్తున్నారు. కమల్–శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న ఈ చిత్రం కీలక షెడ్యూల్ ఇటీవల చెన్నైలో జరిగింది. తదుపరి షెడ్యూల్ చిత్రీకరణ తిరుపతిలో ప్రారంభం కానుందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవానీశంకర్, బాబీ సింహా కీలక పాత్రలు చేస్తున్నారు. 'ఇండియన్ 2' సినిమాను ఈ ఏడాదిలోనే రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

పోరాటం అనే పదం నచ్చదు



రకుల్

నార్త్ నుంచి వచ్చి ముందు సౌత్‌లో స్టార్ హీరోయిన్ అయ్యారు రకుల్ ప్రీత్ సింగ్. తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలతో దూసుకెళుతున్న ఈ బ్యూటీ ప్రస్తుతం తమిళంలో 'ఇండియన్ 2', 'అయలాన్'లో నటిస్తున్నారు. కాగా హిందీలో ఆమె నటించిన 'ఛత్రీవాలీ' చిత్రం ఓటీటీలో విడుదలైంది. ఈ చిత్రంలో రకుల్ సురక్షితమైన శృంగారం గురించి పాఠాలు చెప్పే కెమిస్ట్రీ టీచర్‌గా నటించారు. ''కొన్ని విషయాలను బహిరంగంగా మాట్లాడటానికి ఇష్టపడం. అయితే మారుతున్న కాలానికి తగ్గట్టు మనం మారాలి. పిల్లలకు అవగాహన కల్పించాలి. అందుకే ఈ సినిమా చేశాను'' అన్నారు. ఇక.. కెరీర్ ఆరంభంలో తనకు ఎదురైన అనుభవాల గురించి రకుల్ చెబుతూ – ''ఇండస్ట్రీలో నాకు బ్యాక్‌గ్రౌండ్ లేదు. ముంబైలో నేను కాండీవాలీలో ఉండేదాన్ని. కానీ నా ట్రైనర్‌తో కలిసి బాంద్రాలో ఒక కేఫ్‌లో కూర్చుని, ఏయే ఆఫీస్‌కి వెళ్లాలి? ఎన్ని ఆడిషన్స్ ఇవ్వాలి? అని ప్లాన్ చేసేదాన్ని. బాంద్రా, అంధేరీల్లో ఏమైనా ఆడిషన్స్ ఉంటే వెళ్లొచ్చని ఆ కేఫ్‌కి వెళ్లేదాన్ని. బ్యాగులో కొన్ని డ్రెస్సులు పెట్టుకుని, కారులోనే మార్చుకునేదాన్ని. చాన్స్ వచ్చినట్లే వచ్చి చేజారేది. ఒక్కోసారి నాతో షూటింగ్ చేసి, వేరే హీరోయిన్‌ని తీసుకునేవారు. ఇదంతా నేను పోరాటం అనుకోలేదు. ఎందుకంటే కష్టపడకుండా ఈజీగా దక్కాలనుకునే మనస్తత్వం కాదు నాది. అందుకే 'పోరాటం' అనే పదం నాకు నచ్చదు. ఆ రోజు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేశాను కాబట్టే ఈరోజు ఈ స్థాయికి చేరుకోగలిగాను'' అన్నారు.

మనం మనం బరంపురం



మంచు మనోజ్

కొంత విరామం తర్వాత 'వాట్ ది ఫిష్' అనే కొత్త సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు హీరో మంచు మనోజ్. 'మనం మనం బరంపురం' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు, కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు వరుణ్ కోరుకొండ. సిక్స్‌ఐఎక్స్, ఫిల్మ్ బై వి బ్యానర్స్ నిర్మించనున్న ఈ చిత్రం త్వరలోనే ప్రారంభం కానుంది. ''భారతీయ సాంస్కృతిక కంటెంట్‌ను అంతర్జాతీయంగా చూపించాలనే ఆలోచనతో ఈ సినిమా చేస్తున్నాను'' అన్నారు వరుణ్. ''డార్క్ కామెడీ, హై–ఆక్టేన్ థ్రిల్లింగ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుంది. టొరంటో, కెనడా లొకేషన్స్‌లో దాదాపు 75 రోజులు ఈ సినిమా షూటింగ్ ప్లాన్ చేశాం. వివిధ భాషల్లో రూపొందించనున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేసేలా సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సీనియర్ నిర్మాత సూర్యనారాయణ మృతి

సీనియర్ నిర్మాత ఆరువిల్లి సూర్యనారాయణ (83) శుక్రవారం కన్ను మూశారు. హైదరాబాద్‌లోని తన స్వగృహంలో మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఉన్నట్టుండి పడిపోయారట. హాస్పిటల్‌కి తరలించగా అప్పటికే తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు నిర్ధారించారని సూర్యనారాయణ కుటుంబ సభ్యులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ నాగులంకలో పేర్రాజు, లక్ష్మీదేవి దంపతులకు 1939 డిసెంబరు 10న జన్మించారు సూర్యనారాయణ. ఆయనకు నిర్మాత నెక్కంటి సత్యనారాయణ దగ్గరి బంధువు. ఇద్దరూ కలిసి వైజాగ్‌లో పలు వ్యాపారాలు చేశారు. కావలిపాటి విజయలక్ష్మి రాసిన 'విధి విన్యాసాలు' నవల బాగా నచ్చడంతో దాని ఆధారంగా సినిమా తీయాలనుకున్నారు సూర్యనారాయణ. దర్శక–నిర్మాత కేఎస్ ప్రకాశరావును కలిసి 'విధి విన్యాసాలు' నవల ఇచ్చి, దర్శకత్వం చేయమని కోరారు. ఆ నవలనే శోభన్‌బాబు, జమునలతో సత్య చిత్ర పతాకంపై 'తాసిల్దార్‌గారి అమ్మాయి' (1971) సినిమాగా తీశారు. ఆ తర్వాత శోభన్‌బాబు, వాణిశ్రీలతో కె. విశ్వనాథ్ దర్శకత్వంలో 'ప్రేమబంధం' (1976) సినిమా నిర్మించారు సూర్యనారాయణ. 'గంధదుగుడి' అనే కన్నడ చిత్రం చూసి కె. రాఘవేంద్ర రావు దర్శకత్వంలో ఎన్టీఆర్‌తో 'అడివి రాముడు'(1977) నిర్మించారాయన. ఆ తర్వాత కృష్ణతో 'కుమార రాజా' (1978), 'కొత్త అల్లుడు'(1979) వంటి సినిమాలు నిర్మించారు. బాపు దర్శకత్వంలో 'ఏది ధర్మం? ఏది న్యాయం' (1982) సినిమా తీశారు. బాలకృష్ణతో 'భలే తమ్ముడు'(1985) నిర్మించారు. అమితాబ్ బచ్చన్‌తో 'మహాన్'(1983) అనే హిందీ సినిమా తీశారాయన. అప్పటివరకూ నెక్కంటి సత్యనారాయణతో కలిసి సినిమాలు నిర్మించారాయన. అయితే 1988లో సత్యనారాయణ మృతి చెందారు. ఆ తర్వాత సొంతంగా జంధ్యాల దర్శకత్వంలో 'విచిత్ర ప్రేమ'(1991), భరద్వాజ డైరెక్షన్‌లో 'అత్తా నీ కొడుకు జాగ్రత్త' (2003) సినిమాలు నిర్మించారు సూర్యనారాయణ. ఆయనకు భార్య లక్ష్మి, కుమార్తెలు శ్రీదేవి, అరుణ, పద్మ ఉన్నారు. సూర్యనారాయణ మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. మహాప్రస్థానంలో శనివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



మావా బ్రో..

విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రం 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్. విశ్వక్ సేన్ దర్శకత్వంలో వన్మయే క్రియేషన్స్, విశ్వక్ సేన్ సినిమాస్‌పై కరాటే రాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'మావా బ్రో...' అంటూ సాగే రెండో పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. రామ్ మిరియాల స్వరపరచి, పాడిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. ''ప్రతి సామాన్యునికి కనెక్ట్ అయ్యేలా ఈ పాట ఉంటుంది. విశ్వక్ డ్యాన్స్ విజువల్ ట్రీట్‌లా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. తెలుగు, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో ఫిబ్రవరి 17న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, కెమెరా: దినేష్ కె. బాబు.



విశ్వక్ సేన్

ఆమె నటన హార్ట్ టచింగ్

– అడివి శేష్

సుహాస్, టీనా శిల్పరాజ్ హీరో హీరోయిన్లుగా షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. జి. మనోహరన్ సమర్పణలో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం విలేకర్ల సమావేశానికి ఓ ముఖ్య అతిథిగా హాజరై, ట్రైలర్‌ను రిలీజ్ చేసిన అడివి శేష్ మాట్లాడుతూ –''సుహాస్ టెర్రిఫిక్ యాక్టర్. ఇందులో రోహిణిగారి నటన హార్ట్ టచింగ్‌గా అనిపించింది. ఈ సినిమా విజయం సాధించాలి''అన్నారు. ''రైటర్ పద్మభూషణ్ వంటి మంచి చిత్రాన్ని నా దగ్గరకు తీసుకొచ్చిన ప్రశాంత్‌కు, నాకు అండగా ఉంటున్న శరత్, అనురాగ్, చంద్రుగార్లకు కృతజ్ఞతలు'' అన్నారు సుహాస్. ''కలర్‌ఫోటో'కు సహదర్శకుడిగా చేసిన నేను ఇప్పుడు 'రైటర్ పద్మభూషణ్'కు దర్శకత్వం వహించాను'' అన్నారు ప్రశాంత్. ''రైటర్ పద్మభూషణ్'తో పాటు కొత్తవారితో మరో నాలుగు సినిమాలు చేస్తున్నాం'' అన్నారు అనురాగ్, శరత్. ''లహరి మ్యూజిక్ 35ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉంది. చాయ్ బిస్కెట్ వారితో అసోసియేట్ కావడం హ్యాపీ'' అన్నారు చంద్రు. దర్శకులు హరీష్ శంకర్, హను రాఘవపూడి, శివ నిర్వాణ, శశి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సుహాస్, అడివి శేష్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 237	నిఫ్టీ ▽ 80
60,622	18,028

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫన్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,017	▽ 165
డోజోన్స్	33,136	▽ 11
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,771	△ 23
డాక్స్	15,034	△ 113
షాంఘై	3,265	△ 25
నికాయ్	26,554	△ 148

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	57,050 △ 380
బంగారం (99.5 స్వచ్ఛత)	56,822 △ 379
వెండి (కిలో)	68,453 ▽ 1,009

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.45	82.12
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.55	89.59
€	యూరో	ఒకటి	98.98	102.32
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	62.11	64.16
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.14	57.53
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.46	62.45
SAR	సౌదీ రియాల్	[illegible]	20.64	22.31
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.19	22.98
¥	చైనా యువాన్	[illegible]	10.84	12.92

బెంట్లే రూ. 6 కోట్ల కారు



న్యూఢిల్లీ: అల్ట్రా లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం బెంట్లే తాజాగా భారత్‌లో సరికొత్త బెంటేగా ఎక్స్‌టెండెడ్ వీల్‌బేస్ ఎస్‌యూవీ మోడల్‌ను ప్రవేశపెట్టింది. ఢిల్లీ ఎక్స్‌షోరూంలో ధర రూ.6 కోట్లు. 4.0 లీటర్ 550 పీఎస్ వీ8 పెట్రోల్ ఇంజిన్ పొందుపరిచారు. రెండవ తరం బెంటేగా ఆధారంగా రూపుదిద్దుకుంది. వీల్‌బేస్, రేర్ క్యాబిన్ స్థలం 180 మిల్లీమీటర్లు అదనంగా విస్తరించింది. కారు డెలివరీకి 7–8 నెలల సమయం పడుతుంది. 2023లో అమ్మకాల్లో 40 శాతం వృద్ధి ఆశిస్తున్నట్టు బెంట్లే భారత డీలర్‌గా వ్యవహరిస్తున్న ఎక్స్‌క్లూజివ్ మోటార్స్ తెలిపింది. 2022లో దేశంలో కంపెనీ 40 యూనిట్లు విక్రయించిందని ఎక్స్‌క్లూజివ్ మోటార్స్ ఎండీ సత్య బగ్లా వెల్లడించారు. 'అల్ట్రా లగ్జరీ కార్ల విభాగం దేశంలో పెరుగుతోంది. అధిక దిగుమతి సుంకాలే ఈ విభాగానికి ఉన్న ఏకైక సమస్య. దిగుమతి సుంకాలను క్రమంగా ప్రభుత్వం మరింత హేతుబద్ధం చేస్తుందని ఆశిస్తున్నాం' అన్నారు.

గూగుల్‌లో 12 వేల ఉద్యోగాలు కట్..

ఉద్యోగులకు సీఈవో సుందర్ ఈమెయిల్

న్యూయార్క్ / న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఆర్థిక మందగమన భయాల నేపథ్యంలో టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. గూగుల్ కూడా మెటా (ఫేస్‌బుక్ మాతృసంస్థ), మైక్రోసాఫ్ట్, అమెజాన్‌ల బాట పట్టింది. ప్రపంచవ్యాప్తంగా 12,000 ఉద్యోగాల్లో కోత విధిస్తున్నట్లు కంపెనీ సీఈవో సుందర్ పిచాయ్ శుక్రవారం వెల్లడించారు. కార్యకలాపాలను అత్యంత కఠినంగా సమీక్షించుకున్న అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉద్యోగులకు రాసిన ఈమెయిల్‌లో ఆయన తెలిపారు. ప్రాంతాలు, హోదాలకు అతీతంగా ఆల్ఫాబెట్‌వ్యాప్తంగా (గూగుల్ మాతృసంస్థ) తీసివేతలు ఉంటాయని పిచాయ్ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా వ్యాపారం నాటకీయంగా వృద్ధి చెందిందని, దానికి అనుగుణంగానే గణనీయంగా రిక్రూట్ చేసుకున్నామని ఆయన వివరించారు. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయని పిచాయ్ పేర్కొన్నారు. అమెరికాలో ఉద్వాసనకు గురయ్యే ఉద్యోగులకు విడిగా ఇప్పటికే ఈమెయిల్స్ పంపామని, మిగతా దేశాల్లో పాటించాల్సిన పాలసీలు.. చట్టాల కారణంగా ఈ ప్రక్రియలో కొంత ఆలస్యం జరగవచ్చని చెప్పారు. 'ఈ పరిణామాలపై తీవ్రంగా చింతిస్తున్నాను. ఈ మార్పుల వల్ల గూగ్లర్స్ జీవితాలపై ప్రతికూల ప్రభావం పడనుండటం నాకు బాధ కలిగిస్తోంది. ఈ నిర్ణయాలకు పూర్తి బాధ్యత నాదే' అని పిచాయ్ పేర్కొన్నారు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ 10,000, అమెజాన్ 18,000, మెటా 11,000 మంది ఉద్యోగులను తీసివేయనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.



స్విగ్గీలో 380 మందికి ఉద్వాసన

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ కూడా 380 మంది ఉద్యోగులను తీసివేస్తున్నట్లు ప్రకటించింది. స్థూల ఆర్థిక పరిస్థితులు సంక్లిష్టంగా మారిన నేపథ్యంలో వ్యాపార పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ సీఈవో శ్రీహర్ష మాజేటి తెలిపారు. అలాగే త్వరలోనే మీట్ మార్కెట్‌ప్లేస్‌ను కూడా మూసివేయనున్నట్లు కంపెనీ అంతర్గత ఈమెయిల్‌లో ఆయన పేర్కొన్నారు. సరిగ్గా అంచనా వేయలేకపోవడం వల్లే అవసరమైన దానికన్నా ఎక్కువగా హైరింగ్ చేసుకున్నామని, ఆ విషయంలో తాను మరింత మెరుగ్గా వ్యవహరించి ఉండాల్సిందన్నారు.

యూనియన్ బ్యాంక్ లాభం రెండింతలు

ముంబై: ప్రభుత్వరంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) డిసెంబర్ త్రైమాసికానికి పటిష్టమైన పనితీరు చూపించింది. నికర లాభం రెండింతలై రూ.2,245 కోట్లుగా నమోదైంది. గతంలో మాఫీ చేసిన రుణాలు వసూలు కావడం లాభాల వృద్ధికి దోహదపడింది. నికర వడ్డీ ఆదాయం 20 శాతం పెరిగి రూ.8,628 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.19,454 కోట్ల నుంచి 20 శాతానికి పైగా పెరిగి రూ.24,154 కోట్లకు చేరింది. స్థూల ఎన్‌పీఏలు క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఉన్న 11. 62 శాతం నుంచి 7.93 శాతానికి మెరుగుపడ్డాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో ఇవి 8.45 శాతంగా ఉన్నాయి.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-1-2023	
విశాఖ	575–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	84.00
20-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

రిలయన్స్ లాభం 15,792 కోట్లు

- క్యూ3లో 15 శాతం డౌన్...
- అధిక వడ్డీ వ్యయాల ప్రభావం
- ఆదాయం రూ.2,20,592 కోట్లు; 15 శాతం అప్
- జియో, రిటైల్ లాభాల జోరు...

న్యూఢిల్లీ: దేశీ కార్పొరేట్ అగ్రగామి రిలయన్స్ ఇండస్ట్రీస్ కన్సాలిడేటెడ్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (2022–23, క్యూ3)లో 15 శాతం క్షీణించి రూ.15,792 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.18,549 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఆదాయం మాత్రం 15.3% ఎగసి, రూ.1,91,271 కోట్ల నుంచి రూ.2,20,592 కోట్లకు చేరింది. నిర్వహణ పనితీరు పటిష్టంగానే ఉన్నప్పటికీ, అధిక వడ్డీ వ్యయాలు, తరుగుదల (డిప్రిషియేషన్) కంపెనీ లాభాలపై ప్రతికూల ప్రభావం చూపాయి.

రుణభారం పైపైకి...

పర్యావరణానుకూల ఇంధనం (గ్రీన్ ఎనర్జీ)పై భారీ స్థాయిలో పెట్టుబడులు పెడుతున్న రిలయన్స్.. ఇందుకోసం రుణాలను కూడా పెద్ద మొత్తంలో సమీకరిస్తోంది. దీంతో గతేడాది మూడో త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ రుణ భారం ఏకంగా రూ.59,000 కోట్లు ఎగబాకి, ఈ క్యూ3 నాటికి రూ.3,03,530 కోట్లకు చేరింది. ఫలితంగా కంపెనీ వడ్డీ వ్యయాలు ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్‌లో 36.4 శాతం పెరిగి, రూ.5,201 కోట్లుగా నమోదయ్యాయి. ఇతర వ్యయాలు సైతం రూ.5,421 కోట్లకు పెరిగిపోయాయి. ఇక తరుగుదల కూడా 32.6 శాతం ఎగసి రూ.10,187 కోట్లుగా నమోదైంది. అన్ని వ్యాపార విభాగాల్లో అసెట్ బేస్ పెరగడం, డిజిటల్ సేవల వ్యాపారంలో అధిక నెట్‌వర్క్ వినియోగం ఈ పెరుగుదలకు కారణమని కంపెనీ పేర్కొంది. కాగా, క్యూ3 నాటికి కంపెనీ వద్ద రూ.1,93,282 కోట్ల నగదు, తత్సంబంధ నిల్వలు ఉన్నాయి.



కన్సాలిడేటెడ్ ఎబిటా పటిష్టమైన వృద్ధికి అన్ని వ్యాపార విభాగాల జోరు కారణం. యూజర్ల వృద్ధి ఇంకా డేటా వినియోగం భారీగా పెరగడంతో జియో రికార్డు ఆదాయాలు, ఎబిటాను సాధించింది. ఈ ఏడాదిలోనే మేము 5జీ సర్వీసులను ప్రారంభించాం. ప్రస్తుతం 134 నగరాలు, పట్టణాల్లో కస్టమర్లకు భవిష్యత్తు తరం సర్వీసులను అందిస్తున్నాం. కేజీ డీ6 బ్లాక్‌లో గ్యాస్ ఉత్పత్తి గణనీయంగా పుంజుకుంటోంది. 2023–24లో రోజుకు 30 ఎంఎస్‌సీఎండీలకు చేరుకోనుంది.

– ముకేశ్ అంబానీ, రిలయన్స్ సీఎండీ

ఫలితాల్లో ముఖ్యాంశాలు...

- కన్జూమర్ వ్యాపారం, అధిక చమురు–గ్యాస్ ధరల నేపథ్యంలో కంపెనీ స్థూల లాభం (ఎబిటా) క్యూ3లో 13.5 శాతం పెరుగుదలతో రూ.38,460 కోట్లుగా నమోదైంది.
- టెలికంతో సహా డిజిటల్ సేవల ఎబిటా 26 శాతం అధికంగా రూ.12,900 కోట్లకు చేరింది. రిటైల్ ఎబిటా 25 శాతం వృద్ధితో రూ.4,786 కోట్లకు, చమురు–గ్యాస్ విభాగం ఎబిటా రెట్టింపు స్థాయిలో రూ.3,880 కోట్లకు చేరాయి.
- అయితే, ప్రధానమైన చమురు రిఫైనింగ్, పెట్రోకెమికల్స్ వ్యాపారం (ఓ2సీ) ఎబిటా మాత్రం నామమాత్రంగా 3 శాతం వృద్ధి చెంది రూ.13,926 కోట్లకు పరిమితమైంది.
- రిలయన్స్ రిటైల్ నికర లాభం క్యూ3లో 6.2% పెరిగి రూ.2,400 కోట్లను తాకింది. కొత్తగా 789 స్టోర్లను కంపెనీ జతచేసింది.

జియో జోష్...

రిలయన్స్ టెలికం అనుబంధ సంస్థ జియో జోరు కొనసాగుతోంది. డిసెంబర్ క్వార్టర్‌లో కంపెనీ నికర లాభం 28.3 శాతం ఎగబాకి రూ.4,638 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే క్వార్టర్‌లో లాభం రూ.3,671 కోట్లుగా ఉంది. కాగా, మొత్తం ఆదాయం రూ. 19,347 కోట్ల నుంచి రూ. 22,993 కోట్లకు వృద్ధి చెందింది. ఇక మొత్తం కస్టమర్ల సంఖ్య 43.3 కోట్లకు చేరుకుంది. ఇక ఒక్కో యూజర్ నుంచి ఆదాయం (ఏఆర్‌పీయూ) క్యూ3లో 178.2కు చేరింది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో ఇది రూ.151.6గా ఉంది.

రిలయన్స్ షేరు శుక్రవారం 1 శాతం మేర నష్టంతో రూ.2,443 వద్ద ముగిసింది. మార్కెట్లు ముగిసిన తర్వాత కంపెనీ ఫలితాలు వెలువడ్డాయి.

మార్కెట్ రెండో రోజూ డీలా

- అధిక వెయిటేజీ షేర్ల పతనం
- ప్రపంచ ప్రతికూలతల ప్రభావం



ముంబై: అధిక వెయిటేజీ షేర్ల పతనంతో పాటు అంతర్జాతీయ ఆర్థిక మందగమన ఆందోళనలతో దేశీయ స్టాక్ సూచీలు వరుసగా రెండోరోజూ డీలా పడ్డాయి. ఉదయం స్వల్ప లాభాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులతో కదలాడాయి. రిలయన్స్ ఒకశాతం, హెచ్‌యూఎల్ 4%, ఏషియన్ పెయింట్స్ 3%, ఇన్ఫోసిస్ ఒక శాతం పతనంతో ఆఖరికి సెన్సెక్స్ 237 పాయింట్లు నష్టపోయి 60,622 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 80 పాయింట్లు పతనమై 18,028 వద్ద నిలిచింది. లార్జ్‌క్యాప్ షేర్లతో పాటు మధ్య, చిన్న తరహా షేర్లలో విస్తృతంగా విక్రయాలు జరగడంతో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు 0.70% నష్టపోయాయి. మెటల్స్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, రియల్టీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాకులకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,002 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,510 కోట్ల షేర్లను కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 360 పాయింట్లు, నిఫ్టీ 71 పాయింట్లు లాభపడ్డాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 19 పైసలు బలపడి 81.17 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. సెన్సెక్స్ 237 పాయింట్ల పతనంతో బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.57 లక్షల కోట్లు ఆవిరయ్యాయి.

- క్వార్టర్ ఆర్థిక ఫలితాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ షేరు ఒకశాతానికి పైగా నష్టపోయి రూ.2,443 స్థిరపడింది.

హెచ్‌యూఎల్‌కు షేరు 4% డౌన్

మాతృ సంస్థ యూనిలీవర్ గ్రూప్‌నకు చెల్లించే రాయల్టీ, ఇతర సెంట్రల్ సర్వీసుల ఫీజును పెంచేందుకు బోర్డు ఆమోదం తెలపడంతో హెచ్‌యూఎల్ షేరు 4% నష్టపోయి రూ.2,548 వద్ద స్థిరపడింది. దీంతో ఒక్క రోజులోనే కంపెనీ మార్కెట్ వాల్యుయేషన్ రూ.23,941 కోట్లు ఆవిరైంది.

జీఆర్‌టీ జ్యువెలర్స్‌కు ఐజే అవార్డు

హైదరాబాద్: బంగారం వజ్రాభరణాల తయారీ, విక్రయ సంస్థ జీఆర్‌టీ జ్యువెలర్స్ ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ జ్యువెలరీ డిజైన్ ఎక్స్‌లెన్స్ అవార్డును దక్కించుకుంది. ఐజే నిర్వహించిన 12వ ఎడిషన్ పోటీల్లో ఉత్తమ డిజైన్ బ్రాస్‌లెట్ అవార్డును సొంతం చేసుకుంది. జీఆర్‌టీ హస్తకళా నైపుణ్యానికి ఈ అవార్డు ప్రతీక అని కంపెనీ ఎండీ అనంద్ అనంతపద్మనాభమ్ తెలిపారు.



మనిక ఖాతాలో రెండు కాంస్యాలు

వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) దోహా కంటెండర్ టోర్నమెంట్‌లో భారత స్టార్ ప్లేయర్ మనిక బత్రా రెండు కాంస్య పతకాలు సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సత్యన్ జ్ఞానశేఖరన్‌తో కలిసి కాంస్యం నెగ్గిన ఈ ఢిల్లీ అమ్మాయి మహిళల సింగిల్స్‌లోనూ కాంస్య పతకం కైవసం చేసుకుంది. దోహాలో శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో సత్యన్–మనిక ద్వయం 6–11, 11–9, 7–11, 8–11తో షిన్ యుబిన్–లిమ్ జాంగ్‌హూన్ (దక్షిణ కొరియా) జోడీ చేతిలో ఓడిపోయింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో మనిక 6–11, 11–2, 4–11, 2–11తో జాంగ్ రుయ్ (చైనా) చేతిలో ఓడింది.

తొలి టి20లో భారత్ గెలుపు

దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో భారత్ 27 పరుగులతో నెగ్గింది. ముందుగా భారత్ 6 వికెట్లకు 147 పరుగులు చేసింది. అమన్‌జోత్ కౌర్ (41 నాటౌట్; 7 ఫోర్లు) టాప్ స్కోరర్. దక్షిణాఫ్రికా 9 వికెట్లకు 120 పరుగులు చేసి ఓడిపోయింది.

మరో హోరాహోరీకి రె'ఢీ'

రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్‌నారాయణ్ సింగ్ స్టేడియం... 60 వేలకు పైగా సామర్థ్యంతో దేశంలోని మూడో అతి పెద్ద క్రికెట్ మైదానం... ఇప్పుడు తొలి అంతర్జాతీయ మ్యాచ్‌కు సిద్ధమైంది. అయితే భారత్, న్యూజిలాండ్ రెండో వన్డేపై ఆసక్తి పెరిగేందుకు ఇది మాత్రమే కారణం కాదు. బుధవారం హైదరాబాద్ మ్యాచ్ అందించిన వినోదం ఈ సిరీస్‌ను ఒక్కసారిగా ఆసక్తికరంగా మార్చేసింది. భారత్ ఏకపక్ష విజయం సాధించి ఉంటే... కివీస్ 131/6 నుంచి గెలుపు అంచుల దాకా వెళ్లకుండా ఉంటే ఈ మ్యాచ్‌కు ఇంత ఆకర్షణ వచ్చి ఉండేది కాదేమో! ఈ నేపథ్యంలో మరోసారి ఇరు జట్ల మధ్య మ్యాచ్‌లో అదే తరహాలో పరుగుల వరద పారుతుందా అనేది చూడాలి.

- నేడు భారత్, న్యూజిలాండ్ రెండో వన్డే
- ఆత్మవిశ్వాసంతో ఇరు జట్లు
- సిరీస్ గెలిచే లక్ష్యంతో టీమిండియా
- మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



లాథమ్



రోహిత్ శర్మ

రాయ్‌పూర్: సొంతగడ్డపై మరో వన్డే సిరీస్‌ను గెలుచుకునే లక్ష్యంతో భారత జట్టు తమ అస్త్రశస్త్రాలతో సిద్ధమైంది. శనివారం న్యూజిలాండ్‌తో జరిగే రెండో వన్డేలో గెలిస్తే సిరీస్ టీమిండియా ఖాతాలో చేరుతుంది. మరోవైపు పట్టుదలకు మారుపేరైన కివీస్ గత మ్యాచ్‌లో చేజారిన విజయాన్ని అందుకొని సిరీస్ సమం చేయాలని భావిస్తోంది. తొలి వన్డేలో ఇరు జట్ల ఆట, బలాబలాలను చూస్తే హోరాహోరీ పోరు ఖాయం.

ఉమ్రాన్‌కు చాన్స్!

ఒకరు కాదు, ఇద్దరు కాదు... ఒకేసారి ముగ్గురు 'డబుల్ సెంచూరియన్'లు భారత తుది జట్టులో ఆడబోతుండటం విశేషం. ఇది భారత బ్యాటింగ్ బలాన్ని చూపిస్తోంది. రోహిత్, గిల్ ఓపెనర్లుగా మెరుపు ఆరంభం అందిస్తే టీమిండియాకు తిరుగుండదు. గత మ్యాచ్‌లో విఫలమైనా... కోహ్లి ఎప్పుడైనా చెలరేగిపోగలడు కాబట్టి సమస్య లేదు. మిడిలార్డర్‌లో ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్ బాగా ఆడటం జట్టుకు కీలకం. ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా గత కొంత కాలంగా తగిన న్యాయం చేయలేకపోతున్నాడు. బౌలింగ్‌లో సిరాజ్ మినహా మిగతా వారంతా విఫలమవుతున్నారు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు పనికొస్తాడని తొలి వన్డేలో శార్దుల్‌ను తీసుకున్నారు. అయితే అది పెద్దగా ఫలితం చూపలేదు. దానికంటే రెగ్యులర్ బౌలర్‌కే అవకాశం ఇవ్వడం మంచిదని భావిస్తే మూడో పేసర్‌గా ఉమ్రాన్ జట్టులోకి తిరిగొస్తాడు.

సోధి ఆడతాడా!

న్యూజిలాండ్ పోరాటపటిమ ఏమిటో తొలి వన్డేలోనే కనిపించింది. ప్రధాన బ్యాటర్లంతా విఫలమైనా... అనామకుడు అనుకున్న మైకేల్ బ్రేస్‌వెల్ తన విధ్వంసకర బ్యాటింగ్‌ను చూపించాడు. స్పిన్నర్ సాన్‌ట్నర్ కూడా బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడగలనని నిరూపించుకున్నాడు. ఇదే ఆర్డర్‌ను చూసుకుంటే ఎనిమిదో స్థానం వరకు ఆ జట్టులో బ్యాటర్లకు కొదవ లేదు. గత మ్యాచ్‌లో విఫలమైనా... అలెన్, ఫిలిప్స్ మెరుపు షాట్లతో చెలరేగిపోగల సమర్థులు. కాన్వే, కెప్టెన్ టామ్ లాథమ్ కూడా తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే న్యూజిలాండ్ గట్టి పోటీనివ్వగలదు. ఫాస్టెస్ట్ బౌలర్లలో ఒకడైన ఫెర్గూసన్‌ను గిల్ చితక్కొట్టాడు. ఇలాంటి స్థితిలో లెగ్‌స్పిన్నర్ ఇష్ సోధి గాయం నుంచి కోలుకోవాలని జట్టు ఆశిస్తోంది.

పిచ్, వాతావరణం

స్టేడియంలో ఇదే తొలి అంతర్జాతీయ మ్యాచ్. పిచ్‌పై బౌన్స్ కొంత ఎక్కువగా కనిపిస్తోంది. అటు బ్యాటర్లు, ఇటు బౌలింగ్‌కూ అనుకూలం. వర్ష సూచన లేదు.

భారత జట్టుకు జరిమానా

న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో స్లో ఓవర్ రేట్ కారణంగా భారత జట్టుకు ఐసీసీ భారీ జరిమానా విధించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా నిర్ణీత సమయంలో మూడు ఓవర్లు తక్కువగా వేసింది. దాంతో ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 60 శాతం కోత విధిస్తున్నట్లు రిఫరీ జవగల్ శ్రీనాథ్ ప్రకటించారు.

లలిత్ మాయాజాలం ఆంధ్ర ఘనవిజయం

న్యూఢిల్లీ: స్పిన్నర్లు లలిత్ మోహన్ (6/58), షోయబ్ ఖాన్ (3/54)ల బౌలింగ్ ప్రదర్శనతో ఆంధ్ర జట్టు గ్రూప్ 'బి' టాపర్ సౌరాష్ట్రను ఓడించింది. రంజీ ట్రోఫీలో ఆరో మ్యాచ్ ఆడిన ఆంధ్ర 150 పరుగుల తేడాతో సౌరాష్ట్రపై ఘనవిజయం సాధించింది. ఆంధ్రకిది మూడో గెలుపు. శుక్రవారం 343 పరుగుల లక్ష్యంతో 10/1 ఓవర్‌నైట్ స్కోరు వద్ద రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర 56.2 ఓవర్లలో 192 పరుగులకే ఆలౌటైంది. విశేష అనుభవజ్ఞుడైన చతేశ్వర్ పుజారా (91; 11 ఫోర్లు) మాత్రమే ఆంధ్ర స్పిన్నర్లను ఎదుర్కొన్నాడు. అయితే అవతలివైపు మరో బ్యాటర్‌ను నిలదొక్కుకోకుండా లలిత్, షోయబ్ పట్టుబిగించడంతో సౌరాష్ట్ర 200 పరుగులైనా చేయలేకపోయింది. 192 వద్ద పుజారా తొమ్మిదో వికెట్‌గా అవుట్ కాగానే అదేస్కోరు వద్ద ధర్మేంద్రసింగ్ (4)ను లలిత్ మోహన్ బౌల్డ్ చేయడంతో సౌరాష్ట్ర కథ ముగిసింది. ఈ మ్యాచ్‌లో లలిత్ మొత్తం 11 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో లలిత్‌కు ఐదు వికెట్లు లభించాయి.



లలిత్

5 గంటల 45 నిమిషాల్లో... ముర్రే అసాధారణ విజయం



మెల్‌బోర్న్: ప్రపంచ మాజీ నంబర్‌వన్, బ్రిటన్ టెన్నిస్ స్టార్ ఆండీ ముర్రే ఏకంగా 5 గంటల 45 నిమిషాలపాటు పోరాడి ... ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్ అడ్డంకిని దాటాడు. కొకినాకిస్ (ఆస్ట్రేలియా)తో జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ముర్రే 4–6, 6–7 (4/7), 7–6 (7/5), 6–3, 7–5తో గెలుపొంది మూడో రౌండ్‌లోకి చేరాడు. రెండు సెట్‌లు కోల్పోయి మూడో సెట్‌లో 2–5తో వెనుకబడిన దశ నుంచి ముర్రే అసాధారణరీతిలో పుంజుకొని గెలుపొందాడు. మెల్‌బోర్న్ సమయం ప్రకారం ఈ మ్యాచ్ గురువారం రాత్రి 10 గంటల 20 నిమిషాలకు మొదలై శుక్రవారం తెల్లవారుజాము 4 గంటల 5 నిమిషాలకు ముగియడం గమనార్హం. జొకోవిచ్, రాఫెల్ నాదల్ మధ్య 2012 ఫైనల్ (5 గంటల 53 నిమిషాలు) తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సుదీర్ఘంగా సాగిన రెండో మ్యాచ్ ఇదే కావడం విశేషం. తొలి రెండు సెట్‌లు కోల్పోయి ఆ తర్వాత వరుసగా మూడు సెట్‌లు నెగ్గి విజయం సాధించడం ముర్రేకిది 11వసారి కావడం మరో విశేషం. టెన్నిస్‌లో ఈ ఘనత సాధించిన తొలి ప్లేయర్‌గా ముర్రే నిలిచాడు.


మెద్వెదెవ్ అవుట్...



పురుషుల సింగిల్స్ విభాగంలో ఏడో సీడ్, 2021, 2022 రన్నరప్ మెద్వెదెవ్ (రష్యా) మూడో రౌండ్‌లోనే నిష్క్రమించారు. సెబాస్టియన్ కోర్డా (అమెరికా) 7–6 (9/7), 6–3, 7–6 (7/4)తో మెద్వెదెవ్‌ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాడు. మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), ఆరోసీడ్ ఫీలిక్స్ ఆలియాసిమ్ (కెనడా) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. మహిళల సింగిల్స్ విభాగంలో ఆరో సీడ్ మరియా సాకరి (గ్రీస్), పదో సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా), 13వ సీడ్ డానియెలా కొలిన్స్ (అమెరికా) మూడో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), మూడో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా), ఏడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 3–6, 5–7తో అలెగ్జాండర్ ఎర్లెర్–లుకాస్ మిడ్లెర్ (ఆస్ట్రియా) ద్వయం చేతిలో ఓడిపోయింది.

తగ్గేదేలే!

- ఢిల్లీలో కొనసాగుతున్న రెజ్లర్ల ధర్నా
- ఏడుగురు సభ్యులతో ఐఓఏ విచారణ కమిటీ ఏర్పాటు
- అధ్యక్ష పదవి నుంచి దిగిపోనన్న బ్రిజ్‌భూషణ్



న్యూఢిల్లీ: 'దంగల్'లో దిగితే ప్రత్యర్థుల పట్టుపట్టే రెజ్లర్లు ఇప్పుడదే పట్టుదలతో ధర్నా కొనసాగిస్తున్నారు. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)లో ఏళ్ల తరబడి తిష్టవేసుకొని లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను గద్దె దించేదాకా ధర్నా విరమించబోమని స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్, రవి దహియా, బజరంగ్ పూనియా, దీపక్ పూనియా స్పష్టం చేశారు. తమ ప్రాణాలకు ముప్పున్నా వెరువమని, అన్నింటికి సిద్ధపడే న్యాయ పోరాటానికి దిగామని చెప్పారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిని తొలగించడంతో పాటు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని వారంతా పట్టుబడుతున్నారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో రెండు రోజులుగా పలు దఫాలుగా సాగుతున్న రెజ్లర్ల చర్చలు అసంపూర్తిగానే ముగిశాయి. గురువారం తెల్లవారుజాము వరకు మంత్రితో భేటీ అయిన రెజ్లర్ల బృందం శుక్రవారం రాత్రి కూడా సమావేశమైంది. అయితే బ్రిజ్‌భూషణ్‌పై తక్షణ చర్యల విషయంలో క్రీడాశాఖ, ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంతో రెజ్లర్లంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరపాలన్న రెజ్లర్ల డిమాండ్‌కు అనుగుణంగా ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష వ్యవహరించారు. అత్యవసర భేటీ నిర్వహించి ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి న్యాయం చేస్తానని ఉష హామీ ఇచ్చారు. బీజింగ్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, మేటి బాక్సర్ విజేందర్ సింగ్ రెజ్లర్లు ధర్నా చేస్తున్న శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపాడు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దేశానికి పతకం తెచ్చిన రెజ్లర్లు లైంగిక వేధింపులకు గురవడం, న్యాయం కోసం రోడ్డెక్కటం సిగ్గుచేటని అన్నారు. ఇంతటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి (బ్రిజ్‌భూషణ్)పై ఇంకా చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు.

మేరీకోమ్ నేతృత్వంలో కమిటీ...

లైంగిక ఆరోపణల వ్యవహారంపై దర్యాప్తు చేయాలన్న స్టార్ రెజ్లర్ల డిమాండ్‌పై భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) స్పందించింది. అథ్లెట్ దిగ్గజం పీటీ ఉష నేతృత్వంలోని ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సభ్యులు శుక్రవారం సాయంత్రం అత్యవసరంగా సమావేశమయ్యారు. ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉషతో పాటు ఈసీ సభ్యులైన మాజీ షూటర్ అభినవ్ బింద్రా, యోగేశ్వర్ దత్, సంయుక్త కార్యదర్శి కల్యాణ్ చౌబే, ప్రత్యేక ఆహ్వానితులుగా శివ కేశవన్ ఈ ఉన్నతస్థాయి భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా రెజ్లర్లు చేస్తున్నవి తీవ్రమైన ఆరోపణలు కావడంతో వీటిపై నిగ్గు తేల్చేందుకు దిగ్గజ మహిళా బాక్సర్ మేరీకోమ్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఐఓఏ ప్రకటించింది. ఈ కమిటీలో లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, రెజ్లర్ యోగేశ్వర్ దత్, ఆర్చర్ డోలా బెనర్జీ, వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య అధ్యక్షుడు సహదేవ్ యాదవ్, ఇద్దరు న్యాయవాదులు తలీశ్ రే, శ్లోక్ చంద్రలతోపాటు మాజీ షట్లర్ అలకనందా అశోక్ ఉన్నారు.

ఏజీఎం తర్వాతే బ్రిజ్‌భూషణ్ స్పందన



గోండా (ఉత్తర ప్రదేశ్): తీవ్రస్థాయిలో లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్‌భూషణ్ త్వరలోనే ఈ వ్యవహారంపై స్పందిస్తారని ఆయన కుమారుడు, గోండా నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే ప్రతీక్ భూషణ్ సింగ్ శుక్రవారం మీడియాతో అన్నారు. ప్రతీక్ మాట్లాడుతూ 'ఈ నెల 22న డబ్ల్యూఎఫ్ఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరుగుతుంది. ఇది ముగియగానే అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ తనపై వచ్చిన ఆరోపణలపై లిఖితపూర్వక ప్రకటన విడుదల చేస్తారు. ముందుగా ఈ వ్యవహారంపై డబ్ల్యూఎఫ్ఐ అనుబంధ రాష్ట్ర సంఘాలతో చర్చించాల్సి ఉంది. ఇందులో ఏ నిర్ణయం తీసుకున్నా... మీడియాకు తెలియజేస్తాం' అని అన్నారు.

క్లుప్తంగా...

‘కృష్ణా జలాల’పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : కృష్ణా జలాల వాటాల పంపకంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సుప్రీం కోర్టు వాయిదా వేసింది. శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.రామసుబ్రమణియన్లతో కూడిన ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్లు వచ్చాయి. ఇతర పిటిషన్ల విచారణ సందర్భంగా ఈ అంశంపై తర్వాత విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. విచారణ త్వరగా పూర్తి చేయాలని కర్ణాటక, మహారాష్ట్ర తరపు న్యాయవాదులు కోరారు. మార్చి 14న అన్నింటినీ విచారిస్తామని, కర్ణాటక దాఖలు చేసిన ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్‌తోపాటు ఒరిజినల్ పిటిషన్‌పైనా విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

వాషింగ్ మెషీన్ పేలి ఇద్దరికి తీవ్రగాయాలు



కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని ఎన్జీవోస్ కాలనీ సప్తగిరి వీధిలోని ఓ ఇంట్లో వాషింగ్ మెషీన్ పేలి ఇద్దరు వృద్ధ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా రాజూరి బాలయ్య ఇంట్లోని వాషింగ్ మెషీన్ పేలింది. పేలుడు తీవ్రతకు ఇంటి తలుపులు ఊడి పడటంతో పాటు ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న కారు అద్దాలు ధ్వంసం అయ్యాయి. బాలయ్యతో పాటు ఇంట్లో ఉన్న అతని భార్య బాలలక్ష్మికి తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. పేలుడుకు వాషింగ్ మెషీన్ కంప్రెషర్‌లోని గ్యాస్ కారణం కావచ్చని భావిస్తున్నారు. భారీ శబ్దం రావడంతో కాలనీవాసులు భయాందోళనలకు గురయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

గ్రామీణప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు పెంచాలి

పంచాయతీరాజ్ జాతీయ సంస్థ వ్యవస్థాపక దినోత్సవంలో గవర్నర్

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంత ప్రజల జీవనోపాధి, ఆర్థికాభివృద్ధి మెరుగుపడాలంటే రహదారులు, మౌలిక సదుపాయాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని గవర్నర్ తమిళిసై సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కనెక్టివిటీ బాగుంటేనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. రాజేంద్రనగర్‌లోని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ జాతీయ సంస్థ 64వ వ్యవస్థాపక దినోత్సవంలో శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ జాతీయ సంస్థలోని శాస్త్రవేత్తలు, అధికారులు పరిశోధనలు నిర్వహించి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆమె సూచించారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితే.. ఉపాధికి ఎక్కువ అవకాశాలు పెరిగి, పట్టణాలకు వలసలు ఆగిపోతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహారలోపం, పాఠశాలల్లో టాయిలెట్స్ లేకపోవడం కారణంగా పాఠశాలల్లో డ్రాపౌట్స్ అధికంగా ఉంటున్నాయని తెలిపారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలను తక్షణావసరాలుగా గుర్తించి వాటిని కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని గవర్నర్ అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అమలుచేస్తున్న పథకాలపై వారిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణాభివృద్ధి జాతీయ సంస్థ వైద్యం అందుబాటులోకి రావాలని, అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించడానికి వీలైన పరిజ్ఞానంపై వారికి శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు చేపట్టాలని గవర్నర్ సూచించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నరేంద్రకుమార్, ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ రాజీనామా చేయాలి

- గంభీరావుపేటలో ఫ్లెక్సీ కలకలం



గంభీరావుపేట (సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో మంత్రి కేటీఆర్‌కు వ్యతిరేకంగా శుక్రవారం వెలసిన ఫ్లెక్సీ కలకలం సృష్టిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించి ఎనిమిదేళ్లు పూర్తికావొస్తున్నా.. 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయని ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కేటీఆర్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని ఫ్లెక్సీలో డిమాండ్ చేశారు. ఈ ఫ్లెక్సీ అంశం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

బ్లూ.. వైట్.. రెడ్ — మనది కలర్‌ఫుల్ పాస్‌పోర్ట్!



ఉద్యోగం కోసమో లేదా విహారం కోసమో విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు కావాల్సిందే. ఇది అందరికీ తెలిసిందే. అవును.. మీకు పాస్‌పోర్ట్ ఉందా? ఉంటే.. అది ఏ రంగుది? అదేంటి అందరికీ ఒకటే ఉండదా అనేగా మీ డౌటు.. ఉండదు. మన దేశంలో మూడు రంగుల పాస్‌పోర్టులు ఉన్నాయి. ఈ మధ్యే ప్రపంచంలోని పవర్‌ఫుల్ పాస్‌పోర్టుల జాబితా విడుదలైన నేపథ్యంలో మనదేశంలోని పాస్‌పోర్టుల్లోని రకాలపై ఓ లుక్కేద్దామా..

– సాక్షి సెంట్రల్ డెస్క్

ముఖ్యంగా మూడు రంగుల్లో..

మన దేశంలో ప్రధానంగా నీలం, తెలుపు, ఎరుపు రంగుల్లో పాస్‌పోర్టులను జారీ చేస్తారు. ఆ పాస్‌పోర్టులపై ప్రయాణించే వ్యక్తుల ప్రత్యేకత/ప్రాధాన్యతలను, ప్రయాణ అవసరాన్ని వాటితో సులువుగా గుర్తించవచ్చు.

నీలి రంగు



దేశంలోని సాధారణ పౌరులందరికీ నీలి రంగులో ఉండే పాస్‌పోర్టులను జారీ చేస్తారు. మనలో చాలా మంది దగ్గర ఉండేది ఈ రంగుదే. ఉద్యోగం, వ్యాపారం, పర్యాటకంతోపాటు ఏవైనా వ్యక్తిగత, ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లేవారికి ఈ పాస్‌పోర్టులు ఉంటాయి.

తెలుపు రంగు



భారత ప్రభుత్వ అధికారులు విదేశాలకు అధికారిక పర్యటనల నిమిత్తం వెళ్లేందుకు తెలుపు రంగు పాస్‌పోర్టులు జారీ చేస్తారు. మన దేశంతోపాటు విదేశాల్లోని ఎయిర్‌పోర్టుల్లో, ఇమ్మిగ్రేషన్ విభాగాల్లో.. ప్రభుత్వ అధికారులను, అధికారిక పర్యటనలపై వెళ్లేవారిని సులువుగా గుర్తించేందుకు ఇది వీలు కల్పిస్తుంది.

ఎరుపు రంగు



వీటిని దౌత్యపరమైన పాస్‌పోర్టులని కూడా పిలుస్తారు. మన దేశ ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత హోదా పాస్‌పోర్టులు ఇవి. భారత దౌత్యవేత్తలు, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్/ఐపీఎస్/ఐఎఫ్ఎస్ వంటి అఖిల భారత సర్వీసు అధికారులు(అధికారిక పర్యటనలు), విదేశాంగశాఖ అధికారులకు ఈ ఎరుపు రంగు పాస్‌పోర్టులు ఉంటాయి. ఈ పాస్‌పోర్టులు ఉన్నవారికి భారత ప్రభుత్వ అధికార ప్రతినిధులుగా విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. వీసా రహిత ప్రయాణం, వేగంగా ఇమిగ్రేషన్ ప్రక్రియ పూర్తిచేయడం, విమానాశ్రయాల నుంచి త్వరగా రాకపోకలు సాగించడానికి ప్రత్యేక మార్గాల్లో అనుమతి వంటి సదుపాయాలు ఉంటాయి.

నారింజ రంగు



కనీసం పదో తరగతి పూర్తిచేయని వారు, విద్యార్హత ధ్రువపత్రాలు లేనివారి కోసం 2018లో ఈసీఆర్ (ఇమిగ్రేషన్ చెక్ రిక్వైర్డ్) కేటగిరీ కింద నారింజ రంగు పాస్‌పోర్టులను అమల్లోకి తెచ్చారు. దీనిపై విమర్శలు రావడంతో విదేశాంగ శాఖ కొద్దినెలల్లోనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

దేశంలో 9.6 కోట్ల మందికి పాస్‌పోర్టులు

- 2022 డిసెంబర్ నాటికి దేశంలో 9.6 కోట్ల మందికి పాస్‌పోర్టులు ఉన్నాయి.
- ఎప్పుడైనా వివిధ దేశాల మధ్య రాకపోకలకు సంబంధించిన ఒప్పందాల మేరకు సులువుగా వీసా వస్తుంది. వీసా లేకుండానే వెళ్లగలిగే సదుపాయమూ ఉంటుంది. ఎక్కువ దేశాలకు సులువుగా వెళ్లగలిగే వాటిని పవర్‌ఫుల్ పాస్‌పోర్టులుగా చెప్తారు. దీనికి సంబంధించి ఇటీవల వెలువడిన జాబితాలో జపాన్ మొదటి స్థానంలో నిలవగా.. భారత పాస్‌పోర్టు 85వ స్థానంలో ఉంది.
- భారత పాస్‌పోర్టుతో 59 దేశాలకు వీసా రహిత/వీసా ఆన్ అరైవల్ ప్రయాణ సదుపాయాన్ని పొందవచ్చు.

వంకాయ కూర..చింతపండు చారు!

శ్రీ సింగరాయ లక్ష్మీనరసింహస్వామి జాతర స్పెషల్

- వాగు చెలిమల్లోని నీటితో తయారీ
- ఏటా పుష్య అమావాస్య రోజున నిర్వహణ.. నేటి జాతరకు ఏర్పాట్లు పూర్తి
- సిద్దిపేట జిల్లాకు పోటెత్తనున్న భక్తులు



చెలిమల వద్ద జనం

సాక్షి, సిద్దిపేట: జాతర్లకు వెళ్లడం, పూజలు నిర్వహించడంతో పాటు అక్కడే వంటలు చేసుకుని తినడం సర్వసాధారణం. కొన్నిచోట్ల మాంసాహారంతో పాటు శాకాహారం వండుతారు. కొన్నిచోట్ల శాకాహారానికే పరిమితమవుతారు. కానీ శాకాహారం..అందులోనూ ‘ఆహా..ఏమి రుచి..అనరా మైమరచి..’ అంటూ ఓ సినీ కవి అభివర్ణించిన వంకాయ కూరతో పాటు చింతపండు చారు మాత్రమే చేసుకుని అన్నంతో కలిపి ఆరగించడం శ్రీ సింగరాయ లక్ష్మీనరసింహస్వామి జాతర స్పెషల్. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సమీపంలోని కోహెడ మండలం కూరెల్ల-తంగళ్లపల్లి గ్రామాల సరిహద్దుల్లో ఈ శ్రీ సింగరాయ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. దీని వెనకో కథ కూడా ఉంది.

కాకతీయుల కాలంలో ప్రారంభం

కాకతీయుల కాలంలో రాజులు అనువైన చోటల్లా చెరువులు తవ్వించారు. అందులో భాగంగా కాకతీయ చివరిరాజు ప్రతాపరుద్రుడు కూరెల్ల-తంగళ్లపల్లి గ్రామాల వద్ద చెరువు తవ్వే విషయం పరిశీలించాల్సిందిగా సంబంధిత నిపుణుడైన సింగరాయుడుతో పాటు మరికొందర్ని పంపించాడు. వారంతా కొద్దిరోజులు అక్కడే మకాం వేసి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న క్రమంలో బృందంలో కొందరు అనారోగ్యంతో మరణించారు. దీంతో సింగరాయ మినహా మిగిలిన వారంతా తమ పని మధ్యలోనే వదిలేసి ఓరుగల్లుకు తిరిగి వెళ్లిపోయారు. సింగరాయ అక్కడే అడవిలో తిరుగుతున్న క్రమంలో ఓ చోట సొరంగంలో లక్ష్మీ నరసింహస్వామి విగ్రహం కనిపించింది. ఆ విగ్రహానికి ఆయన భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తూ వచ్చాడు. కొద్దిరోజుల తర్వాత సింగరాయుడు కూడా వెళ్లిపోయాడు. ఆ తర్వాత సమీప గ్రామాల ప్రజలు లక్ష్మీనరసింహ స్వామికి పూజలు చేయడం ప్రారంభమైంది. ఈ క్రమంలోనే అక్కడ శ్రీ సింగరాయ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఏర్పడింది. ఏటా పుష్య అమావాస్య రోజున పెద్ద సంఖ్యలో భక్తులు సింగరాయ జాతర నిర్వహించడం ఆనవాయితీగా మారింది. శనివారం అమావాస్య పురస్కరించుకుని జాతర నిర్వహణకు రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి.

చెలిమ నీటిలో ఔషధ గుణాలు!

కూరెల్ల-తంగళ్లపల్లి గ్రామాలను ఆనుకుని మోయతుమ్మెద వాగు తూర్పు నుంచి పడమటకు దట్టమైన వన మూలికల చెట్ల మధ్య నుంచి ప్రవహిస్తుంది. దీంతో ఆ నీటిలో ఔషధ గుణాలు ఉంటాయనేది భక్తుల నమ్మకం. దీంతో ఈ వాగులో స్నానం చేసిన తర్వాత భక్తులు సింగరాయ నరసింహస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తారు. వాగు చెలిమల (నీటి గుంటలు) నుంచి తీసిన నీటితో వంకాయ కూర, చింతపండు చారు సిద్ధం చేస్తారు. ఇటీవలి కాలంలో కొందరు వంకాయ కూరలో టమాటా, చిక్కుడుకాయ కలిపి వండుతున్నారు. అయితే అల్లం, వెల్లుల్లి, జీలకర లాంటి వేమీ ఉపయోగించరు. స్వామి వారికి నైవేద్యంగా సమర్పించిన తర్వాత సహపంక్తి భోజనం చేస్తారు. మోయతుమ్మెద వాగు చెలిమ నీటితో చేసిన వంటలు రుచిగా ఉండటమే కాకుండా దివ్య ఔషధంలా పని చేస్తాయని భక్తులు విశ్వసిస్తారు. ఆరోగ్యానికి మంచిదనే స్థానికులు ఈ నీటిని వినియోగిస్తుంటారు. కాయగూరల్లో వంకాయను మరింత సాత్వికాహారంగా పరిగణించి పూర్వీకులు దీనిని ప్రారంభించారని, వంకాయ కూరతో పాటు చింతపండు చారు చేయడం ఎప్పటినుంచో ఆచారంగా కొనసాగుతోందని స్థానిక పూజారులు తెలిపారు.

చర్మ వ్యాధులు తగ్గిపోతాయి

మేం ప్రతి జాతరకు కుటుంబ సమేతంగా వెళతాం. చెలిమ నీటితో వంకాయ కూర, చారు చేసి స్వామి వారికి నైవేద్యంగా సమర్పిస్తాం. మోయతుమ్మెద వాగులో స్నానం చేయడం వలన చర్మ వ్యాధులు తగ్గిపోతాయి. – శ్రీశైలం, కూరెల్ల

ఒక్కరోజు జాతరకు లక్ష మంది భక్తులు

ఈ జాతర ఒక్కరోజు మాత్రమే జరుగుతుంది. దీంతో పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తుతారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాలతో పాటు హైదరాబాద్ నుంచీ, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలు, మహారాష్ట్రలోని భివండీ, ముంబై, షోలాపూర్ నుంచి సుమారు లక్ష మంది వరకు హాజరవుతారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

భద్రాద్రి జిల్లాలో ఘటన.. లారీని ఢీకొట్టిన కారు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఇల్లెందు/ఇల్లెందు రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు సమీపంలోని జెండాలవాగు వద్ద శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు మృతి చెందారు. ప్రాథమిక సమాచారం మేరకు.. మృతులది హన్మకొండ జిల్లాలోని కమలాపురం మండలంగా తెలుస్తోంది. వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్లుగా పని చేస్తున్న రాము, అరవింద్ ఏపీలోని చింతూరు మండలం మోతెలో జరిగే ఓ వెడ్డింగ్ షూట్‌లో పాల్గొనేందుకు కమలాపురం నుంచి కారు(టీఎస్ 03 ఎఫ్‌సీ 9075)లో బయల్దేరారు. హన్మకొండలో స్నేహితులు రుషి, కల్యాణ్, రణధీర్ జత కలిశారు. ఐదుగురూ కలిసి మహబూబాబాద్ మీదుగా మోతె వెళ్తుండగా ఇల్లెందు సమీపాన జెండాలవాగు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా.. ముగ్గురు ప్రమాద స్థలిలోనే మరణించారు. ఆ మార్గంలో వెళ్తున్న వారు కారులో గాయపడిన ఇద్దరిని కాపాడేందుకు ప్రయత్నించారు. 108కు సమాచారం ఇచ్చి తీవ్రంగా గాయపడిన ఇద్దరిని ఇల్లెందు ఆస్పత్రికి తీసుకు వచ్చారు. వీరిలో ఒకరు ఆస్పత్రిలో మృతి చెందగా, తీవ్ర గాయాల పాలైన రణధీర్‌ను 11:30 గంటలకు ఖమ్మం తరలించారు. ఇతని పరిస్థితి విషమంగానే ఉంది. ప్రమాద స్థలిలో రెండు మృతదేహాలను పోలీసులు కట్టర్ల సాయంతో కారును కట్ చేసి బయటకు తీయాల్సి వచ్చింది.

నేటి నుంచి నాగోబా జాతర

ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో సందడి

- నూతన ఆలయంలో తొలిసారి మహాపూజ
- అధికారికంగా ఏర్పాట్లు పూర్తి.. 24న గిరిజన దర్బార్



నాగోబా ప్రతిమకు పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

సాక్షి, ఆదిలాబాద్: ఆదివాసీ గూడేల్లో జనజాతర సందడి నెలకొంది.గిరిజనుల గుండెల్లో జాతర సవ్వడి ప్రతిధ్వనించనుంది.నాగోబా జాతరకు తోడ్పడి పులకరించేందుకు చెట్టూపుట్టా సిద్ధమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నేటి నుంచి ప్రారంభమయ్యే జాతరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇక్కడ గత డిసెంబర్ 18న ప్రారంభించిన నూతన నాగోబా ఆలయంలో తొలిసారి మహాపూజను వైభవంగా నిర్వహించేందుకు మెస్రం వంశీయులు సన్నద్ధమయ్యారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖమంత్రి అర్జున ముండా మహాపూజలో పాల్గొననున్నారు. 24న జరిగే గిరిజన దర్బార్‌లో రాష్ట్రమంత్రులు పాల్గొంటారు. గిరిజనుల్లోని ఆదివాసీ తెగకు చెందిన మెస్రం వంశీయులకు నాగోబా ఇలవేల్పు. ఏటా పుష్యమాసంలో ఈ నాగోబా మహాపూజ, జాతర నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అమావాస్య నెలవంక కనిపించిన మరుసటి రోజు గంగాజల సేకరణకు మెస్రం వంశీయులు పాదయాత్ర చేపడతారు. ఈ జలంతోనే నాగోబాకు మహాపూజ రోజు అభిషేకం నిర్వహిస్తారు. జనవరి 1న మొదలైన ఈ యాత్ర 18న కేస్లాపూర్‌కు చేరుకుంది. ఇక్కడ నాగోబా ఆలయానికి సమీపంలో ఉండే ఇంద్రాదేవి విగ్రహానికి పూజలు చేసి మర్రిచెట్టు దగ్గర మెస్రం వంశీయులు బస చేస్తారు. మూడు రోజులపాటు అక్కడే ఉండి 21వ తేదీన మహాపూజ నిమిత్తం ఆలయానికి చేరుకుంటారు. జాతరకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు. 28వ తేదీ వరకు అధికారికంగా ఈ జాతర నిర్వహిస్తుండగా, ఆ తర్వాత కూడా కొద్దిరోజులపాటు కొనసాగుతుంది.

గిరిజన దర్బార్‌కు ప్రాముఖ్యత

1940లలో గిరిజన పోరాట యోధుడు కుమురం భీం వీర మరణం తర్వాత అప్పటి నైజాం సర్కార్ గిరిజనుల్లో అసంతృప్తి, తిరుగుబాటుకు కారణం ఏమిటనే విషయంపై పరిశోధన కోసం లండన్‌కు చెందిన ఆంత్రొపాలజిస్ట్ హేమన్‌డార్ఫ్‌ను నియమించింది. ఆయన గిరిజనుల కోసం విద్యా, ఇతర పథకాలను ఏర్పాటు చేశారు. అన్ని దేశీయ సంస్కృతులు, భాషలను సంరక్షించడం కోసం పలు సూచనలు చేశారు. గిరిజనులు అత్యధికంగా కేస్లాపూర్‌లో కలుస్తారని, 1942లో ప్రభుత్వం ఆధ్వర్యంలో అక్కడ గిరిజన దర్బార్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలను ప్రస్తావిస్తారు. ఈవిధంగా అవి నైజాం సర్కార్‌కు చేరేవి. దీంతోనే గిరిజన దర్బార్‌కు అంతులేని ప్రాముఖ్యత ఏర్పడింది. ఈ నెల 24న నిర్వహించే గిరిజన దర్బార్‌కు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ హాజరు కానున్నారు.

అ‘పూర్వ’ స్వర్ణోత్సవం



గోదావరిఖని టౌన్: వారంతా ఐదుపదుల వయసు దాటినవారే.. కానీ ఒక్కసారిగా చిన్నపిల్లల్లా మారిపోయారు. ఎన్నో కష్టాలు.. బాధ్యతలు మోసినవారే.. కానీ ఆ క్షణాన ఆడిపాడారు. యాభై ఏళ్ల కిందట చదివిన తమ బడి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు. గోదావరిఖని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ జెడ్పీహెచ్ఎస్‌లో 1972లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు శుక్రవారం స్థానిక రెడ్డి సంక్షేమ భవనంలో గోలిరమణారెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. మృతి చెందిన తోటివిద్యార్థులకు సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం ఉపాధ్యాయులు రామ సుధాకర్‌రాజు, రామ్‌కిషన్‌రావు, మారుతి, రాజు, పేరయ్య, హేమలతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 65 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం

- భిక్కనూరు పీఎస్ ఎదుట ఆందోళన
- రోడ్డు ప్రమాదం కేసులో ఫిర్యాదు దారుడిని బెదిరించి తెల్లకాగితంపై సంతకం తీసుకున్న ఏఎస్సై
- సదరు ఏఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

భిక్కనూరు: దౌర్జన్యంగా వ్యవహరించిన ఏఎస్సైపై చర్యలు తీసుకోవాలంటూ జరుగుతున్న ఆందోళనలో ఒకరు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు పోలీస్ స్టేషన్ ఎదుట జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 15న అంతంపల్లి గ్రామానికి చెందిన కర్రోల్ల బాలయ్య బైక్ నడుపుతూ భిక్కనూరు టోల్‌ప్లాజా సమీపంలో నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు మృతుని కుమారుడు రవితేజ 16వ తేదీన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఎలాంటి హెచ్చరికలు లేకుండా రోడ్డుపైన లారీ నిలిపి ఉంచడం వల్లనే తన తండ్రి బాలయ్య మృతి చెందాడని ఫిర్యాదు చేశారు. వెంటనే ఏఎస్సై ఆగ్రహంతో ఫిర్యాదు పత్రాన్ని చించివేయించారు. రవితేజతో తెల్లకాగితం పై సంతకాలు తీసుకున్నారు. అనంతరం రోడ్డు ప్రమాదం బాలయ్య తప్పిదం వల్లనే జరిగిందని, లారీ పక్కకు నిలిపి ఉందని రవితేజ ఫిర్యాదు చేసినట్లు పత్రాన్ని రూపొందించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బాలయ్య కుటుంబీకులు, బంధువులు, అంతంపల్లి గ్రామస్తులు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి ధర్నా నిర్వహించారు. స్టేషన్ ఎదుట పాతజాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. బాలయ్య సోదరుడైన చిన్న బాలయ్య ఆవేదన తట్టుకోలేక తన వెంట తెచ్చుకున్న విషపు గుళికలను గుక్కెడు నోట్లో వేసుకున్నాడు. వెంటనే అక్కడ ఉన్న వారు ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఆనంద్‌గౌడ్ పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. ఎలాంటి హెచ్చరికలు లేకుండా రోడ్డుపైన నిలిపి ఉంచిన లారీ డ్రైవర్‌పై ఎందుకు కేసు నమోదు చేయలేదని బాధితులు ప్రశ్నించారు. ఏఎస్సై మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనల మేరకే తాము నడుచుకుంటామని బాలయ్య కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ఎస్సై హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.

ఆ రెండు పథకాలకు పర్యవేక్షణ కమిటీ

- పాలమూరు-రంగారెడ్డి, డిండి పథకాలకు..
- గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కేంద్ర జలశక్తి శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణ కోసం కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ కంటే పైస్థాయి అధికారులతో కూడిన పర్యవేక్షణ బృందం ఏర్పాటైంది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) గత నెల 22న ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ కమిటీ ఏర్పాటుతో పాటు కమిటీ మార్గదర్శకాలను విడుదల చేస్తూ కేంద్ర జలశక్తి శాఖ తాజాగా ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం కృష్ణానదీ జలాల నిర్వహణ బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్, కేంద్ర జలవనరుల కమిషన్ (సీడబ్ల్యూసీ) సభ్యుడు, భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ కంటే పైస్థాయి అధికారి, జాతీయ కాలుష్య నియంత్రణ మండలికి చెందిన జాయింట్ సెక్రటరీ కంటే పైస్థాయి అధికారి ఇందులో సభ్యులుగా ఉంటారు. కృష్ణా పరీవాహక ప్రాంతాలకు చెందిన అన్ని రాష్ట్రాలను భాగస్వాములను చేస్తూ ఎన్ఈఈఆర్ఐ లాంటి ఏజెన్సీల సహకారంతో కృష్ణా నదీజలాల పునరుద్ధరణకు సంబంధించిన కార్యాచరణను ఈ కమిటీ రూపొందించనుంది.

రెండ్రోజుల్లో మంచిప్ప రిజర్వాయర్ జీవో రద్దు చేయాలి

నిర్వాసితుల అల్టిమేటం.. పనుల వద్దే దీక్షలు



కొండెం చెరువు వద్ద దీక్షలు చేపట్టిన నిర్వాసితులు

మోపాల్(నిజామాబాద్ రూరల్): కాళేశ్వరం ప్రాజెక్ట్ 21 ప్యాకేజీలో భాగంగా చేపడుతున్న 3.5 టీఎంసీల సామర్థ్యం గల మంచిప్ప రిజర్వాయర్ పనుల జీవోను రెండ్రోజుల్లో రద్దు చేయాలని నిర్వాసితులు అల్టిమేటం జారీచేశారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం మంచిప్ప గ్రామశివారులో రిజర్వాయర్ పనులు జరుగుతున్న కొండెం చెరువు వద్ద శుక్రవారం నిర్వాసితులు దీక్షలు చేపట్టారు. అక్కడే వంటావార్పు చేస్తూ నిరసన తెలియజేశారు. అంతకుముందు కొండెం చెరువు వద్ద సర్జిపుల్ పనులు నిలిపేయాలని కాళేశ్వరం కొండెంచెరువు రిజర్వాయర్ ముంపు గ్రామకమిటీ ఆధ్వర్యంలో నిర్వాసితులు పాదయాత్రగా తరలివచ్చారు. అడ్డు కునేందుకు పోలీసులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. పనులు చేపడుతున్న కంపెనీ మేనేజర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. 3.5 టీఎంసీల మంచిప్ప రిజర్వాయర్ పనుల జీవో రద్దు చేసే వరకూ ఇక్కడ ఎలాంటి పనులు చేయవద్దని ఇరిగేషన్ డీఈ బాల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడుతున్నామని డీఈ కూడా రాతపూర్వకంగా తెలియజేశారు. సంతృప్తి చెందని నిర్వాసితులు పనుల వద్దే టెంట్ వేసుకుని వంటావార్పుతో నిరసన తెలియజేశారు. రెండ్రోజుల్లో జీవో రద్దు చేయకపోతే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల రాజీనామాలు చేయాలని, లేనిపక్షంలో రానున్న ఏ ఎన్నికల్లోనైనా ఆ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయవద్దని అన్ని గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ తీర్మానం చేశారు. జీవో రద్దు చేస్తే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటామని తీర్మానంలో పేర్కొన్నారు. ముంపు గ్రామకమిటీ ప్రతినిధి శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.